epaper.vaartha.com
WWW.VAARTHA.COM
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
6-12-2025
శనివారం సంపుటి: 31 ,
సంచిక: 305
పేజీలు: 10+4
వెల: 6.50
తాడేపల్లిగూడెం
: fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం


శుక్రవారం న్యూఢిల్లీలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు రాష్ట్రపతి భవన్ వద్ద స్వాగతం పలికిన రాష్ట్రపతి ముర్ము

**రష్యా పౌరులకు 30 రోజులు ఉచిత వీసా: మీడియా మీట్‌లో ప్రకటించిన ప్రధాని మోడీ** 2లో

## భారత్, రష్యా ద్వైపాక్షిక వాణిజ్యం
# 100 బిలియన్ డాలర్లు
### 2030నాటికి ఉభయదేశాల లక్ష్యం

### రక్షణ, వాణిజ్యంతో పాటు అణు ఇంధన రంగంలోనూ భాగస్వామ్యం
### పుతిన్, మోడీ సమక్షంలో పలు కీలక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** భారత్‌లో 25 గంటలపాటు పర్యటించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్; ప్రధాని నరేంద్రమోడీల ద్వైపాక్షిక భేటీ అనంతరం ఇరువురి సమక్షంలో అనేక కీలక ఒప్పందాలు జరిగాయి. వాణిజ్యం, రవాణా, మొబిలిటీ వంటివి ఎక్కువ ఉన్నాయి. 2030 వరకూ ఆర్థిక పరస్పర సహకార కార్యాచరణ కొనసాగనున్నది. ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యం ఉందని ఒప్పందంజరిగింది. రెండుదేశాల్లోని నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ దళాలకోసం రెండుదేశాల ఓడరేవులు, ఎయిర్‌స్పేస్, లాజిస్టిక్స్ సహకారం తీసుకునేందుకు ఒప్పందం జరిగింది. నైపుణ్యం కలిగిన భారతీయ వృత్తినిపుణులు రష్యాకు వెళ్లేందుకు రెండుదేశాలు ఒప్పందంచేసుకున్నాయి. అలాగే రష్యా నిపుణులు వచ్చేందుకు వీలుగా 30రోజుల ఉచిత ఈటూరిస్టు వీసాలనున భారత్ అంగీకరిం >>2

**ఉక్రెయిన్‌పై శాంతియుత పరిష్కారం కోసమే రష్యా కృషి : పుతిన్** 2లో


శుక్రవారం న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతున్న ప్రధాని మోడీ




# ఇండిగో సంక్షోభం
### వెయ్యి పైగా విమానాలు రద్దు
### ఉన్నత స్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశం
### మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి పరిస్థితిని సమీక్షించినకేంద్ర హోంమంత్రి అమిత్‌షా, వెంటనే కంట్రోల్ రూమ్ ఏర్పాటు
### డిజిసిఎ ఆంక్షలు సడలింపు

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో తీవ్ర అంతరాయం మరింత పెరుగుతోంది. శుక్రవారం వెయ్యికిపైగా విమానసర్వీసులు రద్దయ్యాయి. సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ స్పందిస్తూ ప్రయాణీకులకు కలుగుతున్న అసౌకర్యానికి క్షమాపణలుచెప్పారు. శనివారం ఈసంఖ్య వెయ్యి కంటే తక్కువ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 10-15 మధ్యకాలంలో పరిస్థితులు సాధారణస్థితికి వచ్చే అవకాశం ఉందని విడియో సందేశం విడుదల చేసారు. ఫ్లైట్ డ్యూటీ టైమింగ్ >>2



శుక్రవారం చిలకలూరిపేట శారదజిల్లా పరిషత్ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డి.సిఎం పవన్

# విద్యా వ్యవస్థలో కీలక మార్పులు
### డి.సిఎం పవన్ కల్యాణ్

**చిలకలూరిపేట (పల్నాడు జిల్లా), డిసెంబరు 5, ప్రభాతవార్త:** చిలకలూరిపేట శారద జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ కమిటీ సమావేశంలో డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. విద్యావ్యవస్థలో కీలకమైన మార్పులను ప్రభుత్వం తెచ్చిందని, దానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టారన్నారు. దానిలో భాగంగానే >>2

## ఇక విద్యార్థుల
# 'కలలకు రెక్కలు'
### పావలా వడ్డీకే విదేశీ విద్యా రుణాలు
### త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్ షిప్ సమ్మిట్
### రాష్ట్ర విద్యా విధానానికి మూడేళ్లలో గుర్తింపు దక్కాలి
### మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో సిఎం చంద్రబాబు


శుక్రవారం భామిని ఆదర్శపాఠశాలలో మెగా పేరెంట్ టీచర్‌మీటింగ్ 3.0 కార్యక్రమంలో విద్యార్థినితో ముచ్చటిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి లోకేష్

**పార్వతీపురం (పార్వతీపురం మన్యం జిల్లా) డిసెంబరు 5 ప్రభాతవార్త ;** విద్యార్థుల ఉన్నత విద్యకు, విదేశీ విద్యకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ దిశగా కలలకు రెక్కలు పథకాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. విదేశీ విద్య కోసం ఎంత ఖర్చు అవుతుందో అంత మేర పావలా వడ్డీకే రుణం ఇప్పిస్తామని సీఎం ప్రకటించారు. ఉన్నత, విదేశీ విద్య అభ్యసించాలనే కోరికలు, ఆశలను విద్యార్థులు చంపుకోవాల్సిన అవసరం లేదని ఆయన విస్పష్టంగా పేర్కొన్నారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని పాలకొండ నియోజకవర్గం భామిని గ్రామం ఏపీ మోడల్ స్కూల్లో జరిగిన మెగా పేరెంట్ టీచర్‌మీటింగ్ 3.0కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సీఎం మాట్లాడారు. మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన వివిధ ల్యాబ్స్‌ను ఆయన పరిశీలించారు. అలాగే క్లిక్కర్ టూల్ ద్వారా విద్యార్థులకు ఎలాంటి బోధన చేస్తున్నారనే అంశాన్ని స్వయంగా పిల్లలతో కలిసి వీక్షించారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవ్వరూ ఊహించని ఫలితాలు వస్తాయన్నారు. మూడేళ్లలో దేశంలోనే నెంబర్ వన్ చేసేలా ఆంధ్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తెస్తానని మంత్రి లోకేష్ చెప్పారని తెలిపారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారని, విద్యలో పిల్లల బలా బలాలు తెలుసుకునేందుకు స్కై, మోంటెన్, స్టీమ్ అనే మూడు రకాలుగా ఆయన వర్గీకరించారు. క్లిక్కర్ అనే విధానం పిల్లలను మరింత ఆసక్తిగా చదువుకునేలా చేస్తోందని, తాను అనుకున్నదానికంటే విద్యా విధానం మెరుగ్గా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పిల్లలు మట్టిలో మాణిక్యాలని అభివర్ణిస్తూ సరైన గైడెన్స్ ఉంటే ఏదైనా సాధించగలరన్న ధీమా వ్యక్తం చేశారు. విద్యా విధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, నిరంతరం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోందని తెలిపారు. ఈ కారణంగానే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. **కష్టంగా కాదు... ఇష్టంగా చదవండి:** ఒకప్పుడు పిల్లలు భారం అనుకునేవారని, కానీ ఇప్పుడు పిల్లలే ఆస్తి, పిల్లలే శ్రీరామ రక్ష, పిల్లలే భవిష్యత్ అని చంద్రబాబు పేర్కొన్నారు. >>2

## సాదాబైనామాల క్రమబద్ధీకరణకు
# ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
### 2024 జూన్ 15 లోపు ఒప్పందాలకు మరో అవకాశం

**విజయవాడ,డిసెంబరు 5,పభాతవార్త ప్రతినిధి:** సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 2024 జూన్ 15 వరకు తెల్లకాగితాలపై (రిజిష్టర్ కాని భూమి కొనుగోలు పత్రాలు) ఒప్పదాల ద్వారా వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన చిన్న,సన్నకారు రైతులు 2027 డిసెంబరు 31 వరకు ధరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించింది. వీరికి స్టాంపుడ్యూటీ రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండా హక్కులు కల్పిస్తారు. గతంలో పలు దఫాలుగా సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇది 2023 డిసెంబరు 31తో ముగిసింది. రైతుల ఇబ్బందుల నేపథ్యంలో మరోసారి పొడిగించాలని నిర్ణయించింది. భూముల క్రమబద్ధీకరణకు రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ గురువారం మార్గదర్శకాలు జారీ చేశారు. ధరఖాస్తు అందిన 90రోజుల్లోగా పరిష్కరించాలని, విచారణ తర్వాత అసలు ఒప్పంద(అన్‌రిజిష్టర్డ్) పత్రాల్ని సబ్‌రిజిస్ట్రార్ వద్ద దాఖలు చేయాలని, సర్టిఫికెట్ జారీ చేసి రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. ధరఖాస్తు పరిష్కరించడం అంటే తుది ఉత్తర్వులు ఇవ్వడమేనని లేదంటే పెండింగ్‌లో ఉన్నట్లు అని పేర్కొన్నారు. అందులోని ప్రధానాంశాలు. గ్రామీణ ప్రాంతాల్లో సాగు భూములకే వర్తిస్తుంది. చిన్న (2.5 ఎకరాల మాగాణి లేదా 5 ఎకరాల మెట్ట),సన్నకారు (1.25ఎకరాల మాగాణి లేదా 2.5ఎకరాల మెట్ట) రైతులే అర్హులు. రైతుకు ఉన్న మొత్తం భూమితో సాదా బైనా >>2


శుక్రవారం తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఎపి సిఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

## అమరావతికి భవిష్యత్తులో
# అంతర్జాతీయ గుర్తింపు
### రెండు తెలుగు రాష్ట్రాలు సమాంతరంగా అభివృద్ధి చెందాలి: మంత్రి కోమటి రెడ్డి

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు దూరదృష్టికి అనుగుణంగా ఎపి రాజధాని అమరావతి భవిష్యత్తులో అంతర్జాతీయం గుర్తింపును పొందుతుందని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో అనేకంఉంటాయి, అవి ఎన్నిక >>2

## పేద కుటుంబాలకు
# రూ.25లక్షల ఉచిత వైద్యం
### యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుకు చర్యలు

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** పేద,ధనిక తేడా లేకుండా అందరికీ ఉచిత ఆరోగ్య భీమా అందుబాటులోకి వచ్చేలా రూపొందించిన 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' సమర్థ అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవ-ఏబీపీఎంజెఏవై పథకం హైబ్రిడ్ మోడ్‌లో అమలుకు పిలిచిన టెండరులో ఆర్‌ఎఫ్‌పీ, డీసీఏలో కొన్ని సవరణలకు ఆమోదం తెలిపింది. ప్రీబిడ్ సమావేశాల ద్వారా చిన్న చిన్న సవరణలకు టెండరు కమిటీకి అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఆయా >>2



# శ్రీలక్ష్మిపై అభియోగాలకు ఆధారాలు
### తేలిన అంశంపై మళ్లీ పిటిషన్ చెల్లదు..
### 'పెన్నా' కేసులో తెలంగాణ హైకోర్టుకు నివేదించిన సిబిఐ

**విజయవాడ,డిసెంబరు 5,పభాతవార్త ప్రతినిధి:** ఐఏఎస్ అధికారిణీ వై.శ్రీలక్ష్మి జగన్ అక్రమాస్తుల వ్యవహారంలో భాగంగా ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సన్నిహితుడైన ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు లీజుల మంజూరులో అప్పటి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగాలకు ఆధారాలున్నాయని సిబిఐ తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. ఉమ్మడి ఏపీలో పరిశ్రమల శాఖ కార్యదర్శిగా వ్యవహరించిన శ్రీలక్ష్మిపై కేసును కొనసాగించడానికి సీబీఐ అన్ని ఆధారాలను సేకరించిందని తెలిపింది. అంతే కాకుండా గతంలో తేలిన అంశంపై మళ్లీ పిటిషన్ వేయడానికి వీల్లేదని పేర్కొంది. పెన్నా ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా సిమెంట్స్‌కు అనంతపురంజిల్లా యాడికిలో 231 ఎకరాల భూకేటాయింపు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం కౌలపల్లిలో 304.70 హెక్టార్లలో ప్రాస్పెక్టింగ్‌లీజు, రంగారెడ్డి జిల్లా తాండూరులో 822.13 ఎకరాల్లో లీజు రెన్యువల్‌తో పాటు హైదరాబాద్‌లో పయనీర్ హోటళ్ళ నిర్మాణాలకు రాయితీల కల్పనలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, ఇందుకు గాను వైఎస్ రాజశేఖరరెడ్డి కుమారుడైన జగన్మోహనరెడ్డికి చెందిన కంపెనీల్లో ప్రతాప్‌రెడ్డి రూ.68 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు సిబిఐ కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఇందులో నిందితురాలిగా ఉన్న అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి వై.శ్రీలక్ష్మి తనపై కేసును కొట్టివేయాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జూలకంటి అనిల్‌కుమార్ గురువారం విచారణ చేపట్టారు. సీబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ అభియోగ పత్రాన్ని కాగ్నిజెన్స్ తీసుకుంటూ, సిబీఐ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ శ్రీలక్ష్మి గతంలోనే పిటీషన్ దాఖలు చేశారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు పూర్తయి తీర్పు రిజర్వుఅయిన తర్వాత ఉపసంహరించుకున్నారన్నారు. అంటే అవే తుది ఉత్తర్వులని, మళ్ళీ అదే >>2



# సాగును దండగలా మార్చిన బాబు: జగన్

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవసాయాన్ని దండగలా మార్చారని వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. "ఎక్స్" సామాజిక మాధ్యమం వేదికగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేసారు. ఏ పంటకూ కనీస గిట్టుబాటు ధరలేదని మాజీ సిఎం, తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, సంక్షేమహాస్టళ్లు, పిల్లల మరణాలు, మెడికల్ కళాశాలల పిపిపి, విశాఖ స్టీలు అమ్మకం, రెడ్‌బుక్ రాజ్యాంగం, అక్రమ కేసులు, టిటిడి తదితర అంశాలపై సుమారు రెండున్నరగంటలపాటు ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన చూస్తుంటే సేవ్ ఆంధ్రప్రదేశ్ అన్నట్లుగా ఉందని తెలిపారు. తుఫానులో నష్టపోయిన ఏ రైతుకూ పరిహారం అందలేదన్నారు. దాదాపు 15 లక్షల ఎకరాలు నష్టపోతే నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే నష్టంలో చూపించారన్నారు. చంద్రబాబునాయుడు సిఎం అయ్యాక రాష్ట్రంలో 17 సార్లు తుఫాన్లు వచ్చాయని, ఒక్కసారి కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, దాదాపు రూ.1100 కోట్ల బకాయిలు ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేశారని తెలిపారు. 84 లక్షల మంది రైతుల్లో 19 లక్షల మం దికే పంటలబీమా సదుపాయం ఉందని వివరించారు. ధాన్యం 75కిలోల బస్తా >>2

# ఇక విద్యార్థుల 'కలలకు రెక్కలు'

>> డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నామని, స్టూడెంట్ కిట్లపై పార్టీ రంగులు, చిహ్నాలు, ఫొటోలు లేకుండా అందిస్తున్నామని, విలువలతో కూడిన సమాజాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నామని చెబుతూ ఈ దిశగా సహకరించాలని చాగంటి కోటేశ్వరరావును కోరామని తెలిపారు. చాగంటి ప్రవచనాల ద్వారా విలువలను విద్యార్థులు చక్కగా అర్థం చేసుకుంటున్నారని ఆయనన్నారు. గతంలో టీచర్లకు చాలా యాప్‌లు ఉండేవని, ఇప్పుడు అలాంటి ఇబ్బందులను తొలగించామన్నారు. 24 గంటలు రుద్దితే చదువు అబ్బదని వ్యాఖ్యానిస్తూ ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారన్న అభిప్రాయాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు ఇస్తున్నామని అన్నారు. ప్రపంచంలో ఉన్న బెస్ట్ లెర్నింగ్ విధానాలు అధ్యయనం చేస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీని అడ్డుకునే ప్రయత్నం చేశారని, అయితే దాన్ని సమర్థంగా ఎదుర్కొని ఏడాదిలోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. అలాగే సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టే బాధ్యత విద్యార్థులకూ ఉందని సీఎం సూచించారు. గతంలో టీచర్లను అవమానించారని, మద్యం షాపుల దగ్గర నిలబెట్టారని ఆక్షేపించారు. టీచర్లను గౌరవించే బాధ్యత తమదని, పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్థం చేసిందని, తాము సరి చేస్తున్నామని అన్నారు. విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించామని, పిల్లలు అదరగొట్టారని ప్రశంసించారు. వచ్చే ఏడాది జనవరిలో స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్షిప్ సమ్మిట్ నిర్వహించాలని భావిస్తున్నామన్నారు.

**రాష్ట్రంలోని విద్యార్థుల బాధ్యత ఆ శాఖ మంత్రిదే:** మంత్రి లోకేష్ చదువుకునే రోజుల్లో ఎలా చదువుతున్నారనే విషయాన్ని తెలుసుకునేందుకు తాను ఎప్పుడూ స్కూలుకు వెళ్లలేదని, లోకేష్ కు చదువు చెప్పే టీచర్లతో తాను ఎప్పుడూ మాట్లాడలేదని, అంతా లోకేష్ తల్లి భువనేశ్వరే చూసుకునేవారని చంద్రబాబు పేర్కొన్నారు. రాజకీయాల్లోకి రమ్మని లోకేష్ ను తాను ఫోర్స్ చేయలేదని, వ్యాపారం మీద ఇంట్రెస్ట్ ఉంటే వ్యాపారమే చేసుకోవాలని కూడా సూచించానని తెలిపారు. కానీ లోకేష్ రాజకీయా ల్లోకి ఇష్టంతో వచ్చారని, విద్యా శాఖ చాలా కష్టంగా ఉంటుందని చెప్పినా విద్యా విధానాన్ని తీర్చిదిద్దేలా పని చేస్తానని లోకేష్ చెప్పారని చంద్రబాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు మంత్రి లోకేష్‌ను అభినందిస్తున్నానన్నారు. భువనేశ్వరి లోకేష్ ను స్టాన్ ఫోర్డ్ వరకు తీసుకెళ్లారని, ఇప్పుడు రాష్ట్ర విద్యార్థులను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యా శాఖ మంత్రి లోకేష్‌దేనని ముఖ్యమంత్రి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అమలు అవుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. సభ అనంతరం విద్యార్థు లతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సహా విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ ప్రభాకరరెడ్డి కూడా పాల్గొన్నారు.


శుక్రవారం భామినిలో ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సిఎంచంద్రబాబు, మంత్రి లోకేష్

## వారం - వర్జ్యం

06-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
విదియ రా.9.30,జ్యేష్ఠ కార్తె
మృగశిర ఉ.8.50, ఆరుద్ర తె.6.13
వర్జ్యం : ఉ.6.31-9.25
దు.ఉ.6.24-7.57
శుభసమయం : ఉ.8.15-8.45
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, ఉద్యోగ వ్యాపారము స్థితి చెప్పుకో తగిన స్థాయిలో మెరుగవుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహము.

**వృషభం :** బంధు, మిత్రులతో చర్చించిన అభివృద్ధి కార్యక్రమములు ఆచరణలోనికి వస్తాయి. స్త్రీ మూలంగా ధనలాభం.

**మిథునం:** స్పెక్యులేషన్ వైపుకు మొగ్గు చూపే కన్నా స్థిరాస్థులు కొనుగోళ్ళు పైన పెట్టుబడిని మదుపును చేస్తారు. వాహనయోగం.

**కర్కాటకం :** ఆధునిక సాంప్రదాయ పద్ధతులను వ్యతిరేకిస్తారు. సనాతన సాంప్రదాయ విషయముల మీద ఆసక్తి కలుగుతుంది. వస్త్ర లాభం.

**సింహం:** వాగ్దాన భంగము చేసిన వ్యక్తులకు వారి బాధ్యతను ఇచ్చిన మాటను గుర్తు చేస్తారు. అయినా ఫలితం ఉండదు.పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**కన్య :** దూరప్రాంతముల లోని వారికి మీరు సహాయములను చేయవలసి వస్తుంది. శుభవార్తలు వింటారు.ఆర్థిక పరిస్థితి మెరుగవుతుంది.

**తుల :** బ్యాంక్ లావాదేవీలలో తేడాలను, లోపాలను పరిశీలించి మౌనంగా తగు చర్యలు తీసుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం:** నిలిపి వేసిన విద్యా, కళాసంబంధమైన వాటిని పునః ప్రారంభించే సూచనలు వున్నాయి. సోదరుల కలయిక.

**ధనుస్సు:** కార్యాలయంలో మీరు లేకపోయినా సక్రమంగా కార్యక్రమాలను నిర్వహించే వ్యక్తులను ఎంచుకుంటారు.వస్తులాభం.

**మకరం:** ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. వివాదాస్పద అంశాలకు దూరంగా ఉండండి.సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**కుంభం:** దూరప్రాంత ప్రయాణాల వాయిదా వేయడం మంచిది. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి.ఉద్యోగయత్నాలు సాగిస్తారు.

**మీనం:** ప్రేమ విషయములో నిదానం అవసరం.ముఖ్య వ్యవహారాలన్ని గౌరవ మర్యాదలకు, ప్రతిష్ఠకు ఎక్కువ విలువను ఇస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విద్యా వ్యవస్థలో కీలక మార్పులు

>> శారద జిల్లా పరిషత్తు హై స్కూల్లో మెగా పేరెంట్స్ మరియు టీచర్స్ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఇదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ మెగా పేరెంట్స్ కమిటీ మీటింగ్ లో జరుగుతున్నాయని, వీటిలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శాఖ మంత్రి లోకేష్‌లు కూడా పాల్గొంటున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఈ పేరెంట్స్ కమిటీ మీటింగ్లో ఉపాధ్యాయులు పిల్లలు ఎలా తీర్చిదిద్దుతున్నారనేది తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులను గౌరవించటం విద్యార్థులు నేర్చుకోవాలని పవన్ కళ్యాణ్ విద్యార్థులకు తెలియజేశారు. వారు ఉన్నత స్థాయికి వెళతారని ఆయన అన్నారు. విద్యార్థులకు స్కిల్ ఓరియెంటెడ్ శిక్షణకూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు .శారదా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కావలసిన అన్ని విభాగాలలో శిక్షణ ఇస్తున్నారు అన్నారు. ఆడపిల్లలకు ఆత్మ రక్షణ కోసం కరాటే కూడా నేర్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శారదా హైస్కూల్ విద్యార్థులు చేసిన కరాటే ప్రక్రియ తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు వీరికి శిక్షణ ఇచ్చిన గౌస్యాన్ను ప్రత్యేకంగా అభినందించారు . చిలకలూరిపేట నియోజకవర్గ అభివృద్ధికి శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ చిలకలూరిపేట వాసి కావడం నాకు ఇప్పుడే తెలిసింది అన్నారు. వారి తాత మైలవరపు గుండయ్య కోట్లాది రూపాయలు చిలకలూరిపేట అభివృద్ధికి విరాళంగా అందజేసిన సంగతి తెలిసిందన్నారు ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులందరినీ అభినందిస్తున్నానని అన్నారు.శారద జిల్లా పరిషత్ హై స్కూల్ కు కావలసిన లైబ్రరీ ఏర్పాటుకు తాను పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. అదేవిధంగా పాఠశాలకు 25 కంప్యూటర్లు కూడా తాను స్వయంగా అందజేస్తానని పవన్ కళ్యాణ్ సభలో ప్రకటించారు .హర్యానా రాష్ట్రం నుంచి జిల్లా కలెక్టర్ గా ఇక్కడికి విచ్చేసిన కృతిక శుక్ల తెలుగులో మాట్లాడటం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పేరెంట్స్ టీచర్స్ మేళాలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ రంజిత్ భార్గవ, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల, జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆర్డీవో మధులత డి.ఎస్.పి హనుమంతరావు డిఇఓ చంద్రకళ ఐ ఎన్ పి ఆర్ డి డి దీప్తి, పట్టణ సిఐపి రమేష్ జనసేన ఉమ్మడి జిల్లా కన్వీనర్ గాది వెంకటేశ్వర్లు నియోజకవర్గం జనసేన నియోజకవర్గ యువ నాయకులు మండలనేని చరణ తేజ కూటమి నాయకులు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, చిలకలూరిపేట మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ సింగ్ విద్యాశాఖకు సంబంధించిన అధికారులు. నియోజకవర్గ పరిధిలోని పోలీస్ రెవెన్యూ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత పట్టణంలో జనసేన యువ నాయకులు మండలిని చరణ్ తేజ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కు భారీ స్వాగత ఏర్పాటు చేశారు.

# బర్మింగ్‌హామ్‌లో అగ్నిప్రమాదం: ఇద్దరు తెలుగు విద్యార్థులు దుర్మరణం



**బర్మింగ్‌హామ్, డిసెంబరు 5:** అమెరికాలోని అలబామా రాష్ట్రంలోని బర్మింగ్‌హామ్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. తెలుగు విద్యార్థుల ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్లో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన 10 మంది విద్యార్థులు బర్మింగ్‌హామ్‌లో ఉంటూ అలబామా యూనివర్సిటీలో చదువుతున్నారు. శుక్రవారం వీరు ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం తెలియగానే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పేసి విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. అయితే ఈ ఘటనలో తీవ్రంగా గాయాలైన ఇద్దరిని ఆస్పత్రిలో చేర్పించారు. బర్మింగ్‌హామ్‌లో అగ్ని ప్రమాదం వార్త తెలియగానే అమెరికాలోని తెలుగు సంఘాలు, అలబామా యూనివర్సిటీ అధికారులు వెంటనే స్పందించారు. ప్రమాదంలోంచి బయటపడినతీవ్రంగా గాయపడిన వారికి అవసరమైన సహాయం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతిచెందారు. ఉడుముల సహజరెడ్డి, కూకట్‌పల్లికి చెందిన మరొక విద్యార్థి ఉన్నట్లు తేలింది. వీరు అలబామా వర్సిటీలో ఉన్నత విద్యనభ్యసిస్తున్నట్లు గుర్తించారు.

# అంతర్జాతీయ గుర్తింపు

>> లకు పరిమితం అన్నారు.ఇరుగుపొరుగు రాష్ట్రాలు అనేకంశాల్లో కలిసి ఉండాలన్నారు.ఏపీ,టీజీ సమాంతరంగా అభివృద్ధి చెందాలన్నారు. పరిస్థితులను బట్టే ప్రత్యర్థి పార్టీనేతలపై విమర్శలుంటాయి. రాజకీయ కోణంలోనే గతంలో ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసానన్నారు.ఇక కోనసీమపై తమ పవన్ వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎపి,టిజి మధ్య మంచి సంబంధాలే ఉన్నాయి.అవి అలాగే కొనసాగుతాయి. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సిఎం చంద్రబాబును ఆహ్వానించేందుకు తాను అమరావతికి వచ్చానని తెలిపారు. తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. డిసెంబర్ 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో జరప తలపెట్టిన ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రిని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'ను దావోస్ సమ్మిట్ తరహాలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల నిపుణులు సదస్సుకు హాజరవుతున్నట్టు ముఖ్యమంత్రికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వివరించారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.మాట్లాడుతూ హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ఏర్పాటయ్యాక పక్కనే రహేజా మైండ్ స్పేస్‌లో ఐదు లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. బెంగళూరు తర్వాత హైదరాబాద్ ఐటీ రంగంలో రెండో స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోందన్నారు.ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల సిఎంలను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎపి ముఖ్యమంత్రి, సీనియర్ నేత చంద్రబాబు నాయుడును ఆహ్వానించేందుకు వచ్చానని తెలిపారు. సిఎం చంద్రబాబు తప్పకుండా సమ్మిట్‌కు హాజరవుతారనే తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో కోకాపేట ఏరియాలో భూముల విలువ రూ.100 కోట్లు పలుకుతున్నాయని వివరించారు. అందుకే ఆదిభట్ల వద్ద ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఇప్పుడు ఇంజనీరింగ్ పూర్తయిన విద్యార్థుల్లో స్కిల్స్ ఉండటం లేదని... వారికి పలు అంశాలపై అవగాహన కల్పించేలా తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

# సాగును దండగలా మార్చిన బాబు: జగన్

>> 1200కు అడుగుతున్నారని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అనంతపురం, తాడిపత్రి నుండి ఢిల్లీకి రైళ్లు నడిపామని తెలిపారు. పులివెందులలో 600 టన్నులతో కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తే నిర్వహించడం లేదని అన్నారు. సూపర్‌సిక్స్ అమలు చేయలేదని, నిరుద్యోగభృతి, ఆడబిడ్డనిధి, 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. తల్లికి వందనంలో 30లక్షల మందిని తగ్గించారని, రూ.30 వేలు ఇవ్వాల్సి ఉంటే రూ.10వేలు చొప్పున ఇచ్చారన్నారు. ఉచిత సిలిండర్లు మూడు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు.విద్యావ్యవస్థ దెబ్బతిందని, జిఇఆర్ తగ్గిందని, డ్రాపవుట్స్ పెరిగాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లేదని, 8క్వార్టర్లు రూ.5600 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఉచిత బస్సు కొన్నిట్లోనే అనుమతి ఇస్తున్నారని, ఇది మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్కూళ్లను నాశనం చేశారని, హాస్టళ్లలో కలుషిత ఆహారం, నీటివల్ల 18 నెలల్లో 28 మంది పిల్లలు చనిపోయారని అన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ అయ్యాయని, రూ.5కోట్ల టర్నోవర్ కూడా లేనిసంస్థకు 108, 104 నిర్వహణ బాధ్యతలు ఇచ్చారని తెలిపారు.మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించి అందులో పనిచేసే సిబ్బందికి రెండేళ్లపాటు ప్రభుత్వం జీతం ఇస్తుందని, ఇదో పెద్ద కుంభకోణమని పేర్కొన్నారు. లాభాలు ప్రైవేటుకు ఇచ్చి భారం ప్రభుత్వానికి వేస్తున్నారని వివరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఈనెల 16న గవర్నర్‌కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐదు డిఏలు పెండింగ్‌లో ఉంటే ఒకటి మాత్రమే ఇచ్చారని అన్నారు. డిఏ బకాయిలు పదవీ విరమణ తరువాత ఇస్తామని చెప్పిన ప్రభుత్వం చరిత్రలో లేదని అన్నారు. ఎన్నో పోరాటాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును పద్ధతి ప్రకారం దెబ్బతిస్తున్నారని అన్నారు.

**పల్నాడు ఘోర రోడ్డు ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి:** ఎంతో ఉన్నత భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ప్రమాదంలో మరణించడం తనను తీవ్రంగా కలచివేసిందని వైఎస్.జగన్ పేర్కొన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాదెండ్ల మండలం గణపవరం వద్ద బైపాస్ రహదారిపై గురువారంరాత్రి ఓ కారు కంటెయినర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అయ్యప్పమాలధారణ వేసిన ఐదుగురు బీటెక్ విద్యార్థులు మృతి చెందారు. ఈ ఘటనపై వైఎస్ జగన్ స్పందిస్తూ ఎంతో ఉన్నత భవిష్యత్తు ఉన్న విద్యార్థులు ఇలా ప్రమాదంలో మరణించడం తీవ్రంగా కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఇండిగో సంక్షోభం

>> లిమిటేషన్స్ పరంగా డిజిసిఎ తీసుకున్న ఉపశమన చర్యలు కొంత దోహదం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇండిగో రోజూ 2300కిపైగా సర్వీసులు నడుపుతోంది. కొన్నిరోజుల్లోనే వందలకొద్దీ సర్వీసులు రద్దుకాగా శుక్రవారం ఒక్కరోజే వెయ్యిదాటింది. సాంకేతిక లోపాలు,ప్రతికూల వాతావరణపరిస్థితులు, షెడ్యూలు మార్పులు అప్‌డేట్‌చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాలఅమలువంటి అంశాలు ఈసంక్షోభానికి కారణం అయ్యాయి.

**రంగంలోకి దిగిన కేంద్రం**

ఐదురోజులుగా ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై కేంద్రం రంగప్రవేశంచేసింది. శుక్రవారం ఉన్నతస్థాయి విచారణకు ఆదేవించింది. బాధ్యులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.మొత్తం నలుగురుసభ్యులతో కూడిన కమిటీని పౌరవిమానయానశాఖ ఏర్పాటుచేసింది. కమిటీలో డిజిసిఎ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె్రబ్మానే, డిప్యూటి డైరెక్టర్ జనరల్ అమిత్‌గుప్తా, సీనియర్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాంగ్లిక్, ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్‌లు ఉన్నారు. ఇక తాజా పరిస్థితులపై మంత్రిత్వశాఖ నిరంతర మీక్ష జరుపుతోంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పౌరవిమానయానమంత్రి రామ్మోహన్‌నాయుడుతో సమీక్ష నిర్వహించారు. అలాగే ప్రయాణీకులకు అప్‌డేట్లు అందించేందుకు వీలుగా 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసింది. విమానయాన సంస్థలతో సమ న్వయం ప్రస్తుత సమస్యలకు తక్షణ పరిష్కారంచూపించే లక్ష్యంతో అందుబాటులోకి తెచ్చారు. కంట్రోల్ రూమ్‌కు 011-24610843, 24693963, నెంబర్లతోపాటు 09650391859ను కూడా ఏర్పాటుచేసినట్లు డిజిసిఎ వెల్లడించింది.

**డిజిసిఎ ఆంక్షల సడలింపులు**

ఇండిగోలో వెయ్యికిపైగా విమానసర్వీసులు రద్దుకావడంతో డిజిసిఎ జోక్యంచేసుకుంది. ఫ్లైట్‌డ్యూటీటైమ్ లిమిటేషన్స్ నుంచి ఉపశమనం కల్పించింది. వారం రోజుల విశ్రాంతిని సెలవుగా పరిగణించనున్నట్లు డిజిసిఎ ప్రకటించింది. ఎఫ్‌డిటిఎల్‌కొత్తనిబంధనల ప్రకారం వీక్లీరెస్ట్‌ను సెలువగా పరిగణించే అవకాశంలేదు. వీక్లీరెస్ట్ పీరియడ్, సెలవులను వేరువేరుగా చూసేవారు. పైలట్ల అలసట సమస్యను పరిష్కరించేందుకు ఈ కఠిన రూల్స్ తెచ్చారు. ఇండిగో సర్వీసులరద్దునేపథ్యంలో ఈ ఆంక్షలు సడలించారు. అలాగేపైలట్ల రాత్రివిధులపై ఉన్న నిబంధనలపరంగా కూడా సడలింపులు ఇచ్చింది. పైలట్లు వరుసగా రెండుకంటే ఎక్కువ రాత్రి షిఫ్ట్‌లు చేయకూడదనే నిబంధనను తాత్కాలికంగా ఉపసంహరించింది. వారంలో ఆరునైట్‌డ్యూటీలు నిర్వహించే అవకావం కల్పించింది. ఈ మినహాయింపులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీవరకూ అమలులో ఉంటాయని తెలిపింది. ప్రతి పక్షంరోజులకోసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపింది.

# ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

>> భూమినీ కలిపి పరిగణనలోకి తీసుకోవాలి. సంబంధిత భూమి క్రమబద్ధీకరణకు ధరఖాస్తు చేసిన వ్యక్తి స్వాధీనంలోనే ఉండాలి. అడంగల్‌లో అనుభవదారుగా నమోదై ఉంటే సరిపోతుంది. ఇతర ఆధారాలు అక్కరలేదు. రికార్డు లేకపోతే శిస్తు రసీదులు, ఈ క్రాప్ నమోదు పరిశీలనలోకి తీసుకోవచ్చు.

# రూ.25లక్షల ఉచిత వైద్యం

>> ప్రతిపాదనలను ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం ఉన్న పేద వర్గాలకు (బీపీఎల్) చెందిన కుటుంబాలకు రూ.2.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ మోడ్‌లో అంతకంటే ఎక్కువ అవసరమైతే రూ.25 లక్షల వరకు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఏపీఎల్ కుటుంబాలు (ఈహెచ్‌ఎస్,వర్కింగ్ జర్నలిస్టు స్కీం మినహా) రూ.2.50 లక్షల వరకు భీమా వర్తిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు భీమా కంపెనీలకు సెప్టెంబరు 9న ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండరు నిబంధనల్లో మార్పులతో తాజా ఉత్తర్వులు జారీ అయ్యాయి.రాష్ట్రంలో ఈహెచ్ ఎస్,వర్కింగ్ జర్నలిస్ట్ స్కీం మినహా మిగిలిన అన్ని కుటుంబాలు యూనివర్సల్ హెల్త్ పాలసీ పరిధి లోకి వస్తాయి. పీఎంజేవై,ఎన్టీఆర్ వైద్యసేవ లబ్ధిదారుల కుటుంబాల్లోని సభ్యులు ఈ పథకం పొందడానికి అర్హులు. ఏడాది పొడవునా అస్పత్రుల నమోదుకు ధరఖాస్తులు స్వీకరిస్తారు. ఏడాదికి రెండుసార్లు జాబితాలో నమోదు ప్రక్రియ జరుగుతుంది.భీమా కంపెనీలు పన్నులు మినహాయించి ప్రీమియం ధర చెల్లించవచ్చు క్లైయిమ్ రేషియో 120 శాతం దాటితే ప్రీమియం మించిన అదనపు ఖర్చులో 50 శాతం ట్రస్ట్ 50 శాతం భీమా కంపెనీ భరిస్తాయి.ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రత్యేకంగా కేటాయించిన 521 వ్యాధులకు సంబంధించిన సేవలకు మొదట భీమా కంపెనీ భరిస్తుంది. బిల్లులు పరిశీలించి ట్రస్ట్ సొమ్ము చెల్లిస్తుంది.రాష్ట్ర జిల్లా,ఆస్పత్రుల స్థాయిలో ప్రస్తుతం సేవలందిస్తున్న వైద్య మిత్రులు,ట్రస్ట్‌లో పనిచేస్తున్న పొరుగు సేవల ఒప్పంద సిబ్బందిని అవసరాల మేరకు భీమా కంపెనీ కొనసాగించాల్సి ఉంటుంది.

# శ్రీలక్ష్మిపై అభియోగాలకు ఆధారాలు

>> కాగ్నిజెన్స్ ఉత్తర్వులను సవాలు చేసూప్త మళ్ళీ వేయడానికి వీల్లేదన్నారు. ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తరువ్లపై అభ్యంతరాలుంటే కింది కోర్టులో తేల్చుకోవాలని, ఈ కోర్టులో కాదని తెలిపారు. అందువల్ల పిటీషన్‌ను కొట్టివేయాలని కోరారు. శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది కె.వివేక్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ గతంలో పిటీషన్‌లో వాదనలు పూర్తయ్యాక ప్రాసిక్యూషన్‌కు అనుమతి మంజూరైందని,ఇదే విషయాన్ని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్ళి పిటీషన్‌ను ఉపసంహరించుకొని మళ్ళీ దాఖలు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం అవినీతి నిరోధక చట్టం కింద మాత్రమే అనుమతి ఉందని, ఐపీసీ కింద అభియోగాలపై విచారణకు అనుమతి మంజూరు కాలేదన్నారు. ఐపీసీ,పీసీ చట్టాల కింద అనుమతులు ఉండాల్సిందేనని,దీనికి సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పులను ప్రస్తావించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి ఉత్తర్వుల నిమిత్తం విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేశారు.

# 100 బిలియన్ డాలర్లు

>> చింది. మానవతా దృక్పథంతో వీటిని అమలుచేస్తున్నారు. భారత ఓడరేవులు, షిప్పింగ్ జలవనరులు శాఖ రష్యా మారిటైమ్‌బోర్డులు రెండూ కూడా నిపుణులను మరింత శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందంచేసుకున్నాయి. పోలార్ జలాల్లో కూడా నౌకలు నడిపేవిధంగా నిపుణులకు శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించాయి. అలాగే రష్యాకు చెందిన యూరియా ప్లాంట్‌లో భారత్‌కు సరఫరాచేసేందుకుగాను యూరియా ఉత్పత్తి ఒప్పందం కూడా జరిగింది. కస్టమ్స్ శాఖపరంగా కేంద్ర పరోక్షపన్నులబోర్డు, రష్యా ఫెడరల్ కస్టమ్స్ మధ్య పర్పర సహకారం ఒప్పందం జరిగింది. ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా రెండుదేశాల తంతి తపాలాశాఖలు పరస్పరం సహకరించుకోవాలనినిర్ణయించాయి. భారత్ యూరోసియన్ ఎకనమిక్ యూనియన్‌లమధ్య జరుగుతున్న స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంతో మరిన్ని ఒప్పందాలు జరుగుతాయని ఇరువురు అగ్రనేతలు వెల్లడించారు. కీలక ఒప్పందాల్లో మరో ఐదు స్క్వాడ్రన్‌ల ఎస్-400 క్షిపణి వ్యవస్థలు కూడా కొనుగోలు ఒప్పందం జరిగింది. 2030వరకూ కొనసాగే ఆర్థిక ఒప్పందంతోపాటు రెండువైపులా కీలక ఒప్పందాలపై సంకాలుచేసారు. ఆరోగ్యం, మొబిలిటీ, వాణిజ్యం, విద్య, రక్షణరంగాల్లో అనేక ఒప్పందాలు జరిగాయి. అలాగే సముద్రజలాల్లో తేలియాడేవిధమైన ఫ్లోటింగ్ న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు, చిన్నచిన్న మాడ్యులర్ న్యూక్లియర్ రియాక్టర్ల నిర్మాణం కోసం కూడా ఒప్పందాలుజరిగాయి. భారత్‌కు నిరంతరాయంగా ఇంధన సరఫరా చేస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే.

## రష్యా పౌరులకు 30 రోజులు ఉచిత వీసా

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** భారత్, రష్యా మధ్య సాంస్కృతిక, ప్రజా సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా పౌరులకు 30 రోజుల పాటు ఉచిత ఈటూరిస్ట్ వీసా, 30 రోజుల గ్రూప్ టూరిస్ట్ వీసాను త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన చర్చల అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో ప్రజల మధ్య సంబంధాలకు ఎల్లప్పుడూ ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని మోడీ అన్నారు. దశాబ్దాలుగా ఇరుదేశాల ప్రజల మధ్య లోతైన ఆప్యాయత, గౌరవం, అభి మానం ఉన్నాయి. ఈబంధాలను మరింతగా పటిష్టం చేయడానికి పలు కొత్త చర్యలు తీసుకుంటున్నా మని ఆయన పేర్కొన్నారు. ఈ సంబంధాలను మరింత సులభతరం చేసేందుకు ఇటీవల రష్యాలో రెండు కొత్త భారత కాన్సులేట్లను (యెకాటెరిన్‌బర్గ్, కజాన్) ప్రారంభించినట్లు గుర్తుచేశారు.

## ఉక్రెయిన్‌పై శాంతియుత పరిష్కారం కోసమే రష్యా కృషి : పుతిన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** ఉక్రెయిన్‌లో శాంతియుత పరిష్కారం కోసం రష్యా కృషి చేస్తోందని, అందుకు సంబంధించిన ప్రతిపాదన వివరాలను భారత్‌తో పంచుకున్నామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీతో జరిగిన సమావేశం అనంతరం ఇరువురు నేతలు సంయుక్త ప్రకటన చేశారు. సైనిక ఘర్షణ కాకుండా చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యకు పరిష్కారం లభించాలని భారత్ కోరుకుంటున్నట్లు ప్రధాని మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో పుతిన్, మోదీ భేటీ అయ్యారు. భారత్ రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడంపై అమెరికా వంటి దేశాలు ఆంక్షలు విధిస్తున్నా, భారత్ తన వాణిజ్యాన్ని కొనసాగిస్తోంది. అమెరికా కూడా తమ దేశం నుంచి అణు ఇంధనాన్ని కొనుగోలు చేస్తోందని పుతిన్ గుర్తుచేశారు. వారు మా నుంచి ఇంధనం కొనగలిగినప్పుడు, భారత్ ఎందుకు కొనకూడదని ఆయన ప్రశ్నించారు. రెండు రోజుల పర్యటన కోసం గురువారమే భారత్‌కు చేరుకున్న పుతిన్‌కు ప్రధాని మోడీ ఆత్మీయ ఆలింగనంతో ఘనస్వాగతం పలికారు. పుతిన్ తన ప్రత్యేక సాయుధ కారు ఆరస్ సెనెట్ ను కాదని, ప్రధాని మోడీ వ్యక్తిగత వాహనంలో ప్రయాణించడం వారి మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనమని విశ్లేషకులు చెబుతున్నారు.

## ఎపిఎండిసి జిఎం సూర్యకళ సస్పెన్షన్

### ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చర్యలు

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు,మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) జనరల్ మేనేజర్ మల్లాది విజయ సూర్యకళను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సూర్యకళపై అనిశా అధికారులు నవంబరు 20న కేసు నమోదు చేశారు. 21న విశాఖ,విజయవాడ,హైదరాబాద్‌లలో ఉన్న సూర్యకళతో పాటు ఆమె కుటుంబీకుల నివాసాల్లో సోదాలు సాగాయి. వారి పేరిట 27 స్థిరాస్తులున్నట్లు,మొత్తం రూ.6 కోట్ల మేర అక్రమాస్తులు కూడబెట్టినట్లు అనిశా అధికారులు గుర్తించారు. అదే రోజు ఆమెను అరెస్ట్ చేసి విజయవాడ లోని ఎసిబి స్పెషల్ కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి డిసెంబరు 5 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు పైగా జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండటంతో ఏపీ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నవంబరు 21నుంచి సూర్యకళ సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని రెవిన్యూ (విజిలెన్స్) శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

## మున్సిపాలిటీలకు నిధుల బొనాంజా

# 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.281.89 కోట్లు విడుదల

**విజయవాడ, డిసెంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీలకు రూ.281.89 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. పది లక్షలు, ఆ పైబడి ఉన్న పురపాలక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిధులతో పట్టణాల్లో ప్రాథమిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, వీధిలైట్లు, పారిశుధ్యం, నీటి సరఫరా పనులకు వినియోగించుకోవాలని సూచించింది. అలాగే యునైటెడ్ మరియు టైడ్ గ్రాంట్ల రూపంలో నిధులు కేటాయింపు చేసినట్లు పేర్కొంది. ప్రతి పట్టణానికి అవసరాల ఆధారంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

## నేటి నుంచి మంత్రి లోకేష్ విదేశీ పర్యటన

**విజయవాడ, డిసెంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ఐటి, విద్య శాఖ మంత్రి నారా లోకేష్ నేటి నుండి ఐదు రోజులపాటు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు 5రోజుల పాటు అమెరికా, కెనడాల్లో పర్యటించ ను న్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధనే లక్ష్యంగా మంత్రి లోకేష్ పర్యటన సాగనుం దని అధికార వర్గాలు వెల్లడించాయి.

# వైకుంఠద్వార దర్శనాలు సామాన్య భక్తులకే ప్రాధాన్యత



## - ఆ పదిరోజులు అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దు :టిటిడి ఇఒ సింఘాల్

**తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమంప్రకారం పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలు అధికసమయం సామాన్యభక్తులకే ప్రాధాన్యతనిస్తున్నట్లు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి ,2026 నూతన ఆంగ్ల సంవత్సరం జనవరి 1న దర్శనాలకు సంబంధించి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఇ డిప్ ద్వారా 1.76లక్షల సర్వ దర్శనం టోకెన్లు జారీ చేశామన్నారు. ఈ టోకెన్లు కలిగి ఉన్న వారిని మాత్రమే ఆ మూడు రోజులు వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తా మన్నారు. జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు వారంరోజులు ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకుండా నేరుగా తిరుమలకు వచ్చినా సామాన్యభక్తులను యధావిధిగా వైకుంఠం కమ్ 2 నుండి సర్వదర్శనంలో అనుమతిస్తా మన్నారు. వివిఐపిలు, విఐపిలు స్వయంగా వస్తేనే వారికి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తామన్నారు.జనవరి 2వతేదీ నుండి 8వరకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనాల టిక్కెట్లురోజుకు 15వేలు, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు రోజుకు వెయ్యిటిక్కెట్ల ఆన్‌లైన్‌లో విడుదల చేశామన్నారు. శుక్రవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్య చౌదరి, సిఇ సత్యనారాయణ, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిహెచ్ఒ డాక్టర్‌తేలారి రవి, డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, వెంకయ్య, ఉద్యానవన విభాగం డైరెక్టర్ శ్రీనివాసులు, డిఎఫ్ఒ,ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు, వింగ్ వివిఎస్ఒ ఎస్‌వి రామ్‌కుమార్, పిఆర్ఒ నీలిమ తదితరులతో కలసి డిసెంబర్ 30నుండి జనవరి 8వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ఏర్పాట్లు, భక్తులకు సౌకర్యాలుపై ఇఒ సింఘాల్ వివరించారు. డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి ఉదయం సర్వదర్శనం, 31న ద్వాదశి చక్రతీర్థం జరుగుతుందన్నారు. ఆ పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలు 182 గంటలు దర్శన సమయంలో 164 గంటలు సామాన్యభక్తులకు కేటాయించామన్నారు.. తొలిమూడురోజులు ఎస్ఎస్‌డి టిక్కెట్లు, శ్రీవాణి టిక్కెట్లు రద్దుచేశారు. అన్ని ఆర్జితసేవలు,ప్రత్యేక దర్శనాలు పదిరోజులునిలుపుదలచేశారు. అలాగే తిరుమల తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేసే ఎస్ఎస్‌డి టోకెన్లు కూడా నిలుపుదలచేశారు. తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట వాసులకు జనవరి 6,7,8తేదీల్లో వైకుంఠద్వార దర్శనాలకు రోజుకు ఐదువేల టోకెన్లు మొదట వచ్చినవారికి మొదట అనే విధానంలో 10వతేదీ ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీచేస్తామన్నారు. భక్తులు సంయ మనం పాటించి వైకుంఠద్వార దర్శనాలను ప్రశాంతంగా చేసుకోవాలని ఇఒ సింఘాల్ కోరారు.

## జగన్, వివేకా హత్యతో సంబంధం లేదని అంగీకరించగలరా?: మంత్రి సంధ్యారాణి

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** జగన్...వివేకా హత్యతో సంబంధం లేదని అంగీకరించగలరా?,గత ప్రభుత్వంలో తప్పులు చేసి మమ్మల్ని విమర్శిస్తారా !అని మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. పదేపదే అబద్దాలు ఆడటం మాజీ సిఎం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. వైకాపా హయాంలో బకాయిలుగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్,డైట్ బిల్లులు తామే చెల్లించా మన్నారు. భోజనం,యూనిఫాం, పుస్తకాలు, కాస్మోటిక్స్ పిల్లలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'వివేకా హత్యతో సంబంధం లేదని మీరు అంగీకరించగలరా? తల్లి,చెల్లెని ఇంట్లోంచి గెంటేసింది మీరు కాదా? గిరిజనుల మరణాలపై శవ రాజకీయాలు చేస్తున్నారు. గిరిజనులను చులకన చేసి అబద్దాలు మాట్లాడితే ఊరుకోం. పరకామణి కేసులో చోరీ జరిగింది. రూ.75 వేలే కదా అని జగన్ అంటున్నారు. రూ.75వేలు అయితే దొంగతనం చేయవచ్చా?' అని సంధ్యారాణి నిలదీశారు.

# పరకామణి, కల్తీనెయ్యికేసుల్లో విచారణ పేరుతో బెదరించే ప్రయత్నం

## - గిఫ్ట్‌డీడ్ అని రవికుమార్ చెబుతున్నా అబద్ధాలు ప్రచారం : టిటిడి మాజీ చైర్మన్ భూమన

**తిరుపతి,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో చోరీ కేసు విషయం, కల్తీనెయ్యికేసుల్లో న్యాయస్థానాల ఆదేశాలతో కొందరు పోలీసు అధికారులు విచారణ పేరుతో బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని, ఫోన్‌లోనే విచారణ చేయడం ఎంతవరకు సమ్మతమని మాజీ టిటిడి ఛైర్మన్, వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. పరకామణిలో జరిగిన చోరీ ఘటన తరువాత రవికుమార్ ఆస్తులను భగవంతునిపై విశ్వాసంతో గిఫ్ట్‌డీడ్ క్రింద దేవునికి రాసిస్తే దాన్ని రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. రవికుమార్ నుండి చిన్నపాటి టీ తాగినట్లు రుజువుచేసినా రాజకీయ సన్యాసం తీసుకుం టానని భూమన సవాల్ విసిరారు. కల్తీనెయ్యిపై సుప్రీంకోర్టులో, పరకామణి చోరీ కేసుపై హైకోర్టులో విచారణలు జరుగుతున్న సమయంలో శుక్రవారం తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి పలు అంశాలు వెల్లడించారు. పరకామణి కేసులో విచారణ జరగడంపట్ల న్యాయస్థానాలపై గౌరవం ఉన్న వ్యక్తిగా తన ఆవేదన చె బుతున్నాన న్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలకు సిఐడి ,ఏసిబి విచారణ చేయడం నిజమన్నారు.అయితే న్యాయస్థానం సూచించిన మేరకు విచారణ జరగలేదని ఆయన తెలిపారు. ఆధారాలు ఉన్నాయని అంటున్న వారిని ఎందుకు విచారణకు పిలవలేదని ఆయన ప్రశ్నించారు. ఆధారాలు ఉన్నాయని చెబుతున్న వారిని న్యాయస్థానం విచారణ చేయాలని కోరారు. ఎవరైతే ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారో వారినే సిబిఐ అధికారులు విచారణకు పిలిచారని ,అందుకే ఈ విచారణ వక్రమార్గంలో జరిగిందని విమర్శించారు. విచారణ జరిగిన సమయంలో ఏం జరిగిందనే వివరాలు రాబడితే రహస్యంగా ఉంచాలిగానీ మరుసటిరోజే రాయిస్తున్నారని మండిపడ్డారు.



# కొత్త వైద్య కళాశాల్లో పిజి కోర్సుల ఫీజులు ఖరారు : మంత్రి సత్యకుమార్

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది జరగనున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్(పిజి) ప్రవేశాలకు ఫీజులను రాష్ట్రప్రభుత్వం నిర్ధారించిందని వైద్య,ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రభుత్వ కోటా సీట్లకు రూ.30 వేలు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లకు రూ.9 లక్షలు, ఎన్ఆర్ఐ సీట్లకు రూ.29 లక్షలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదించారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 202526 ఏడాదిలో ఐదు కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలల్లో నాలుగు కోర్సుల్లో 60 పిజి ప్రవేశాలకు భారత వైద్య మండలి (ఎన్ఎంసి) అనుమతి ఇచ్చిందని తెలిపారు. రాజమండ్రి, నంద్యాల కళాశాలల్లో 16, విజయనగరం, మచిలీపట్నం కళాశాలల్లో 12, ఏలూరు కళాశాలలో 4 పిజి చొప్పున పిజి ప్రవేశాలు జరుగుతాయని పేర్కొన్నారు.

# రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు పూల త్రివిక్రమరావు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**విజయవాడ,డిసెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** మండలి వెంకట కృష్ణారావు ఏపీ అధికార భాషా సంఘానికి అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు పూల త్రివిక్రమరావు(విక్రమ్)ను నియమిస్తూ ఏపీ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.విక్రమ్ పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్ళపాటు ఈ పదవిలో కొనసాగుతారని ఆదేశాల్లో వివరించింది.వీటితో పాటు అధికార భాషా సంఘం చేయాల్సిన కార్యకలాపాలపై ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.అధికార కార్యక్రమాల్లో తెలుగు వినియోగంలో ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వం నిర్దేశించింది.అధికార భాషాభివృద్ధికి కోసం తగిన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించింది.ప్రభుత్వ కార్యాలయాలు,సంస్థలో తెలుగు వినియోగంపై తనిఖీలు చేయాలని ఆదేశించింది.ఈ మేరకు యువజన ,పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేసారు,విక్రమ్ ఇటీవల సీఎం చంద్రబాబును తనను అధికార భాషా సంఘం చైర్మన్ నియమించారు.

# ఆంధ్ర సరిహద్దు తమిళనాడులో మూడు ఏనుగులు మృతి

**కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త** ఆంధ్రరాష్ట్ర సరిహద్దుల్లోని తమిళనాడు వేలూరు జిల్లాలో ఓ ప్రైవేట్ అటవీ ప్రాంతంలో మూడు ఏనుగులుమృతి చెందిఉండడాన్ని అక్కడి అటవీ అధికారులు గుర్తించిన సంఘటన వెలుగు చూసింది. ఏనుగుల కబేళాలుసంఘటనా స్థలిలో పడి ఉన్నట్లు గుర్తించారు. స ంఘటనపై తమిళనాడు అటవీశాఖ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ రాకేష్‌కుమార్ వేలూరు జిల్లా అటవీ అధికారికి నివేదికఅందించారు. సంఘటనా స థ్లినుంచి అటవీ శాఖ ఉన్నతాధికారులు, అటవీ వెటర్నరీ అధికారులు ఫోరెన్సిక్ శాంపుల్లనుసేకరించారు. ఈ సంఘటన భైమల ప్రాంతంలో జరిగినట్లు సమాచారం. సంఘటనా స్థలం తమిళనాడు వేలూరు సమీపంలోని కొండపల్లి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉండడంతో పాటు ఆంధ్ర ప్రాంతంలో ఉన్న కౌ ండిన్య వైల్డ్‌లైఫ్ శాంక్చురీకి దగ్గరగా ఉ ంది. ఈసంఘటన విషయం తెలుసుకున్న ఆంధ్ర రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ తమిళనాడు అటవీ అధికారులకు సహకారం అందించాలని అనంతపురం సిసిఎఫ్‌కు సూచించగా అనంతపురం సిసిఎఫ్ చిత్తూరు డివిజన్‌కుచెందిన పదిమంది అటవీ అధికారులతో ఓ బృందాని ్న నియమించారు.

# ఇంధన పరిరక్షణపై 14నుండి తొమ్మిది జిల్లాల్లో విద్యార్థులకు పోటీలు

## - ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్



**తిరుపతి,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధన పరిరక్షణ ఆవశ్యకత అంశంపై ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని తొమ్మిదిజిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల 9,10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటితెలిపారు.శుక్రవారం ఆయన ఇంధన పరిరక్షణ ఆవశ్యకతపై కొన్ని వివరాలు తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి,చిత్తూరు, నెల్లూరు, కడప,అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి,కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 9,10తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14వతేదీ ఇంధన పరిరక్షణ అంశంపై వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు,కరపత్రాల పంపిణీ,14,15తేదీల్లో తిరుపతిలో సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ఏర్పాటు జరుగుతుందన్నారు. 16వతేదీ పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్,వక్తృత్వపోటీలు ఉంటాయాన్నారు. 17వతేదీ ఆధునికసాంకేతికతతో స్మార్ట్ వీధిదీపాల నిర్వహణ, నీటిసరఫరా వ్యవస్థ అంశాలపై అవగాహన కల్పించేదుకు కళాశాలల విద్యార్థులకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల సందర్భంగా తొలుత సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో డివిజనల్,సర్కిల్ స్థాయిల్లో నిర్వహించే క్విజ్, వక్తృత్వపు పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు 16వతేదీ తిరుపతి నుండి ఆన్‌లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 20వతేదీన బహుమతుల ప్రదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 9,10తరగతులు చదువుతున్న విద్యార్థులు తమ పేరు, చిరునామా,మొబైల్ నంబర్,ఈమెయిల్ తదితర వివరాలను వాట్సాప్ నంబర్లు 8712480430కు 10వతేదీ సాయంత్రం 5గంటలలోపు ,సృజనాత్మకత ఆలోచనలతో తెలుగు,ఆంగ్ల భాషల్లో 2నిమిసాల నిడివితో వీడియోస్‌ను 8712480431కు డిసెంబర్ 16వతేదీ సాయంత్రం 5గంటల లోపు పంపించాలన్నారు.

# మెరుగైన విద్యాబోధనకే ఉన్నత ఆశయంతో పిటిఎం

## - తిరుపతిలో స్వచ్ఛాంధ్రకార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి



**తిరుపతి,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన,నాణ్యతతోకూడిన విద్యాబోధనకే తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరుపుకోవడం శుభపరిణామమని రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింతగా ఉపాధ్యాయులను ప్రోత్సహించినట్లవుతుందన్నారు. పిల్లలను పాఠశాలలకే పంపుతున్నామనే భావనతో గాకుండా మన పిల్లలు ఏం చదువుతున్నారు, వారి విద్యాభ్యాసం, వారిలోని మేధస్సును నేరుగా తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రతిచిన్నారి చదువుకోవాలనే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్రవిద్యాశాఖమంత్రి నారాలోకేశ్ ప్రతి పాఠశాలకు మౌళిక వసతులు కల్పించారన్నారు. విద్యార్థులను చదువుపైనేగాక క్రీడల్లోనూ రాణించేలా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. తన చిన్నవయస్సులో పాఠశాలలో చదువుకున్న రోజులను పట్టాభి విద్యార్థులను చూసి గుర్తుచేసుకున్నారు. శుక్రవారం ఉదయం తిరుపతిలోని జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నతపాఠశాలలో జరిగిన పిటిఎంలో అనంతరం విద్యార్థులను పలకరించి వారు చదువుకున్న అంశాలను, ఉపాధ్యాయుల విద్యాబోధన తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ ఛైర్‌పర్సన్ ఎం.సుగుణమ్మ, ఎమ్మెల్యే శ్రీనివాసులు, తిరుపతి జిల్లాకు చెందిన టిడిపి రాష్ట్రపార్టీ, జిల్లా పార్టీ నాయకులు వి.పుష్పావతియాదవ్, వట్టికుంట చిన్నబాబు, బుల్లెట్‌రమణ, ఊట్లసురేంద్రనాయుడు, ఆర్‌సి మునికృష్ణ, మునిశేఖర్‌రాయల్, మన్నెం శ్రీనివాసులు, సుబ్రమణ్యం, కెవి రమణ, విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విధుల్లో నిరక్ష్యంపై నరసరావుపేట ప్రభుత్వ వైద్యుడి సస్పెన్షన్

## సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ చర్యలు

**విజయవాడ,డిసెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** విధుల్లో తీవ్ర నిరక్ష ్యంల వహించిన నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి. నారాయణ స్వామిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 26 తేదీన నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఓ మహిళకు ట్యూబెక్టమీ ఆపరేషన్ నిర్వహించి నిరక్ష ్యంలగా వ్యవహరించిన ఘటనపై విచారణ జరిపిన అనంతరం ప్రభుత్వం ఆయన పై సస్పెన్షన్ వేటు వేసింది. ఆపరేషన్ చేసి మహిళ శరీరంలో తీవ్ర నిరక్ష ్యంలతో సర్జికల్ బ్లేడ్ ను వదిలేసినట్టు తరువాత జరిపిన వైద్య పరీక్షల ద్వారా వెలుగు చూసింది. ఆపరేషన్ చేసిన డాక్టర్ నారాయణ స్వామి తన విధుల్లో తీవ్ర నిరక్ష ్యంల వహించారని ప్రాథమిక విచారణ నివేదిక పేర్కొంది. ఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విధుల్లో నిరక్ష ్యంల వహించిన వైద్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ టి.నారాయణ స్వామిని సస్పెండ్ చేస్తూ వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బాలయ్యనగర్‌కు చెందిన రమాదేవి (22) అనే యువతి గత నెల 25న చిన్న ఆపరేషన్ కోసం ఆసుపత్రిలో చేరారు. డాక్టర్ నారాయణ స్వామి ఆమెకు శస్త్రచికిత్స చేశారు. అయితే, ఆపరేషన్ సమయంలో ఆయన, సిబ్బంది తనతో కఠినంగా వ్యవహరించారని, చెంపపై కొట్టారని బాధితురాలు కన్నీటిపర్యంతమైంది. ఆపరేషన్ తర్వాత తొడలో తీవ్రమైన నొప్పి వస్తోందని చెప్పినా, అది సహజమే అని డాక్టర్లు కొట్టిపారేశారు. నొప్పి భరించలేక ఈ నెల 5న (శుక్రవారం) స్కానింగ్ తీయించగా, కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ఆమె తొడ భాగంలో ఒక సర్జికల్ బ్లేడు ఉండిపోయింది. దీనిపై బాధితురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఉచిత వైద్యం అని చెప్పి రూ.2,500 లంచం కూడా తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు తీవ్రంగానే స్పందించారు.ఆయన

# పరకామణి కేసులో కీలక ట్విస్ట్!

## లోక్‌అదాలత్‌లో రాజీ చిన్నవిషయం కాదన్న ధర్మాసనం -11వతేదీకి విచారణ వాయిదా

**తిరుపతి,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** భక్తులు కానుకలుగా సమర్పించి లెక్కించే పరకామణిభవనం నుండి అమెరికన్ డాలర్లు చోరీ కేసులో హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ చోరీ కేసులో లోక్‌అదాలత్‌తో రాజీకుదుర్చుకోవడం చిన్నవిషయమేమీ కాదని హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక వాఖ్యలు చేసింది. ఈ కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌చేస్తూ నిందితుడు రవికుమార్ దాఖలు చేసిన అప్పీల్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణలో సతీశ్‌కు సంబంధించిన కేసు లోక్‌అదాలత్‌లో రాజీకీ అవకాశం లేదని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. సింగిల్‌జడ్జి ఉత్తర్వుల్లో తప్పేముందని, అది కేవలం ప్రాథమిక అభిప్రాయం మాత్రమేనని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఆలయాల ప్రయోజనాలను కాపాడటంలో కోర్టులే మొదటిసంరక్షకులుగా వ్యవహరిస్తాయని ధర్మాసనం స్పష్టంచేసింది. పరకామణి చోరీ వంటి తీవ్రమైన కేసులో రాజీకుదుర్చుకోవడాన్ని అంత తేలిగ్గా తీసుకోలేమని అభిప్రాయపడింది. రవికుమార్ దాఖలు చేసిన అప్పీలుపై తదుపరి విచారణను ఈనెల 11వతేదీగురువారానికి వాయిదా వేసింది.

# దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు, వారు లొంగిపోయేందుకు ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు

## - విజయవాడ వ్యాపారస్తుల కుట్ర కారణంగానే హిడ్మాను పోలీసులు హత్యచేసారు: మావోయిస్టుల లేఖ

**విజయవాడ,డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** మావోయిస్టు అగ్రనేత హిడ్మా మృతిపై ఆ పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) సంచలన విషయాలు వెల్లడించింది. కమిటీ కార్యదర్శి వికల్ప్ పేరుతో విడుదల చేసిన ఓ లేఖలో, హిడ్మాది ఎన్‌కౌంటర్ కాదని, అది పక్కా ప్రణాళికతో చేసిన హత్యేనని ఆరోపించింది. హిడ్మా ఆచూకీని దేవ్ జీ పోలీసులకు చెప్పారన్న వార్తలను పార్టీ తీవ్రంగా ఖండించింది. "దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి మాతోనే ఉన్నారు. వారు లొంగిపోయేందుకు ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. హిడ్మా సమాచారాన్ని దేవ్ జీ పోలీసులకు చెప్పారనేది పూర్తిగా అవాస్తవం" అని లేఖలో స్పష్టం చేశారు. హిడ్మా హత్యకు నలుగురు వ్యక్తులు కారణమని, వారిలో అడవి నుంచి బయటకు వచ్చిన కోసాల్ అనే వ్యక్తి ప్రధాన సూత్రధారి అని పేర్కొన్నారు. అతనితో పాటు విజయవాడకు చెందిన ఓ కలప వ్యాపారి, ఫర్నిచర్ వ్యాపారి, మరో కాంట్రాక్టర్ ఉన్నారన్నారు.

# తిరుమల సమాచారం

## జనవరి ఆఖరుకు బయోగ్యాస్ ప్లాంట్ పూర్తి

### - ఐఒసిఎల్ ప్రతినిధులతో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలోని డంపింగ్‌యార్డు వద్ద ఐఒసిఎల్ సంస్థ ఏర్పాటుచేస్తున్న బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు జనవరిఆఖరుకుపూర్తిచేయాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన సహకారం అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ఘనవ్యర్థాలను తొలగించడంపై కూడా సంబంధిత అధికారులతో చర్చించారు. శుక్రవారం సాయంత్రం తిరుమల పద్మావతి అతిధిగృహంలో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి, ఘనవ్యర్థాల నిర్వహణపై అదనపు ఇఒ వెంకయ్యచౌదరి టిటిడి సిఇ సత్యనారాయణ, ఈఈ వాటర్‌వర్క్సు సుధాకర్, , ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఐఒసిఎల్ ఇడి పీయూష్‌మిట్టల్(వర్చువల్), ఇంజనీరింగ్ సిజిఎం ఎలమరన్, సిఎస్ఆర్ డిజిఎం కైలాశ్‌కాంత్,డివిజనల్ హెడ్ జయంత్‌కుమార్, ఇంజనీరింగ్ ఇన్‌ఛార్జి స్వరూప్ తదితరులతో సమీక్షించారు.తిరుమలలో అన్నప్రసాదాలు తయారీకి వెంగమాంబ భవనంలోని వంటశాలకు బయోగ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. టిటిడి రవాణ విభాగం సమన్వయంతో ట్రాక్టర్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐఒసిఎల్ చేపట్టే బర్నర్ సవరణచేసే పనులకు అయ్యే ఖర్చును టిటిడి వెచ్చించేందుకు ఆయన అంగీకారం తెలిపారు.

## తిరుమల శిలాతోరణం వద్ద డ్రోన్ కెమెరా కలకలం

### - ప్రవాసభారతీయులుగా గుర్తించిన విజిలెన్స్

**తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడటంలో నిషేధిత వస్తువులు గానీ, నిషేధిత షూటింగ్‌లు గానీ జరపరాదు, అందుకు డ్రోన్‌కెమెరాలు కూడా ఎగురవేయకూడదు. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరు ఇస్కాన్ భక్తులు,ప్రవాస భారతీయులు సులక్షణదాస్, అర్జున్‌దాస్‌లు ఏకంగా డ్రోన్‌కెమెరాలను సంచుల్లో పెట్టుకుని శుక్రవారం ఉదయం తిరుమలకు చేరారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో బ్యాగ్‌లు తనిఖీ చేసుకోకుండా వాహనంలో తిరుమలపైకి రావడంతో శిలాతోరణం పరిసర ప్రాంతాలు చిత్రీకరించారు. స్థానిక భక్తులు గమనించి విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఏవిఎస్ఒ, తిరుమల 2టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా ఇద్దరూ ప్రవాసభారతీయులు కావడం,పైగా తిరుమల సుందరీకరణ చిత్రీకరించడం నిషేధం అమలులో ఉన్న సమయంలో ఇలా చిత్రీకరణపై టిటిడి తీవ్రంగా చర్యలకు ఉపక్రమిస్తోంది. తిరుమల 2టౌన్ పోలీసులు డ్రోన్‌కెమెరాను పరిశీలించారు. తిరుమల పరిసరాలు, శిలాతోరణం సందర్శనీయ ప్రాంతాలు చిత్రీకరించడం పెద్ద వివాదంగా మారింది.

## అక్కగార్ల ఆశీస్సులతో కనుమదారిలో సురక్షిత ప్రయాణం : టిటిడి రవాణా విభాగం



**తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి వెళ్ళే మొదటికనుమదారిలో పూజలందుకుంటున్న అక్కగార్ల దేవత ఆశీస్సులతో యాత్రికులు సురక్షిత ప్రయాణం చేస్తున్నారని అర్చకులు, టిటిడి రవాణావిభాగం విశ్వాసం వ్యక్తం చేసింది. కార్తీకమాస శుక్రవారం రోజు ఏడుగురు అక్కగార్లదేవతలకు టిటిడి రవాణశాఖ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. శుక్రవారం ఉదయం కనుమదారిలోని గుడిలో టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, అన్నప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, రవాణావిభాగం డిఎం లక్ష్మీప్రసన్న భక్తులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

## 23,29తో బాటు ఆ పదిరోజులు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో తిరుమలలో పదిరోజులు డిసెంబర్ 30నుండి 2026 జనవరి 8వతేదీ వరకు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేసినట్లు టిటిడి తెలిపింది. తిరుమల శ్రీవారి ఆలయంలో జరిగే అనేక పర్వదినాల నేపథ్యంలో విఐపి బ్రేక్ దర్శనాల రద్దుచేయడం జరిగిందని పేర్కొంది. డిసెంబర్ 23న కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం .29వతేదీ వైకుంఠ ఏకాదశికి ముందురోజు,ఆ తరువాత పదిరోజులు జనవరి 25న రథసప్తమి కారణంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహాయించి విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేయడం జరిగిందని తెలిపారు. భక్తులు ఈ సూచనలు పాటించి టిటిడికి సహకరించాలని కోరారు. ప్రకటించిన రోజుల ముందురోజుల్లో సిఫార్సు లేఖలు స్వీకరించబడవని తెలిపింది.

## రెండు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలి: ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం శ్రీవారిఆలయంలోనికి ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛాంధ్రకార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, తెలంగాణ ఎమ్మెల్యేమైనంపల్లి రోహిత్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# కలకటవారిపల్లెలో స్క్రబ్ టైపస్ కేసు!

**సదుం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అమ్మగారిపల్లి పంచాయతీ కలకటవారిపల్లెలో స్క్రబ్ టైపస్ కేసును గుర్తించినట్లు చెరుకువారిపల్లె పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ చరణ్ తెలిపారు. దీని నివారణ కోసం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నివారణ చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నార. ప్రస్తుతం కేసు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వ్యాధిపై అవగాహన కల్పించారు.

గ్రామం యందు మలాథిన్ క్రిమి సంహారక ద్రావణం పిచికారి చేయిం చారు. ప్రజలకు ఆరోగ్య విద్య ద్వారా అవగాన కల్పిం చారు. కార్య క్రమం లో మలేరియా సబ్ యూనిట్ అధి కారి విద్యా సాగర్, ఆరో గ్య పర్య వేక్షణ అధి కారి నీల కంఠ, పం చా యతీ కార్య దర్శి చలపతి ,ఆరో గ్య కార్యకర్త సర స్వతి, ఆశా కార్య కర్తలు హేమ లత, మానస పాల్గొన్నారు


GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No.29/2025-26/CE/SE(Works- III)/EE-VB/GVMC, Dt:03.12.2025(Item 01 to 02)

No. of Works : 02 Nos (Two),
Value of Works (ECV) : Rs.6,61,93,147/-
Downloading Starting Date : 05.12.2025 @ 10.00 P.M.,
Date of Opening Tenders : 20.12.2025 @ 02.00 P.M.,
Further details at http://www.apeprocurement.gov.in
O/o the Chief Engineer, GVMC.
Sd/- Commissioner, GVMC

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ - ములుగు జిల్లా
పత్రికా ప్రకటన
ఆర్.సి.నం. 2328/2025/యస్ 5, తేది: 04.12.2025
ఈ కార్యాలయము పత్రికా ప్రకటన తేది: 22.11.2025నకు కొనసాగింపుగా ఇందుమూలముగా తెలియ జేయునది ఏమనగా గ్రామ పంచాయతీ ఎన్నికల కారణంగా అటవీ మండలాధికారి, ములుగు, తాడ్వాయి మరియు ఏటూరు నాగారం డివిజన్ పరిధిలో గల ప్రభుత్వ అక్రమ కలప మరియు ఇసుక రవాణా చేయుచూ పట్టుబడి ప్రభుత్వపరము చేయబడిన (29) వాహనములు, తేది: 18.12.2025 రోజున అవి ఉన్న యదాస్థితిలో టెండరు ద్వారా వేలము వేయబడుచున్నవి. వేలమునకు సంబంధించిన నియమ నిబంధనలను టెండరు 2328/2025/S5, తేది: 22.11.2025లో పొందు పరుచబడినది. టెండరు దరఖాస్తు ఫారములను జిల్లా అటవీ అధికారి కార్యాలయము, ములుగు యందు కార్యాలయ పని వేళలలో పొందగలరు. కావున వేలములో పాల్గొనదలచిన వారు తేది: 17.12.2025 సా.05.00 గం.ల లోపు టెండర్లను జిల్లా అటవీ అధికారి, ములుగు వారి కార్యాలయములోని టెండరు డబ్బాలో వేయగలరు. అట్టి టెండర్లను తేది: 18.12.2025 రోజు ఉ.11.00 గం.లకు తెరువబడును.
సం/- జిల్లా అటవీ అధికారి, ములుగు జిల్లా
DIPR.No.11750-PP/CL/Advt/1/2025-26, తేది: 05.12.2025

జాతీయ ప్రగతి అంటే వ్యక్తుల శ్రమ, శక్తి, నిజాయితీ, జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.

-మార్షల్

# 'ఇండిగో' పరీక్ష!

దేశీయ విమానసర్వీసుల్లో నెలకొన్న అంతరాయం దేశవ్యాప్తంగా విమాన ప్రయాణీకులకు తీరని ఇక్కట్లు తెచ్చిపెట్టాయి. చౌకధరల విమానయానసంస్థగా పేరున్న ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ సంస్థ నడుపుతున్న ఇండిగో విమానసర్వీసులకు తీవ్రస్థాయిలో అంతరాయం కలిగింది. అంతేకాకుండా నాలుగురోజులుగా వందలాది విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ప్రయాణీకులు ఎయిర్‌పోర్టుల్లోనే పడిగాపులు పడి వేచి ఉంటున్నా సమస్యకు పరిష్కారం లభించడంలేదు. ఎసిక్లాస్ ధరలతో విమానయానం చేయవచ్చని తలపోసిన ఎన్డీయే సర్కారు దేశంలోకి అనేక సంస్థలను ప్రోత్సహించింది. మరికొన్ని అయితే దేశీయ సంస్థలతో జతకట్టి మరీవచ్చాయి. మొత్తం చెక్ ఇన్ అయిన తర్వాత విమాన సర్వీసులు రద్దుచేస్తున్నట్లు ప్రకటించడం అసహనం పెంచింది. సిబ్బంది కొరత, పైలట్లకు శిక్షణపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డిజిసిఎ విధించిన ఆంక్షలు వంటివి ఇండిగో సర్వీసులకు అడ్డంకులు తెచ్చిపెట్టాయని కంపెనీ వాదిస్తోంది. గడచిన నెలలోనే ఈసంస్థకు చెందిన మొత్తం 1232 విమాన సర్వీసులు రద్దయ్యాయి. వివిధ విమానాశ్రయాల్లోని పార్కింగ్ ప్రాంతాలను కూడా ఇండిగో విమానాలు ఆక్రమించుకోవడంతో ఇతర ఎయిర్‌లైన్స్‌కు సైతంవిపరీత జాప్యం కలిగింది. పైలట్లకు విశ్రాంతి, విధుల్లో నిబంధనల నుంచి ఫిబ్రవరి మొదటి వారం వరకూ మినహాయింపు ఇవ్వాలంటూ ప్రభుత్వం కోరింది. ఈలోపు సిబ్బంది కొరత, శిక్షణ పొందిన పైలట్లు రావడంలో జాప్యం వంటివి ఇండిగోకు తీరని నష్టాలు తెచ్చిపెట్టింది. ప్రణాళికా లోపాలవల్ల తగినంతమంది సిబ్బందిని రాబట్టుకోలేకపోయింది. దీనికితోడు ఇటీవల తరచూ జరుగుతున్న సాంకేతిక లోపాలు, విమాన ప్రమాదాలు, అత్యవసర ల్యాండింగ్ సంఘటనలతో డిజిసిఎ విమానయాన సంస్థలకు ఖచ్చితమైన మార్గదర్శకాలు జారీచేసింది. ఒక్క దేశీయ సర్వీసుల్లోనే ఇలా జాప్యం, లేదా రద్దుచేయడం వంటివి సంభవించడం వ్యూహాత్మకంగానే జరిగాయని ప్రయాణీకులు ఆక్రోశిస్తున్నారు. అంతర్జాతీయ సర్వీసుల్లో ఆదాయం ఎక్కువగా ఉంటున్నందున ఆ సర్వీసులను మినహాయించి కేవలం దేశీయ సర్వీసులపైనే విధించడం కంపెనీ వ్యూహాత్మక చర్యలేనన్న ప్రయాణీకుల ఆరోపణలకు ఇండిగో జవాబుదారీ కాలేకపోయింది. రానురాను ఇండిగో సర్వీసుల సమస్య ప్రస్తుత శీతాకాల సమావేశాలను కూడా కుదిపేసేస్థాయికి చేరింది. హోంమంత్రి, పౌరవిమానయాన మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షించినా పరిస్థితిలో మార్పులు రాలేదు. గడచిన నాలుగు రోజుల్లోనే 550కిపైగా విమానసర్వీసులు అప్రకటితంగా రద్దుచేయడంపై ప్రజాప్రతినిధులు సైతం జవాబుదారీ కావాల్సి వస్తోంది. పౌరవిమానయాన చరిత్రలో ఇంతభారీ ఎత్తున విమానసర్వీసులు రద్దుకావడం ఇదేప్రథమం. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డిటిఎల్)నుంచి ఉపశమనం కావాలని మొదటినుంచి ఇండిగో పట్టుబడుతోంది. పైలట్లకు విశ్రాంతి సమయం 36నుంచి 48 గంటలకు పెంచింది. ఇప్పుడు ఈ వీక్లీరెస్ట్‌ను సెలవుగా పరిగణిస్తున్నట్లు డిజిసిఎ ప్రకటించింది. అయితే ఎఫ్‌డిటిఎల్ ప్రకారం వీక్లీ రెస్ట్‌ను సెలవుగా పరిగణించడానికిలేదు. వీక్లీరెస్ట్‌పీరియడ్, సెలవులు వేరువేరుగా చూస్తారు. పైలట్ల అలసట సమస్య పరిష్కారానికే డిజిసిఎ ఈ కఠిన నిబంధనలు తెచ్చింది. అలాగే పైలట్లు వరుసగా రెండుకంటే ఎక్కువ రాత్రి షిఫ్ట్‌లు పనిచేయకూడదన్న నిబంధనను ప్రస్తుతం పక్కన పెట్టింది. ప్రతి పక్షం రోజులకు ఒక పర్యాయం నిబంధనలు సమీక్షించే డిజిసిఎ కొంతమేర దిగివచ్చినా పరిస్థితుల్లో మార్పురాలేదు. దేశీయ సర్వీసుల్లో గిట్టుబాటు కావడం లేదన్న సాకుతో సర్వీసులు, నిబంధనల పేరిట వందలాది సర్వీసులు రద్దుచేసారని ప్రయాణీకులు చెపుతున్నారు. ఇండిగో ప్రభావం ఇప్పుడు దేశంలోని మెట్రోనగరాల సర్వీసులపై పడింది. ఢిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కత్తా, అహ్మదాబాద్, లక్నో, హైదరాబాద్ వంటి నగరాల్లోని ప్రయాణీకులకు తీవ్ర అసహనం రేకెత్తిస్తోందనే చెప్పాలి. రౌండ్‌ట్రిప్ టికెట్ ధరలు కూడా ఒక్కసారిగా పెరిగిపోయాయి. రూ.20 వేలనుంచి ఏకంగా రౌండ్‌ట్రిప్ ఏకంగా రూ.92 వేలవరకూ ఉంది. ఇండిగో వెబ్‌సైట్‌నుపరిశీలిస్తే సుమారు 2200 సర్వీసులవరకూ నడుపుతోంది. దిగ్గజ సంస్థ ఎయిరిండియా కంటే రెండురెట్లు ఎక్కువే. ఈ కంపెనీకి సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొత్తరోస్టర్‌నియమాలు వంటి వాటితో సతమతమవుతోంది. ఇండిగో పరిస్థితి శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో విపక్షాలకు పెద్ద అస్త్రం లభించినట్లయింది. ప్రభుత్వరంగ గుత్తాధిపత్యమే కారణమంటూ విపక్షనేతలు అస్త్రాలుసంధిస్తున్నారు. విమానయాన సంస్థల్లో కేవలం ఒక్క ఇండిగోకు మాత్రమే ఈ సమస్య ఎందుకు వచ్చింది. నిన్నమొన్నటివరకూ విండోస్ బ్రేక్‌డౌన్ కారణంగా ప్రధాన ఎయిర్‌పోర్టుల్లో సర్వీసులు స్తంభించిపోయాయి. ఈ సమస్య నుంచి గట్టెకుతున్న తరుణంలో కేవలం ఒక్క ఇండిగోలోనే వందలాది సర్వీసులు నిలిచిపోవడం దేశంలోని 50శాతానికిపైగా ప్రయాణీకులకు అపారనష్టం కలిగించిందనడంలో సందేహం లేదు. ప్రభుత్వపరంగా ప్రవేశపెట్టిన కొత్త నిబంధనలే ఇందుకు కారణమా? విమానసంస్థల మధ్య నెలకొన్న పోటీ, గుత్తాధి పత్యమే కారణమా? లేక ఏదైనా కుట్రకోణం ఉందా? లేక సిబ్బంది కొరత ఆ సంస్థను పట్టిపీడిస్తోందా అన్నఅంశాలపై ఇప్పటికీ స్పష్టతరాలేదు. ఆలస్య మైనా ప్రభుత్వం స్పందించి ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించడం కొంత ఊరటనిచ్చే అంశం. అలాగే పూర్తిస్థాయిలో కంట్రోల్ రూమ్‌ను కూడా ప్రారంభించి తక్షణ పరిష్కారానికి పూనుకోవడంద్వారా విమర్శల నుంచి తప్పించుకో గలిగిందని భావించవచ్చు.

గొప్ప పనులు చేయాలంటే కావలిసింది శక్తి కాదు, ఓపిక, ఆత్మవిశ్వాసం.



ఐ.జాన్సన్

ఎక్కువ మంది విమర్శిస్తారు, కొద్ది మంది ప్రశంసిస్తారు, బహుకొద్ది మంది ప్రోత్సహిస్తారు.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



## దేశం పట్ల ఐక్యత ఉండాలి

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రాంగణంలో పద్మభూషణ్ శ్రీపతిపండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేయకూడదనే కొందరి నిరసనలు విస్మయం కలిగిస్తున్నాయి. బాలసుబ్రహ్మణ్యంప్రఖ్యాత గాయకుడిగా ఆయన కీర్తి విశ్వవిదితం. అలాంటి వ్యక్తివిగ్రహం ఏర్పాటు విషయంలో ప్రాంతీయ భావనలు రేకెత్తటం పట్ల అనేకులు ఆందోళనలో ఉన్నారు. బాలసుబ్రహ్మణ్యం గళం వినని తెలుగువాడు ఉండడు. తన గాత్రంతో ఎంతో మందిని ఆహ్లాదపరచి, స్వాంతన చేకూర్చినటువంటి వ్యక్తి మన బాలసుబ్రహ్మణ్యం. సంగీతానికి, కళలకు ప్రాంతీయత ఆపాదించటం ఆమోదించదగ్గ పరిణామం కాదు. తమిళనాడు రాజధాని చెన్నై మహానగరంలో ఒక వీధికి బాలసుబ్రహ్మణ్యం పేరు పెట్టి అక్కడి ప్రభుత్వం గౌరవించింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తెలుగువారు తెలంగాణా రాష్ట్రంలో ఆంధ్రా ప్రాంత వ్యక్తి విగ్రహం ఏర్పాటును వ్యతిరేకించటం ఎంతో విచారకరం.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## మందుబాబుల ఆగడాలు

బహిరంగ ప్రదేశాల్లో మద్యంప్రియుల ఆగడాలు శృతిమించిపోతూ వున్నాయి. బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవు. ఎవరూ ఆరుబయట ప్రదేశాల్లో తాగొద్దు. మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని అధికారులు హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా, క్షేత్రస్థాయిలో ఎలాంటిఫలితం కనిపించడంలేదు. దీనికితోడు అధికారులతనిఖీలు అంతంతమాత్రమే. దీంతో మందుబాబులకు పూర్తిస్వేచ్ఛ లభించినట్లయింది. కాస్త చీకటిపడితే జనావాసాల్లోనే మద్యం తాగుతున్నారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాలపల్లి జిల్లా

## ప్రజల సహకారంతోనే మార్పు సాధ్యం

పర్యావరణం అంటే మనందరి ప్రాణాధారం. అది కేవలం ప్రకృతితో సంబంధంఉన్న విషయంకాదు, మన ఆరోగ్యం, మన భవిష్యత్తు అంతా దానిపైనే ఆధారపడి ఉన్నాయి. కాలుష్య గాలి, మలిన జలాలు, నాశనమవుతున్న భూమి ఇవన్నీ ప్రకృతిని మాత్రమే కాదు, మన సమాజాన్ని నిశ్శబ్ధంగా దెబ్బతీస్తున్నాయి. అనారోగ్యాలు పెరుగుతున్నాయి. జీవనప్రమాణాలు తగ్గిపోతున్నాయి. నిజమైన మార్పు ప్రజల సహకారంతోనే సాధ్యం అవుతుంది.

- కె.రామారావు, నల్గొండ

## ఎంత ఉపయోగమో అంత ప్రమాదకరం

దేశపురోభివృద్ధికి ఈ కుత్రిమమేథ ఎంతగానో తోడ్పడుతుందని మేధావులు, రాజకీయ నాయకులు స్పష్టంగా చెబుతున్నారు. ఇది నాణేనికి ఒక ప్రక్కమాత్రమే. ఈమేథను సైబర్ క్రిమినల్స్ మరింత ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్రజలను ఏలా మోసం చేసి వారిబ్యాంకుల్లో ఉన్న డబ్బును సులభంగా దొంగిలించాలో అనేక కొత్త పద్ధతులను కని పెడుతున్నారు. డిజిటల్ అరెస్టులు అనేవి లేవు. మొర్రో అని ప్రభుత్వాలు, పోలీసులు అన్ని మీడియాల ద్వారా ఎలుగెత్తి చాటుతున్నా బాగా చదువుకున్న ఆడవారు, మగవారు క్రిమినల్స్ ఉచ్చులో పడుతున్నారు. ఆడవారి ఫోటోలను సంపాదించి మార్ఫింగ్ చేసి అసభ్యంగా చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేసి భయపెట్టి డబ్బు గుంజు కొంటున్నారు. కృత్రిమ మేధ ఎంత ఉపయోగకరమో అంతకన్నా ఎక్కువ ప్రమాదకరం అనే వాస్తవాన్ని సాంకేతిక నిపుణులు కూడా తమ వ్యాసాలలో వ్యక్తం చేశారు.

-ఎన్. రామలక్ష్మి సికింద్రాబాద్

## ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలి

గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల స్థాయిని బలోపేతంచేయడం సుస్థిరమైన గ్రామీణ ఆరోగ్యానికి మూలాధారం. దేశంలో సుమారు 70శాతం ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నప్పటికీ, అక్కడ నాణ్యమైన ఆరోగ్య సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. ఈకొరత కారణంగానే అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం వివిధకార్యక్రమాల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి నిరంతరం ప్రయత్నిస్తోంది. నేషనల్ రూరల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు గ్రామీణప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను మెరుగు పరచడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. నాణ్యమై సేవలకు చర్యలు అవసరం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మానవ వనరుల వినియోగం అవసరం

గత ఐదేళ్లలో అయిదుగురు ప్రధానులు మారి చైనా వేసిన వలకు చిక్కిన నేపాల్ చేప లాగా గిలగిల కొట్టుకొని ఒడ్డున పడి ఇప్పుడు ఇప్పుడే తెరుకుంటున్న తరుణంలో నిరుద్యోగ సమస్య పులి మీద పుట్రా లాగా సంభవించింది. ఏ దేశమైన అభివృద్ధి సాధించాలి అంటే మానవ వనరుల వినియోగం తప్పనిసరి. మానవ వనరుల వినియోగం సాధించాలి అంటే వారి జీవికకు ఉద్యోగం అవసరం. ఉపాధి కల్పనతో యువ వనరులను ఉపయోగించుకోవచ్చు.

-అవినాష్ భారత్, జనగాం

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: tpage@vaartha.com)

# పాలకుల నిర్వాకంతో వెక్కిరిస్తున్న ధరలు

**ముఖ్యంగా అదుపు తప్పిపోతున్న ధరలను నియంత్రించడంలో పాలకులు ఘోరంగా విఫలమవుతున్నారు. ప్రతిపక్షాలు కూడా ఈ విషయంలో ఆశించిన మేరకు శ్రద్ధచూపడం లేదు. చివరకు ప్రజాసమస్యలను కూలకషంగా చర్చించి పరిష్కారం వైపు అడుగులు వేయడానికి చేయూతనిచ్చే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన శాసనసభలు, లోక్‌సభ, రాజ్యసభల్లో కూడా ధరల సమస్య చర్చకు చోటు దక్కడం లేదు. సమగ్ర చర్చల సంగతి దేవుడెరుగు. కనీసం ఇటీవల కాలంలో ప్రస్తావన కూడా రాకపోవడం దురదృష్టకరం. ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో తోచనివారికి నల్లధనస్వాములకు ఏ వస్తువు ధర ఎంత పెరిగినా, చీకుచింత ఉండకపోవచ్చు కానీ, కూలినాలి చేసుకునేవారు, రెక్కాడితే డొక్కాడనివారు, నెల జీతం మీదనే ఆధారపడి జీవనం సాగించే మధ్యతరగతి పరిమితి ఆదాయం గలవారిదే సమస్య అంతా.**

దామెర్ల సాయిబాబ

పాలక, ప్రతిపక్ష పార్టీల నేతలు వ్యూహాలు, ప్రతి వ్యూహాలతోనే కాలం గడుపుతున్నారే తప్ప సామాన్య ప్రజలకు ఆందోళన కలిగించే సమస్యలపై దృష్టి సారించలేకపోతున్నారు. ప్రజలపై ఎలా భారం వేసి ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే ధ్యేయంగా ప్రభుత్వంలోని నేతలు ఆలోచిస్తుంటే వేసిన భారాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చడానికి ప్రతిపక్ష నేతలు సకల ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకానీ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా త్రికరణశుద్ధిగా పనిచేయలేకపోతున్నారు. ఇటీవల కాలంలో అవీఇవి అని కాదు, అన్ని వస్తువుల ధరలు పెంచే కార్యక్రమం ఉధృతమైంది. గతప్రభుత్వాల కాలంలో పెంపు కార్యక్రమం లేదని చెప్పడం లేదు. అప్పుడు కూడా ఉంది. గతంలో పాలకులు విద్యుత్, బస్సు చార్జీలు పెంచినప్పుడు ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ఇది అన్యాయం, అక్రమం అంటూ నినదించి ప్రజలను సమీకరించి ఉద్యమానికి నడుంకట్టారు. కేంద్రప్రభుత్వ పరిధిలోని వస్తువుల ధరలు పెరిగినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు ఆ ధరలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. నాయకులు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించారు. పరిస్థితుల దృష్ట్యా మారిన కాలానికి అనుగుణంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం తదితర కారణాలతో ధరలు పెంచక తప్పడం లేదని ఆనాడు అధికారంలో ఉన్న పెద్దలు సెలవిచ్చారు. పెట్రోలు, డీజిల్ ధరలు ఇష్టానుసారంగా పెంచినప్పుడు ఇదే పరిస్థితి. అయితే ఆనాడు ప్రతిపక్షంలో ఉండి ఈ ధరలను ఉద్యమాలతో తీవ్రంగా వ్యతిరేకించిన పెద్దలే అధికారంలోకి రాగానే ధరలు పెంచని తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయని చిలకపలుకులు పలికారు. కేంద్రస్థాయిలో పరిస్థితి అలా ఉంచితే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎక్కడవీలైతే అక్కడ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవడం కోసం రిజిస్ట్రేషన్‌లతోపాటు భూముల విలువలు లాంటివి పెంచుతూ ఆదాయాన్ని ఇబ్బడిముబ్బడిగా పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. విద్యుత్ రేట్లను పెంచేందుకు ప్రయత్నాలు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్నదనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. విద్యుత్ కానీ, పెట్రోలు, డీజిల్, బస్సు చార్జీలు పెంచడం పరోక్షంగా అనేక రంగాలపై ప్రభావం చూపుతూ సామాన్యుడి జీవితాన్ని మరింత దుర్భరం చేస్తాయి. ఇతర సమస్యల మాట ఎలాఉన్నా రోజురోజుకు పెరిగిపోతున్న ధరలు ప్రజాజీవితాలను నరకప్రాయంగా మారుస్తున్నా నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో పెట్టే ఆలోచన కానీ, ప్రయత్నం కానీ, దాదాపు జరగడంలేదనే చెప్పొచ్చు. అదేమంటే సంక్షేమం, అభివృద్ధి అంటారు. అందుకే ఉచిత పథకాలు ఇష్టానుసారంగా ప్రకటిస్తున్నారు. కొత్త కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నారు. ఓట్ల కోసం, సీట్ల కోసం, అధికారం కోసం అడిగినవే కాదు అడగని వరాలు కూడా ఇస్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న నిర్భాగ్యులకు చేయూత నివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. చేపలు ఉచితంగా పంపిణీ చేయడం కాదు చేపలు పట్టుకోవడం నేర్పించాలన్నట్లు జీవనోపాధికి ఉపయోగపడే పథకాలు, విద్య, శిక్షణలు అందివ్వాలి. ఆ కోణంలో మాటలు చెపుతున్నా చేతల్లో మాత్రం శూన్యమనే చెప్పచ్చు. ఇక ఆ విషయం అలా వదిలిపెడితే పూటగడవని సామాన్యుడి సమస్యల పరిష్కారం వైపు దృష్టి సారించకపోవడం దురదృష్టకరం. ముఖ్యంగా అదుపు తప్పిపోతున్న ధరలను

### ఒక్క మాట

నియంత్రించడంలో పాలకులు ఘోరంగా విఫలమవుతున్నారు. ప్రతిపక్షాలు కూడా ఈ విషయంలో ఆశించిన మేరకు శ్రద్ధచూపడం లేదు. చివరకు ప్రజాసమస్యలను కూలకషంగా చర్చించి పరిష్కారం వైపు అడుగులు వేయడానికి చేయూతనిచ్చే ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన శాసన సభలు, లోక్‌సభ, రాజ్యసభల్లో కూడా ధరల సమస్య చర్చకు చోటు దక్కడం లేదు. సమగ్ర చర్చల సంగతి దేవుడెరుగు. కనీసం ఇటీవల కాలంలో ప్రస్తావన కూడా రాకపోవడం దురదృష్టకరం. ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టాలో తోచని వారికి నల్లధనస్వాములకు ఏ వస్తువు ధర ఎంత పెరిగినా, చీకూచింతా ఉండకపోవచ్చు కానీ, కూలీనాలీచేసుకునేవారు, రెక్కాడితే డొక్కాడనివారు, నెల జీతం మీదనే ఆధారపడి జీవనం సాగించే మధ్యతరగతి పరిమితి ఆదాయం గలవారిదే సమస్య అంతా. ఇంటి పన్నులు పెంచుతున్నారు. అద్దెలు పెరిగిపోతున్నాయి. కరెంటు చార్జీలు అద్దెలో దాదాపు మూడోవంతు చేరుకున్నాయి. గ్యాస్ ధరనే తీసుకుందాం. ఓ పక్క గ్యాస్‌ను నిరుపేదలకు అందించాలని ఎంతో కొంత సబ్సిడీ ఇస్తూనే మరోకపక్క మధ్యతరగతి వారికి అందకుండా పెంచుకుంటూపోతున్నారు. 1980 సంవత్సరంలో గ్యాస్ ధర యాభైఆరు రూపాయలు ఉంటే ఎనభైఆరు నాటికి ఆరు రూపాయలు మాత్రమే పెరిగింది. ఆ తర్వాత అదుపులేకుండా పోయింది. నేడు తొమ్మిది వందలకు చేరుకున్నది. ఇక కిరోసిన్ పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు అందాల్సిన కిరోసిన్ ఎలా పెట్రోల్‌లోకి చేరుకుంటుందో తెలియంది కాదు. ఒకపక్క గ్రామాలు సైతం కట్టెల పొయ్యిని మరిచిపోతున్నారు. రానురాను కట్టెలు దొరకడం కూడా కష్టమైంది. మరొకపక్క కిరోసిన్ అందుబాటులో లేకుండాపోతున్నది. కాల పరిస్థితులకు అనుగుణంగా మనుషులఅలవాట్లు కూడా మారిపోయాయి. ఇంకా మారుతూనే ఉన్నాయి. ఒకటి, రెండు రోజులు భోజనం లేకుండా అయినా ఉండగలుగుతారు కానీ టీ, కాఫీ లేకుండా ఉండలేని పరిస్థితుల్లో సామాన్యులు సైతం ఇరుక్కుపోయారు. పప్పుబెల్లాలే కాదు, ఉప్పు, మిరపకాయలు కూడా భగ్గున మండుతున్నాయి. పప్పుదినుసుల పరిస్థితి చెప్పక్కర్లేదు. అదీ, ఇదీ అనితేడా లేకుండా అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. గత నెలలో ఉన్న ధర ఈనెలలో ఉండడం లేదు. ఇప్పుడు ఉన్నధర వచ్చే నెల ఉండదు. ఇలా ధరలను ఇష్టానుసారంగా పెంచుతూనే ఉన్నారు. అయితే ఒక్కడ ఒక విషయం గమనించాలి. రైతుల వద్ద సరుకులు ఉన్నప్పుడు మాత్రం ధరలు పాతాళ లోకంలో ఉంటున్నాయి. బియ్యం విషయం తీసుకున్నా ఇది స్పష్టమవుతుంది. ఉత్పత్తిదారుల నుండి, వినియోగదారుడి వద్దకు వచ్చేసరికి రెట్టింపు అయిపోతున్నాయి. పోని వ్యాపారస్తులైనా సంతోషంగా ఉన్నారంటే అదీలేదు. వెనుక రాజకీయ అండలు ఉన్నవారు తప్ప వ్యాపారులు కూడా రకరకాల ఇబ్బందులు పడుతున్నారు. ఉత్పత్తిదారునికి, వినియోగదారుడికి మధ్య వ్యత్యాసం నిత్యావసర వస్తువుల్లో దేనిని తీసుకున్నా దేశవ్యాప్తంగా వేలాది కోట్లల్లో తేడా ఉండవచ్చు. ఇదంతా ఎటుపోతున్నది? ఎవరి జేబుల్లోకి చేరుతుంది? తదితర విషయాలన్నీ తెలియనివి కావు. ఇటీవల కూరగాయల పరిస్థితి మరీవిచిత్రంగా తయారైంది. చిల్లర సామానుల కంటే కూరగాయల ధరలు నిప్పులు లేకుండానేమండిపోతున్నాయి. సామాన్యమైన చిక్కుడు, బెండా, బీర, లాంటివి కూడా కిలోవంద రూపాయలకుపైగా అమ్ముతున్నారు. ఆకు కూరల ధరలు అందుబాటులో లేవు. మరొకపక్క కూరగాయలు పండించే రైతులు ఏమాత్రం సంతోషంగాలేరు. రానురాను కూరగాయల సాగు తగ్గిపోతున్నది. ఇతర పంటల మాదిరి కాదు. ఎప్పటిప్పుడు మార్కెట్‌కు తీసుకుపోయి కూరగాయలను అమ్ముకోవాల్సి ఉంటుంది. రవాణా సౌకర్యాలు లేవు. బతిమాలో, భంగపడో అంతోఇంతో దళారులకు దక్షిణ సమర్పించుకొంటే తప్ప మార్కెట్‌లో అమ్ముకోలేనిపరిస్థితి. మార్కెట్లల్లో కనీసవసతులు కూడా లేవు. దళారుల దౌర్జన్యాలు పెరిగాయి. ఇన్నిబాధలు పడలేక మధ్యతరగతి రైతులు కూరగాయల సాగుకు మంగళం పాడేరు, పాడుతున్నారు. రైతు బజారులు ఏర్పాటు చేశారు. రైతులే నేరుగా తాము పండించిన కూరగాయాలు తీసుకువచ్చి వినియోగ దారులకు అమ్మేందుకు ఉద్దేశించిన రైతు బజార్లు నేడు అధికశాతం దళారులు ఆక్రమించుకొన్నారు. ధరల పెరుగుదల బాధ అందరిది. సంసారాన్ని సరిదిద్దుకోలేక ఎందరో గృహిణుల ఆవేదన వర్ణనాతీతం. ధరలను అదుపు చేస్తామని ఉపన్యాసాలు ఇస్తున్నారు. కమిటీలు వేస్తున్నారు. రివ్యూలు చేస్తున్నారు. ఫలితం మాత్రం శూన్యం. ●

# జేబులు గుల్ల చేస్తున్న మొబైల్ యాప్‌లు!

డా.పోలం సైదులు

సమాజ పరిణామక్రమంలో భాగంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంభవిస్తున్న మార్పుల కారణంగా రోజురోజుకు టెలి కమ్యూనికేషన్ వ్యవస్థలో వస్తున్న మార్పులు అందరికీ తెలిసిందే. దేశంలో పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా ఫోన్ల వినియోగం కొనసాగుతుందనడంలోఎలాంటి అనుమానం అక్కర్లేదు. కుటుంబంలో ఎంతమంది సభ్యులుంటే అన్ని ఫోన్లు వాడుతున్నారన్న ఆశ్చర్యం అక్కర్లేదు. ఎందుకంటే బడికెళ్లే పిల్లలు సైతం ఆన్‌లైన్ క్లాసులంటూ ఫోన్లు కొనుగోలు చేస్తున్నారనడంలో నిజం లేకపోలేదు. ఎప్పుడైతే 4జి, 5జి అంటూ ఇంటర్నెట్ మొబైల్ డేటా అందరికీ అందుబాటులోకి వచ్చాక వాట్సాప్, యూట్యూబ్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, స్నాప్‌చాట్, థ్రెడ్స్ లాంటి సామాజిక మాధ్యమాల వాడకం చాలాపెరిగి, అవసరానికంటే ఆనందం, కాలక్షేపం కోసం వాడకం ఎక్కువైపోయింది. విచిత్రకరమైన విషయమేమిటంటే ఏవైనా కొత్తవస్తువులు కొన్న, అందంగా రెడీ అయినా, ఏ చిన్నపని చేసిన, ఆనందకరమైన లేదా విచారకరమైన విషయాలైన కూడా చిత్ర, విచిత్రంగా సామాజిక మధ్యమాలలో అప్లోడ్ చేసి లైక్స్, కామెంట్స్ కోసం ఎదురుచూడాల్సిందే. ఇంకా చదువు, సాంకేతిక పరిజ్ఞానంతో సంబంధం లేకుండా రీల్స్ చేస్తున్నారు. ఎంతలా అంటే మానవ సంబంధాలు ప్రత్యక్షంగా కంటే సామాజిక మధ్యమాలలోనే ఎక్కువగా కొనసాగుతున్నాయన్నాడంలోఎలాంటి అతిశయోక్తిలేదు. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలన్నీ ఫోన్లద్వారా ఫోన్ పే, గూగుల్ పే, పేటియం లాంటి యాప్‌లనుపయోగించి చేస్తున్నారు. మొదట్లో ఇది కేవలం నగరాలకే పరిమితమైనప్పటికి పరిణామం చెంది నేడు చిన్న




పల్లెలో సైతం స్మార్ట్ ఫోన్ కలిగివున్న ప్రతిఒక్కరు బ్యాంకు అకౌంట్ కలిగి నగదురహిత బదిలీలు జరుపుతున్నారన్న విషయం అందరికీ తెలిసిందే. ఫోన్‌లో ఏమైనా వీడియోలు చూస్తున్నప్పుడు గానీ లేదా గేమ్స్ ఆడుతున్నప్పుడు మధ్యలో అడ్వర్టైజ్మెంట్స్ (యాడ్స్) వస్తుంటాయి. గతంలో కష్టమర్లను ఆకర్శించి ఏవో వస్తువులు అమ్ముకోవడానికి యాడ్స్ చేసేవారు. కానీ ఇప్పుడు అలాకాకుండా క్షణాలలో మోసపోయే విధంగా, అవికూడా చదువురాని అమాయక ప్రజలను, పేదలను టార్గెట్ చేసేవిధంగా యాడ్స్ వస్తున్నాయి. ఎలా అంటే వారంరోజులు ఫ్రీ ట్రయిల్ లేదా ఒక్క రూపాయితో నెలరోజుల గడువులంటూ యాప్స్ డౌన్లోడ్ చేసుకోండి. దాని ద్వారా కోటీశ్వర్లు కాండీ, ఇంగ్లీష్ నేర్చుకోండి, ఫేస్బుక్, యూట్యూబ్‌లలో వీడియోలు చూస్తూ, చేస్తూ లక్షలు సంపాదించుకోండి అంటూ కొన్ని యాప్స్, ఇష్టమైన పాటలు వినొచ్చంటూ పలురకాల యాప్స్ కోసం ఎన్నో అడ్వర్టైజ్మెంట్స్ వస్తుంటాయి. పొరపాటున ఉచితమనో లేదా కేవలం ఒక్క రూపాయే కదా! అనీ క్లిక్ చేసి ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా ఒక్క రూపాయి చెల్లిస్తే చాలు, మొదట ఒక్క రూపాయి కట్ అయ్యి యాప్ ఆక్టివేట్ అవుతుంది. అదేవిధంగా ప్రతివారం 180లేదా200 రూపాయలు ఆటోమెటిక్‌గా చెల్లించేటట్లు సెట్టింగ్స్ మారి తెలియకుండానే డబ్బులు వెళ్లిపోవడం జరుగుతుంది. వీటిపై అవగాహనలేని ప్రజలు మాత్రమే మోసపోవడం కాకుండా అన్ని తెలిసిన వారు సైతం ఏదో చూద్దామని మోసపోవడం గమనార్హం. ఈవిధంగా ప్రజలను మోసంచేసే యాప్స్ నిర్వాహకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అలాగే ఊరికనే ఏదిఉచితంగా రాదు. కష్టపడకుండా ఎవరు రాత్రిరాత్రికే కోటీశ్వర్లు కాలేరు. కావున ఇలాంటివి నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ●

# విద్యార్థుల్లో వైజ్ఞానిక ప్రతిభ ప్రతిబింబించాలి

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విజ్ఞాన శాస్త్ర ప్రస్థానంలో నాటి భారత దేశంలోని వైజ్ఞానిక శాస్త్రవేత్తల అనుభవాల సారాన్ని అధ్యయనం చేస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసి పట్టుకుని విచక్షణతో కూడిన ఆలోచనత్మక విధానాలతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతూ భారత దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలవడానికి శ్రద్ధ, ఆసక్తితో నేటి తరం సైన్స్ పరిజ్ఞానం వైపు దృష్టి సారిస్తూ ఉండడం విశేషం. ఈ క్రమంలో పాఠశాల విద్యా స్థాయి నుండే బోధనాభ్యసనంలో భాగంగా శాస్త్ర విషయాలపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన అంశాలపై విద్యార్థులకు బోధకులచే అవగాహన కల్పిస్తూ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగివున్న విజ్ఞాన ప్రతిభను సృజనాత్మక ఆలోచన ధోరణిలను వెలికి తీసేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వివిధ రకాల విద్యాసంస్థలు క్షేత్రస్థాయిలో విద్యార్థులకు విద్యార్థి దశ నుండి అనేక రకాలైనటువంటి వైజ్ఞానిక వేదికలను పరిచయం చేస్తూ విద్యా సంవత్సరంలో భాగంగా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తుండడం విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందేమో. ఆయా కాలాల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారంకోసం పరిశోధనలు చేసే ప్రయత్నంలో నిస్వార్థంగా తన జీవితంలో కనుగొన్న కొత్త విషయాల ఆవిష్కరణలను ప్రపంచ వ్యాప్తం చేస్తూ భావితరాలకు మరింత సులభతరం చేసే విధంగా భారతదేశ శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి అనిర్వచితమైనది. ఇలాంటి శాస్త్రవేత్తలస్ఫూర్తితో నేటితరం ముందుకు పురోగామించాల్సిందే. అవసరాలను సులభంగా తీర్చే సాంకేతిక ఉపకరణాల వినియోగంతో జీవన విధానాలు కొనసాగాటానికి మానవ మేధస్సు ఎప్పటికీ కుతూహలంగానే ఉంటుంది. దీనికి ప్రధానంగా విద్యావ్యవస్థలో అక్షరాస్యత పెరుగుదల అతి ముఖ్యమైనది. ఈ క్రమంలో దేశంలో అన్నిరంగాల్లో సాంకేతికతను అనుసంధానం చేస్తుండడంతో సమాజంలో విద్యావ్యవస్థలో అనేక మౌలిక మార్పులు గోచరిస్తూనే ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్, డ్రోన్, రోబోటిక్ సిస్టం లాంటి అనేకమైనటువంటి ఉపకరణాలు రాబోవు కాలంలో మరింత రూపాంతరంచెంది మానవుని అవసరాలను సులభతరం చేస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. సహజంగా విద్యార్థి దశలో విద్యార్థులు ఎదుగుతున్న క్రమంలో అనేక సంఘర్షణలు అధిగమిస్తూ తమ చుట్టూఉన్న పరిసరాలపై విషయాలపట్ల ఆసక్తిని ప్రదర్శిస్తుంటారు. కొత్త విషయాలను తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువగా ఉంటుంది. విద్యార్థుల అభిరుచి, నైపుణ్యాలను పెంపొందించే విధంగా వారి ఆలోచనలు సమాజానికి దేశానికి ఉపయోగపడే విధంగా విద్యావ్యవస్థలు కూడా ఉపయోగంగా ఉంటాయి. అంతేకాకుండా వైజ్ఞానిక అంశా



లపై తర్ఫీదు పొందిన విద్యార్థుల మేధస్సు దేశానికి సమాజానికి ఏదో చేయాలని తపన కలిగి ఉంటుంది. మేధావులుగా శాస్త్రవేత్తలుగా దేశ భక్తులుగా ఎదుగుతూ కార్యదీక్షతో ఎనలేని సేవలను స్వదేశానికి అందించడానికి దోహదం చేస్తుంటాయి. భారతదేశ స్వాతంత్ర్యానంతరం అక్షరాభ్యాసం మెరుగుపడుతున్న క్రమంలో విద్యావ్యవస్థలు శాస్త్రపరిజ్ఞానం వైపుగా కొత్త విషయాలపట్ల విద్యార్థులు అవగాహన పెంచుకునేందుకు అనుభవజ్ఞులైన బోధకుల పర్యవేక్షణలో అనేక అంశాల్లో విషయ పరిజ్ఞానం అందించుటకు దోహదంచేస్తుండడం విశేషం. భారతదేశంలో ఉన్నశాస్త్రవేత్తల పరిజ్ఞానాన్ని మరింత అవగాహన చేసుకుని నేటితరం రేపటి తరానికి స్ఫూర్తిదాయకంగా మారాలి. ప్రాచీన కాలంలోనే భారతదేశంలో విద్యాపరంగా విలసిల్లిన నలంద విశ్వవిద్యాలయంఅంతర్జాతీయంగా గుర్తింపు ఉండేదని వివిధ దేశాల నుండి ఎందరో ఇక్కడికి వచ్చి అన్ని అంశాల్లో విజ్ఞాన పరిశోధనాత్మక అంశాలు తెలుసుకునే వారని చరిత్రకారులు చెబుతుంటారు. అలాంటి భారతదేశంలో చారిత్రక పరిశోధనలపై మరింత లోతుగా అధ్యయనం చేసి ఆనాటి శాస్త్రవేత్తల ఆలోచనాత్మక విధానాలకు మరింత మెరుగులు దిద్దాల్సిన ఆవశ్యకత నేటి తరానికి ఎంతైనా ఉంది. ప్రస్తుత భారతదేశం ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ఆరితేరిన శాస్త్రవేత్తల వల్ల ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు పొందడం జరిగింది. శాస్త్ర పరిజ్ఞాన అభివృద్ధిలో భారతదేశంలో వస్తున్న అనేక మార్పులు చేర్పులు యువతను శాస్త్ర పరిజ్ఞాన వైపు దృష్టిని సారించే విధంగా చేస్తున్నాయి. స్వశక్తితో భారతదేశం ఎదుగుతూ విజ్ఞాన పురోగతి సాధిస్తూనే ఉంది. ఖగోళ అంతరిక్ష పరిశోధనలు చంద్రయాన్ లాంటి ప్రయోగాలు విజయవంతం కావడం భవిష్యత్తు కాలాల్లో ప్రపంచంలోనే భారత దేశాన్ని అగ్రగామి దేశంగా నిలబెడుతున్న విధానంలో శాస్త్రవేత్తల కృషి అధికంగానే ఉంటుంది. సమస్యలకు పరిష్కారం కోసం కొత్త విషయాలను కనుగొనేందుకు సమాజం కొరకు శాస్త్రవేత్తలు చేసే కృషి ఫలితాలు సమస్య సాధనలో ఎంతో సహాయపడుతుంది. శాస్త్రవేత్తలు ఎన్నోఏళ్లు కష్టపడి నిస్వార్థంగా తన జీవితంలో కనుగొన్న అనేక కొత్త ఆవిష్కరణలు ఫలితాలు సమస్య సాధనలో మరింత సులభతరం చేసే విధంగా భావితరాలకు ప్రేరణగా నిలుస్తున్న శాస్త్రవేత్తల కృషి అమోఘమైనదే. శాస్త్రవేత్తల పరిశోధన ఆవిష్కరణలు మార్గదర్శకంగా రాబోవు కాలాల్లో ఉన్నతమైన సమాజం శ్రేయస్సు కొరకు విద్యార్థి దశ నుండే విద్యార్థుల ఆలోచన ధోరణులను వెలికితీసేందుకు విద్యావ్యవస్థలో తార్కిక, పరిశీలన, ప్రయోగాత్మక విధానాలను ప్రతిబింబించే విధంగా మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ పెంచుకునేందుకు ఇన్స్పైర్ అవార్డ్స్, వైజ్ఞానిక ప్రదర్శనలు, సైన్స్ సెమినార్స్ లాంటి అనేక కార్యక్రమాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తుండడం అభినందనీయం. ఏది ఏమైనా కాలంతో పాటు తరం మారుతున్నా భారతదేశ సంస్కృతి సంప్రదాయాలు ఆచార వ్యవహారాలను విస్మరించకుండా దేశ భవిష్యత్తు నిర్మాణంలో విద్యార్థులు విద్యావ్యవస్థలో బోధకుల అనుభవాల మార్గదర్శకత్వంతో సమాజ శ్రేయస్సు కొరకు విజ్ఞాన శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్వదేశీ పరిజ్ఞానంతో సరికొత్త ఆవిష్కరణలతో మరింత పురోగతి సాధించగలరని ఆకాంక్షి ంచడంలో సందేహం లేదు. ●



శుక్రవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద బాపూజీకి నివాళులర్పిస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

## రాజ్‌ఘాట్ వద్ద బాపూజీకి
# పుతిన్ ఘన నివాళి

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** భారత పర్యటనకు విచ్చేసిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పర్యటనలో భాగంగా ఆయన రాజ్‌ఘాట్‌ను సందర్శించి జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించారు. గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పుతిన్ వెంట కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఉన్నారు. అనంతరం పుతిన్ అక్కడి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. అంతకుముందు రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో పుతిన్‌కు సంప్రదాయబద్ధంగా గౌరవ వందనంతో స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఇరు దేశాల ఉన్నతాధికారులను ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, అధ్యక్షుడు పుతిన్ హైదరాబాద్ హౌస్‌లో భారత్ రష్యా ఫోరమ్ ద్వైపాక్షిక భేటీ జరిగింది. ఈ భేటీలో రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం, ప్రాంతీయ భద్రత, దీర్ఘకాలిక ఆర్థిక భాగస్వామ్యం వంటి కీలక అంశాలపై చర్చించారు.

## పాకిస్థాన్ సిడిఎఫ్‌గా
# ఆసిమ్ మునీర్ నియామకం

### నోటిఫికేషన్ విడుదల చేసిన అధ్యక్ష కార్యాలయం



**ఇస్లామాబాద్, డిసెంబరు 5:** పాకిస్థాన్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ ఆర్మీ చీఫ్‌గా పనిచేసిన ఫీల్డ్‌మార్షల్ ఆసిమ్‌మునీర్‌ను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సిడిఎఫ్)గా నియమించింది. ఈ మేరకు పాక్ అధ్యక్ష కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసిమ్ మునీర్‌కు సిడిఎఫ్ రూపంలో అపరిమిత అధికారాలను కట్టబెట్టింది. ఒక విధంగా చెప్పాలంటే, ప్రభుత్వానికి సమాంతర వ్యక్తిగా, పౌర ప్రభుత్వం కన్నా ఎక్కువగా ఆయన అధికారాలు ఉంటున్నాయి. ఈ సిడిఎఫ్ పదవిలో మునీర్ ఐదేళ్లపాటు కొనసాగుతారు. పాక్ చీఫ్‌గా పనిచేసిన మునీర్ పదవీకాలం గత నెల 29వ తేదీతో ముగిసింది. ఇదిలా ఉండగా పాక్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలను ఏకీకృతం చేసేందుకు పాక్ ప్రభుత్వం 27వ రాజ్యాంగ సవరణ ద్వారా సిడిఎఫ్ పదవిని సృష్టించింది. 'ఏడేళ్ల కాలానికి ఏకకాలంలో సైనిక దళాల చీఫ్‌గా వ్యవహరించేందుకు సిడిఎఫ్ పదవికి ఆసిమ్ మునీర్‌ను నియమించాలని పాక్ ప్రధాని సమర్పించిన సిఫారసును అధ్యక్షుడు అలీ జర్దారీ ఆమోదించారు' అని అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది.

**పాక్ న్యూక్లియర్ బటన్ అసిమ్ చేతిలో..**

సిడిఎఫ్ పదవి ద్వారా ఆయన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు అధిపతిగా ఉంటారు. దేశంలో అణ్వాయుధాలు, క్షిపణి వ్యవస్థలను నిర్వహించే నేషనల్ స్ట్రాటజిక్ కమాండ్ కంట్రోల్ పర్యవేక్షణ ఈయన ఆధీనంలో ఉంటుంది. దీంతో, మునీర్ పాక్‌లో అత్యంత శక్తివంతమైన సైనిక వ్యక్తిగా నిలిచారు. అసిమ్ మునీర్‌కు ఆ దేశ అధ్యక్షుడితో సమానంగా చట్టపరమైన రక్షణ కల్పించింది. అధ్యక్షుడి లాగే ఫీల్డ్‌మార్షల్ అయిన అసిమ్ మునీర్‌కు జీవితకాలంపాటు ప్రాసిక్యూట్ చేసే అవకాశం కూడా ఉండదు. వైమానిక దళం, నావికా దళాధిపతులకు కూడా ఇది వర్తిస్తుంది. సైన్యంపై పూర్తి పర్యవేక్షణ ఇకపై పాక్ ప్రభుత్వానిది కాదు. అసిమ్ మునీర్ చేతిలోనే పూర్తి సైన్యం ఉంటుంది. పాక్ మీడియా నివేదికల ప్రకారం, సిడిఎఫ్‌కు ఇప్పుడు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (విసిఒఎఎస్) పదవి నియామకాల్ని చేపట్టే అధికారం ఉంటుంది.

## రష్యాకు ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా
# కూడంకుళం అణువిద్యుత్కేంద్రం

### అంతర్జాతీయ మీడియాతో రష్యా అధ్యక్షుడు పుతిన్



**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** భారత్‌లో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన కూడంకుళం ప్రాజెక్టు నిర్మాణంలో రష్యా పూర్తిస్థాయిలో సహకరిస్తోందని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం నిర్మాణం మా ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్. తమిళనాడులోని ఈ ప్లాంట్‌లో మొత్తం ఆరు రియాక్టర్లలో ఇప్పటికే రెండు పనిచేస్తుండగా, మరో నాలుగు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడం మొదలుపెడితే, భారత ఇంధన అవసరాలకు ఇది ఎంతగానో దోహదపడుతుందని పుతిన్ అన్నారు. కూడంకుళంలోని మూడో రియాక్టర్ కోసం రష్యా నుంచి తొలి విడత అణు ఇంధనం భారత్‌కు చేరిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోందని, దీనికి అవసరమైన చమురు, గ్యాస్, బొగ్గు వంటి ఇంధనాలను నిరంతరాయంగా సరఫరా చేస్తామని పుతిన్ హామీ ఇచ్చారు. "చిన్న తరహా మాడ్యులర్ రియాక్టర్లు, నీటిపై తేలియాడే అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై కూడా చర్చలు జరుపుతున్నాం. అలాగే, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో అణు సాంకేతికత వాడకంపై కూడా దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.

## పుతిన్ భారత్‌పర్యటనపై చైనా మీడియా విస్తృత కవరేజి

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనపై చైనా మీడియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. రష్యా చమురు సహా వివిధ ఉత్పత్తులపై అమెరికా ఆంక్షలు, అధిక సుంకాలు విధించడం వంటి పరిణామాల నేపథ్యంలో ఆయన భారత్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. రష్యా, భారత్ మధ్య బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యంపై ఈ పర్యటన స్పష్టమైన సందేశాన్ని పంపిస్తుందని చైనా అధికారిక పత్రిక గ్లోబల్ టైమ్స్ పేర్కొంది. ఈ రెండు దేశాలు పాశ్చాత్య ఒత్తిడికి తలొగ్గవని తెలిపింది. ప్రపంచంలో ఏ దేశమూ ఒంటరి కాదన్న సందేశాన్ని పుతిన్ పర్యటన చాటుతోందని చైనా మీడియా పేర్కొంది. చైనా ఫారెన్ అఫైర్స్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ లీ హైడాంగ్ గ్లోబల్ టైమ్స్‌తో మాట్లాడుతూ, భారత్, రష్యా దేశాలు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ సామర్థ్యాలను తామే సొంతంగా, మరింత శక్తిమంతంగా తయారు చేసుకోవాలని నిర్ణయించుకున్నాయని అర్థమవుతోందని అన్నారు. ఇరుదేశాల మధ్య సమన్వయం, సహకారమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉభయ దేశాలు పరస్పర మద్దతుతో బలమైన బంధాన్ని ఏర్పరచుకున్నాయని వ్యాఖ్యానించారు. అమెరికాసహా పశ్చిమదేశాల ఆంక్షలు, ఒత్తిడి ఫలించకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

# పాన్ మసాల కంపెనీలపై సెస్సు

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం
### పదేళ్లలో రైల్వేలో 5.08లక్షల ఉద్యోగాల భర్తీ: మంత్రి అశ్వినీ వైష్ణవ్
### న్యాయవ్యవస్థ ఏఐ వినియోగం ప్రతిపాదన లేదు: కేంద్ర మంత్రి
### కార్తీకదీపంపై లోక్‌సభలో రగడ
### రాజ్యసభలో ఇండిగోపై రభస



**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధించి, ఆ వచ్చే నిధులను జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి ఉపయోగించాలని ప్రతిపాదించే హెల్త్ సెక్యూరిటీ సె నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిలు 2025ను లోక్‌సభ శుక్రవారం ఆమోదించింది. పాన్ మసాలా కంపెనీలపై సెస్సును ప్రతిపాదిస్తూ రూపొందించిన బిల్లును పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభంలోనే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లో సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బిల్లుపై చర్చకు మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం సమాధానమిస్తూ, ప్రజారోగనయం రాష్ట్రం అంశం కాబట్టి సెస్సును రాష్ట్రాలతో పంచుకుంటామన్నారు. దీంతో పార్లమెంటు దిగువ సభలో ఈబిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు.

గత పదేళ్ల కాలంలో భారత రైల్వేలు 5.08 లక్షల మందిని నియమించుకున్నాయని, ఇది గత దశాబ్దంతో పోలిస్తే 23.6శాతం పెరిగిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పార్లమెంటులో ప్రకటించారు. ఇందులో 2024, 2025 వార్షిక క్యాలెండర్ సంవత్సరాలకు 1,20,579 ఖాళీల నియామకం కూడా ఉందన్నారు. ఈ శ్రామిక శక్తి పెంపుదల కార్యాచరణ, సాంకేతిక మరియు వినూత్న అవసరాలను తీరుస్తుందని మంత్రి పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో ఎఐ (కృత్రిమ మేధ) వినియోగాన్ని అన్వేషించడానికి సుప్రీంకోర్టు ఒక కమిటీని ఏర్పాటు చేసింది, అయితే ఎఐ ఆధారిత పరిష్కారాలు, నియంత్రిత పైలట్ దశలోనే ఉన్నందున న్యాయ ప్రక్రియలో ఎఐ సాధనాలను స్వీకరించడానికి ఎటువంటి అధికారిక విధానం, మార్గదర్శకాలు లేవని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ లోక్‌సభలో ప్రకటన చేశారు. ఈ-కోర్టుల దశ-3 వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక ఆమోదించబడిన ప్రాంతాల్లో మాత్రమే అధికారులు ఎఐని ఉపయోగిస్తారని మంత్రి పేర్కొన్నారు.

**కార్తీకదీపం రగడ:** మధురైలోని తిరుపుంద్రం కొండపై కార్తీక దీపాన్ని వెలిగించకుండా స్థానిక ప్రభుత్వం భక్తులను అడ్డుకుంటోందని లోక్‌సభలో బిజెపి, డిఎంకె సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. సుబ్రమణ్య స్వామి ఆలయ శిఖరంపై ప్రతి ఏడాది తరహాలో కార్తీక దీపాన్ని వెలిగించేందుకు వెళ్లిన భక్తులను ఎందుకు అడ్డుకున్నారని బిజెపి సభ్యులు నిలదీశారు. ఆ ఆరోపణలను డిఎంకె నేత టిఆర్ బాలు ఖండించారు. తమిళనాడులో బిజెపి మత విద్వేషాలు రెచ్చగొడుతున్నదని ఆరోపించారు. ఆ ఆరోపణలను కేంద్ర మంత్రి ఎల్ మురుగన్ కొట్టిపారేశారు. ఆరాధించే హక్కును తమిళనాడు సర్కారు నొక్కిపెడుతోందన్నారు. తిరుపుంద్రం కొండపై వెలిగించే కార్తీక దీపం అంశాన్ని లేవనెత్తేందుకు డిఎంకె సభ్యులు ఇవాళ లోక్‌సభ వెల్‌లోకి దూసుకెళ్లారు. సభలో గందరగోళం నెలకొనడంతో ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేశారు. ఇదే అంశాన్ని మళ్లీ జీరో అవర్‌లో లేవనెత్తారు. తిరుపుంద్రం కొండపై కార్తీక దీపాన్ని వెలిగించుకోవచ్చు అని మద్రాసు హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా.. దాన్ని తమిళనాడు సర్కారు వ్యతిరేకిస్తున్నది. కొండపై దీపాన్ని ఎవరు వెలిగించాలి, హిందూ దేవాదాయశాఖ బోర్డు సభ్యులా లేక హైకోర్టు జడ్జి తీర్పును పట్టుకుని తిరుగుతున్నవాళ్లా అని బాలు అడిగారు. జడ్జి ఐడియాలజీతో తీర్పు ఇచ్చినట్లు ఆయన కామెంట్ చేయడాన్ని కేంద్ర మంత్రి మురుగన్ తప్పుపట్టారు. పూజా హక్కును తమిళనాడు ప్రభుత్వం అణిచివేసిందని మంత్రి ఆరోపించారు. బిజెపి- డిఎంకె సభ్యుల మధ్య తీవ్రవాగ్యుద్ధం చోటుచేసుకోగా, సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

**రాజ్యసభలో ఇండిగోపై రభస:** దేశవ్యాప్తంగా ఇండిగో దాదాపు 500కు పైగా విమానాలను రద్దు చేయడంపై రాజ్యసభ దద్దరిల్లింది. ప్రభుత్వం ఏకపక్ష విధానాలతోనే సమస్య తలెత్తిందని కేంద్రం తీరుపై ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ ఎంపి ప్రమోద్ తివారీ జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతూ, గత మూడురోజులుగా వందలాది విమానాలు రద్దు చేయడంతో పార్లమెంటు సభ్యులతోపాటు సాధారణ పౌరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఒక ఎయిర్‌లైన్స్ గుత్తాధిపత్యం కారణంగానే ఈ సమస్య తలెత్తిందని, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏ చర్యలు తీసుకుంటున్నారో సభకు తెలియజేయాలని కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, ఇండిగో వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తుకు ఆదేశించిందని తెలిపారు. ఇదే సందర్భంగా శివసేన(యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది రూల్ 180 కింద నోటీసు ఇచ్చారు.

## అమెరికాలో శరణార్థులకు షాక్..
# వర్క్ పర్మిట్లు కుదింపు

**వాషింగ్టన్, డిసెంబరు 5:** వలసదారులపై కఠిన విధానాలు అమలుచేస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. శరణార్థులకు ఇచ్చే వర్క్ పర్మిట్‌ల కాలవ్యవధిని కుదిస్తున్నట్లు యుఎస్ సిటిజన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ఓ ప్రకటనలో తెలిపింది. శరణార్థులు, ఆశ్రయం పొందాలనుకునే వారు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న వారు అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్ కార్డ్ (ఇఎడి) కింద అనుమతులు జారీ చేస్తారు. దీనికి అయిదేళ్ల కాలవ్యవధి ఉండేది. తాజా సవరణలతో దాన్ని 18 నెలలకు కుదించారు. భద్రతా కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు యుఎస్‌సిఐఎస్ తెలిపింది. ఇటీవల అధ్యక్ష భవనానికి సమీపంలో ఇద్దరు నేషనల్ గార్డులపై ఓ దుండగుడు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే.

# ఆలయాల సొమ్మును బ్యాంకుల మనుగడకోసం వాడొద్దు

### సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** ఆలయాలకు చెందిన డబ్బును ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కో ఆపరేటివ్ బ్యాంకులను రక్షించేందుకు ఉపయోగించవద్దంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ సొమ్ము పూర్తిగా దేవుడికి చెందినదని తేల్చి చెప్పింది. ఆ నిధులను ఆలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సహకార బ్యాంకులకు ఆదాయ వనరుగా లేదా అవి మనుగడ సాగించేందుకు ఆలయ నిధులు ఉపయోగించవద్దని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. కేరళలోని తిరునెల్లి దేవస్థానం చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ మనాంతవాడి కో ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సహా కొన్ని సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌ను విచారిస్తూ న్యాయస్థానం పై వ్యాఖ్యలు చేసింది. మీరు ఆలయ డబ్బును ఉపయోగించి బ్యాంకును రక్షించాలనుకుంటున్నారా? కష్టాల్లో ఉన్న ఒక సహకార బ్యాంకులో డబ్బు ఉంచే బదులు, ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుకు ఆ నిధులను మార్చాలని ఆదేశించడంలో తప్పేముంది? అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బ్యాంకుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. మీరు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవాలి. కస్టమర్లను, డిపాజిట్లను ఆకర్షించలేకపోతే అది మీ సమస్య అని ఘాటుగా వ్యాఖ్యానించింది.

## రష్యన్‌భాషలో ఉన్న భగవద్గీతను
# పుతిన్‌కు బహూకరించిన మోడీ



**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** భారత పర్యటకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌కు రష్యన్ భాషలో అనువదించిన పవిత్ర గ్రంథం భగవద్గీతను ప్రధానిమోడీ బహూకరించారు. ఢిల్లీ చేరుకున్న పుతిన్‌ను స్వాగతించిన అనంతరం, ఇరువురు నేతలు ఒకే కారులో ప్రధాని అధికారిక నివాసం 7, లోక్ కల్యాణ్ మార్గ్‌కు వెళ్లారు. అక్కడ పుతిన్ గౌరవార్థం మోదీ ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ పర్యటనపై ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు పుతిన్‌కు భారత్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది. మా చర్చల కోసం ఎదురుచూస్తున్నాను. భారత్‌రష్యా స్నేహం కాలపరీక్షకు నిలిచిందని పేర్కొన్నారు. విదేశీనేతలు భారత్ పర్యటనకు వచ్చిన మన దేశ సంస్కృతి సాంప్రదాయాలుప్రతిబింబిచే గుర్తులను వారికి అందించడం సాంప్రదాయంగా వస్తోంది. అలాగే ప్రధానిమోడీ విదేశీ పర్యటనల్లో కూడా ఆదేశాధినేతలు మోడీకి తమ దేశ తీపి గుర్తులను అందిస్తుంటారు. కాగా భారత్‌కు నాలుగోసారి పర్యటనకు వచ్చిన పుతిన్‌కు భారత్ అపురూప ఆతిథ్యం ఇచ్చింది. అడుగడుగునా బందోబస్తుతోపాటు ఇరువురునేతలు ఒకే కారులో ప్రయాణించి ప్రపంచ నేతలనుకూడా ఆకర్షించారు.

# ప్రధాని మోడీ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గరు

### మోడీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** ప్రధాని నరేంద్ర మోదీతో రెండు రోజుల శిఖరాగ్ర సదస్సు కోసం భారత్‌కు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రధాని మోడీ ఎవరి ఒత్తిళ్లకూ సులభంగా తలొగ్గరని, ఆయన నాయకత్వాన్ని చూసి భారత ప్రజలు గర్వపడాలని వ్యాఖ్యానించారు. భారత్‌రష్యా బంధం ఏ మూడో దేశానికీ వ్యతిరేకం కాదని, కేవలం ఇరు దేశాల జాతీయ ప్రయోజనాల ఆధారంగానే తమ భాగస్వామ్యం కొనసాగుతోందని పుతిన్ స్పష్టం చేశారు. ప్రధాని మోడీతో భేటీకి కొన్ని గంటల ముందు ఓ ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పుతిన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా వైఖరిపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ కొన్ని బాహ్య శక్తుల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతున్నప్పటికీ, నేనూ, ప్రధాని మోదీ ఎప్పుడూ ఎవరికీ వ్యతిరేకంగా పనిచేయాలని భావించలేదు. మా లక్ష్యాలు వేరు. ఇరు దేశాల ప్రయోజనాలను కాపాడుకోవడంపైనే మా దృష్టి ఉంటుందని పుతిన్ వివరించారు. ఇంధన రంగంలో భారత్‌తో పెరుగుతున్న సహకారాన్ని చూసి కొందరు ప్రపంచ ఆటగాళ్లు అసంతృప్తితో ఉన్నారని ఆయన అమెరికాను దృష్టిలో పెట్టుకుని వ్యాఖ్యానించారు. ఆంక్షలు ఉన్నప్పటికీ ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం స్థిరంగా కొనసాగుతోందన్నారు. వాణిజ్య లావాదేవీలు కూడా ఎక్కువగా పాశ్చాత్య బ్యాంకింగ్ వ్యవస్థలకు దూరంగా, జాతీయ కరెన్సీలలోనే జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాని మోదీ దేశం ముందు, తన ముందు చాలా సవాలుతో కూడిన లక్ష్యాలను నిర్దేశించుకుంటారు.

## సంక్షిప్తంగా..

### ట్రావెల్‌బ్యాన్ 30 దేశాలకు పెంచే యోచనలో అమెరికా



**వాషింగ్టన్, డిసెంబరు 5:** అమెరికా తన ప్రయాణ ఆంక్షల పరిధిని భారీగా విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం 19 దేశాలపై ఉన్న ఈ నిషేధాన్ని 30కి పైగా దేశాలకు పెంచాలని యోచిస్తున్నట్లు యూఎస్ హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. నిషేధిత దేశాల సంఖ్యపై కచ్చితమైన అంకె చెప్పనప్పటికీ, ఆ సంఖ్య 30కి పైగానే ఉంటుందని తెలిపారు. కొన్ని దేశాల ప్రభుత్వాలు తమ పౌరుల గుర్తింపును ధ్రువీకరించలేని పరిస్థితుల్లో ఉన్నాయి. అలాంటి దేశాల నుంచి వచ్చేవారిని తనిఖీ చేయడం కష్టం. కాబట్టి వారిని మా దేశంలోకి ఎందుకు అనుమతించాలని ఆమె ప్రశ్నించారు. ఇటీవల వాషింగ్టన్ డీసీలో ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులను కాల్చి చంపిన ఘటనే ఈ నిర్ణయానికి తక్షణ కారణంగా తెలుస్తోంది.

### పార్లమెంటులో గందరగోళం సృష్టించొద్దు: శశిథరూర్




**న్యూఢిల్లీ, డిసెంబర్ 5:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఇతర అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళనలు లేవనెత్తుతుండడంతో పార్లమెంట్ సమావేశాల్లో అంతరాయాలు నెలకొంటుండడంపై కాంగ్రెస్ నేత శశిథరూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పార్లమెంట్‌లో చర్చించడానికి గందరగోళం సృష్టించాల్సిన అవసరం లేదని ప్రతిపక్షాలను విమర్శించారు. ఇక్కడ దేశం కోసం, ప్రజల కోసం మాట్లాడాలే తప్ప అరిచి గందరగోళం సృష్టించవద్దని సహచర ఎంపిలకు సూచించారు. నేను మొదటినుంచి ఇదే చెబుతున్నాను. సోనియాగాంధీతో సహా నా పార్టీల నాయకులకు ఈ విషయం బాగా తెలుసు. పార్టీలో నేను ఒంటరిని కావచ్చు. కానీ, ప్రజలు తమకు పార్లమెంట్‌లో ప్రాతినిథ్యం వహించడానికి నన్ను ఎన్నుకున్నారు. అంతేకానీ ఇక్కడ అరవడానికి, గందరగోళం ృష్టించడానికి కాదు. వారి కోసం,దేశం కోసం నా తెలివితేటలు ఉపయోగించి మాట్లాడాలనే ఉద్దేశంతో నన్ను ఇక్కడికి పంపారు అని శశథరూర్ వ్యాఖ్యానించారు.

### ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయిన కీలక వెబ్‌సైట్లు

**చికాగో, డిసెంబరు 5:** ప్రపంచంలో అతిపెద్ద కంటెంట్ డెలివరీ నెట్‌వర్క్ (సిసిఎన్) సంస్థ క్లౌడ్‌ఫ్లేర్‌లో మరోసారి సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ప్రపంచ వ్యాప్తంగా కీలక వెబ్‌సైట్లు, యాప్‌ల సేవలు నిలిచిపోయాయి. భారత్‌లో క్యాన్వా, బుక్‌మైషో, గ్రో, జెరోధా వంటి కీలక సంస్థల సేవలతో పాటు అంతర్జాతీయంగా లింక్డ్ఇన్, స్పేస్‌ఎక్స్, కాయిన్‌బేస్ వంటి సైట్లు యూజర్లకు అందుబాటులో లేకుండా పోయాయి. ఈ అంతరాయంపై క్లౌడ్‌ఫ్లేర్ వెంటనే స్పందించింది. తమ డ్యాష్‌బోర్డ్, ఏపీఐలలో సమస్యలు తలెత్తినట్లు గుర్తించామని, వెంటనే పరిష్కార మార్గాలను అమలు చేశామని తెలిపింది. ప్రస్తుతం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. ఇలా అంతరాయం కలగడం నెలరోజుల వ్యవధిలో ఇది రెండోసారి. నవంబర్ 18న కూడా ఇలాంటి అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే.

### గడువుకు ముందే సోషల్‌మీడియాలో మైనర్ల ఖాతాలు బ్లాక్!




**కాన్‌బెర్రా, డిసెంబరు 5:** 16 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించకుండా ఆస్ట్రేలియా ప్రభుత్వం చట్టం తీసుకువచ్చింది. డిసెంబర్ 10వ తేదీ నుంచి దీనిని అమలు చేయనుంది. దీనితో గడువుకు ముందే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన సోషల్ మీడియాల్లో అక్కడి పిల్లలను మెటా బ్లాక్ చేస్తోంది. తమ నిర్ణయంపై ఆస్ట్రేలియా ఇంటర్నెట్ రెగ్యులేటరీ స్పందిస్తూ, పిల్లలను సోషల్ మీడియా యాప్‌లకు దూరంగా ఉంచేందుకు తాము తీసుకుంటున్న చర్యలను ప్రపంచ దేశాలు అనుసరించాలని సూచించింది. పదహారేళ్ల లోపు పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలనే నిర్ణయం గురించి మొదట తాను ఆందోళన చెందానని, కానీ ఈ విధానాన్ని చాలామంది తల్లిదండ్రులు స్వాగతిస్తుండటంతో తన ఆలోచనను మార్చుకున్నానని సేఫ్టీ కమిషనర్ జూలీ ఇన్మాన్ గ్రాంట్ పేర్కొన్నారు.


## ప్రియురాలితో జపాన్ పర్యటనకు వెళ్లిన కెనడా మాజీ పిఎం జస్టిన్ ట్రూడో



**టోక్యో, డిసెంబరు 5:** కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో .. అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీతో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న వేళ తాజాగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. వీరు జపాన్ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆ దేశ మాజీ ప్రధాని ఫ్యుమియో కిషిదాతో భేటీ అయ్యి, ఆయన ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కిషిదా ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ట్రూడో తన భాగస్వామి పెర్రీతో కలిసి జపాన్ సందర్శించారు. మాతో కలిసి భోజనం చేశారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు.. దేశాల అధినేతలుగా మేము అనేకసార్లు కలిశాము. అప్పుడు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మేం కలిసి పనిచేశాం. మా స్నేహాన్ని ఇలాగే కొనసాగించడం ఆనందంగా ఉంది' అని రాసుకొచ్చారు. ట్రూడో పెర్రీతో కలిసి దిగిన ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. ఇక, కిషిదా పోస్టును ట్రూడో రీపోస్టు చేశారు. జపాన్ మాజీ ప్రధానితో భేటీ కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దాదాపు దశాబ్దం పాటు కెనడా ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడో.. ఈ యేడాది ప్రారంభంలో తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. జూలైలో ట్రూడో-పెర్రీలు రెస్టారెంట్‌లో తొలిసారి కనిపించారు.

# మద్ది ఆలయంలో దీక్షాదారుల మహా పూర్ణాహుతి

ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, గురవాయిగూడెం గ్రామం నందు తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువుగా విరాజిల్లుతున్న శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం నాడు అనగా ఉదయం గం.06.00 లకు చింతపూడి గ్రామస్తులు డోలక్ సుబ్బారావు భజనా మండలి వారిచే భక్తి సంకీర్తనలు అనంతరం విశేష పంచామృత అభిషేకం తదుపరి హనుమద్ దీక్షాధారుల మహా పూర్ణాహుతి మరియు హనుమద్ దీక్షాధారుల దీక్షా విరమణ అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపబడినది. ఈ కార్యక్రమంలో సుమారు 3,000 మంది హనుమద్ దీక్షాధారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అత్యంత భక్తి భావముతో భజనలు చేసి, మహా పూర్ణాహుతి అనంతరం ఇరుముడులను సమర్పించి, హనుమత్ దీక్షలను విరమించారు. ఈ రోజు శ్రీ స్వామి వారి దేవస్థానమునకు వివిధ సేవల రూపేణా రూ.3,75,755లు సమకూరినది. శ్రీ స్వామి వారి దేవస్థానమునకు విచ్చేసిన సుమారు 5100లు భక్తులు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాదం వితరణ జరిగినది.



పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం

## - కలలు కనండి.. వాటి సాకారానికి ఇష్టపడి చదవండి
## -తల్లిదండ్రుల ఆశయాలను విద్యార్థులు నెరవేర్చాలి-జిల్లా కలెక్టర్



దెందులూరు/ఏలూరు, డిసెంబర్, 5 : (ప్రభాతవార్త) : సమాజంలో విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ను శుక్రవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రతీ తరగతి గదికి వెళ్లి విద్యార్థినులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి మరింత మెరుగైన బోధన చేయాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ చిన్నతనం నుండి ఇష్టపడి విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు మన సొంతం అవుతుందని, ప్రతీ విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివి కలలను సాకారం చేసుకుని ఉన్నతస్థానాలు పొందాలన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చేయూతను ఇస్తున్నదని, తల్లికి వందనం పథకం కింద తల్లులకు ఆర్థిక సహాయం అందిస్తున్నదని, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, ఉచితంగా అందించడంతోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నదన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి తీసుకున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతశిఖరాలను సాధించాలన్నారు. తల్లులు తమ పిల్లలకోసం చేస్తున్న త్యాగాలను గుర్తించి విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదువుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ కల్పించుకోవాలన్నారు. తమ పిల్లలు చదువులో ఎంత ప్రగతిని



సాధిస్తున్నారు,వారి ప్రవర్తన ఎలా ఉంది,సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకుంటున్నారా లేదా ఇలా అనేక అంశాలపై తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునే



అవకాశం కల్పించడమే మెగా పిటియం లక్ష్యమని తెలిపారు. తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయాలను,సూచనలను ఈ వేదిక ద్వారా ప్రభుత్వంతో పంచుకునే అవకాశం లభిస్తుందన్నారు. అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ ప్రీ స్కూల్ లో కలెక్టర్ వెట్రిసెల్వి పిల్లలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో జిల్లా విద్య శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, గృహ నిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ ఐసిడిఎస్ శారద, జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి, తహసీల్దార్ సుమతి, ఎంఈఓ ఏ.వి.ఎస్.వి. ప్రసాద్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్, సర్పంచ్ తోట పిసమ్మ ప్రభృతులు పాల్గొన్నారు.

# ప్రజాధర్బార్‌కు అనూహ్య స్పందన

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...

ఏలూరు/ నూజివీడు, ప్రభాతవార్త నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పిజిఆర్ యస్ ( ప్రజాధర్బార్) వేదిక ద్వారా ప్రజలు నుండి అర్జీలను స్వీకరించి, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఈ రోజు నిర్వహించిన ప్రజాధర్బార్ కు విశేషస్పందన వచ్చిందని, ఎక్కువ సంఖ్యలో ప్రజలు హాజరు అయ్యి అర్జీలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కొన్ని సమస్యలను తక్షణ పరిష్కారం చూపామని, మిగిలిన అర్జీలను నిర్ణీత సమయంలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. ప్రజలు నుండి వచ్చిన ఏలాంటి సమస్యనైనను చిరునవ్వుతో పలకరిస్తే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని అన్నారు. ఓర్పు, సహనంతో జాగ్రత్తగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపినప్పుడే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మంచి పేరు వస్తుందని అన్నారు. ముఖ్యంగా ప్రజలు అనేక దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని గమనించామని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా ధర్బార్



నిర్వహించాలని ఆదేశించారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి శాసనసభ్యులు వరకు సమంత తప్పకుండా ప్రజా ధర్బార్లు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలు నుండి ముఖ్యంగా ల్యాండు, రెవిన్యూ, సివిల్, ఫారెస్ట్, విద్యుత్, ఇతర సమస్యలు నాదృష్టికి వచ్చాయని పరిష్కారం చూపాలని క్రమం తప్పకుండా ప్రజాధర్బార్ వేదికలు ఏర్పాటు చేసి, ప్రజలు సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, అర్జీదారులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దత్త జయంతి సందర్భంగా పూజలు

కాళ్ళ డిసెంబర్ 5 (ప్రభాతవార్త) :మండలంలోని సీసలి సాయిబాబా దేవాలయంలో దత్త జయంతి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయాన్ని దత్తాత్రేయ దేవాలయంగా అలంకరించారు. దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజాము నుండి విశేష పూజలు జరిపారు. హెూమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి మాట్లాడుతూ ప్రస్థాపకులు ఆలయ వ్యవస్థాపకులు స్వర్గీయ దారం దారం త్రినాథ్ బాబు ఆశయం మేరకు ఆలయంలో అన్ని కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసారి హైదరాబాదుకు చెందిన మేడేపల్లి మల్లికార్జున రావు పావని దంపతులు వారి కుమారులు మౌనిషా చౌదరిల్లు ఆలయాన్ని వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అలంకరణ భక్తులను



విశేషంగా ఆకట్టుకుందన్నారు. ఆలయ అర్చకులు దత్తాత్రేయ పూజలు హెూమాలు నిర్వహించడంతోపాటు దత్తాత్రేయుని చరిత్ర కనులకు కట్టినట్టుగా వ్యాఖ్యానించడం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో అన్న సమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# టిడిపి కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదిక

## వినతులు స్వీకరించిన రామరాజు



ప్రభాతవార్త నరసాపురం : నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక వేదిక! "గ్రీవెన్స్ – ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఏర్పాటు చేసారు. ఈ వేదికలో నియోజకవర్గ ప్రజలు మరియు కార్యకర్తల వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలు స్వీకరించడం. ప్రతి సమస్యకు తగిన పరిష్కారం కోసం వాటికి సంబంధించిన అధికారులతో మాట్లాడి ప్రతి సమస్య తిరేవిధంగా చర్యలు తీసుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, నరసాపురం పట్టణ అధ్యక్షులు – ఏ ఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటి కన్వీనర్ – మాజీ %ూవీజ% చైర్మెన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహారావు (బాబ్జీ), నరసాపురం మండల అధ్యక్షులు వాతాడి ఉమా మహేశ్వరరావు,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొన్నాల నాగబాబు, పగో. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డా శిరిగినీడి రాజ్యలక్ష్మి, %చీూఖీ% పార్లమెంట్ అధ్యక్షులు తిరుమాని హేమంత్, సీనియర్ నాయకులు సంకు భాస్కర్ నాయుడు (తుమ్మా) పట్టణ ఉపాధ్యక్షులు పట్నాల జగన్మోహన్, పట్టణ కార్యనిర్వాక కార్యదర్శి గునిశెట్టి సత్యనారాయణ, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, కోటిపల్లి గోపాలం, ఎండీ. మౌలాలి ఖాన్, షేక్ యూనిస్ బేగం, బంగా రమేష్,బొర్రా చిన్నాయమ్మ, బస్వాని నాగమణి, అలివేలు మంగతాయారు, శృంగారకవి శ్రీనివాస్, భోగి రెడ్డి ముత్యం,మావూరి ఆనంద్ కుమార్, జెట్ల నాగేశ్వరరావు, దేశెట్టి సత్యనారాయణ, జక్కం కాశీ, నాగిడి రాంబాబు, అధికారి కిరణ్, ఎతిమ్మ వలి, మరియు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రభాతవార్త జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలోని హెచ్డిఎఫ్సి బ్యాంక్ ఆధ్వర్యంలో యోషిత సోషల్ ఆర్గనైజేషన్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జాబిల్లి హాస్పిటల్ డాక్టర్ అనిల్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ మాట్లాడుతూ, రక్తదానం చేయడం అనేది అత్యంత గొప్ప, సామాజిక బాధ్యతతో కూడిన కార్యక్రమమని కొనియాడారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి అనేకమంది ప్రాణాలను కాపాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో రక్తదాతలు తరలివచ్చారు. దాతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంక్ మేనేజర్ బి. సురేష్, డబ్ల్యూబీఓ మేనేజర్ దుర్గాప్రసాద్ దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్యాంక్ సిబ్బంది, ఇతర దాతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం విద్యార్థుల భవిష్యత్ కి దిశా నిర్దేశం

భీమవరం డిసెంబర్ 5 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మార్గ నిర్దేశంగా పిటిఎం దోహదపడుతుందని,విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని,ఆర్థిక కారణాలతో చదువుని కొనసాగించలేని వారికి "సరస్వతీ విద్యా నిధి"ద్వారా సహకారంఉంటుందనిజిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం మండలం గూట్లపాడు గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం 3.%ూ% కి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయురాలు పి.సత్యవాణి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సాధించిన ప్రగతి, ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను వివరించారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ జిల్లా విద్యాశాఖ ప్రగతిని సభలో వివరించారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశాలను గత డిసెంబర్, జూలై నెలలో నిర్వహించుకోవడం జరిగిందని, ఇది మూడో విడతని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలు స్కూలు నుండి వచ్చిన తర్వాత ఏ విధంగా ఉంటున్నారు గమనించాలన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి పెట్టాలన్నారు. చెడు తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చినట్లు ఉన్నా, వెలుగులు నింపే జీవితకాలం ఆనందానికి దూరం కావాల్సి వస్తుందని ఇది ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలన్నారు.తొలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుతో కలిసి విద్యార్థి హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుపై ముఖాముఖి మాట్లాడి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అదేవిధంగా తల్లిదండ్రులు కూడా తరచూ పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు, ఉపాధ్యాయులు ఏ విధంగా బోధిస్తున్నారు అనే విషయాలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు.



# హై స్కూల్ గ్రౌండ్ కు స్థలం కేటాయించాలి

మొగల్తూరు డిసెంబర్ 5 (ప్రభాతవార్త) 216 నేషనల్ హైవే ను ఆనుకుని ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ నందు శుక్రవారం ఆరోగ్య వర్షిని ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు ఆధ్వర్యంలో హై స్కూల్ గ్రౌండ్ కు స్థలం కేటాయించాలని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు గ్రామస్తులు ధర్నా నిర్వహించారు, అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆట స్థలం అనేది విద్యార్థులకు శరీరక మానసిక మరియు సామాజిక అభివృద్ధికి చాలా అవసరమని, 1997 సంవత్సరంలో యూపీ స్కూల్ ఉండేదని అప్పుడు హైస్కూల్ కావాలి అంటే ఐదు ఎకరములు స్థలము ఉంటే యూపీ స్కూల్ ను హైస్కూల్ గా మార్చారు, ఈ రోజున ఆ ఐదు ఎకరాల స్థలము కనిపించడం లేదని, ఈ పాఠశాల కు క్రీడా స్థలం లేకపోవడంతో క్రీడల నిర్వహణకు విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని,



ఎప్పటికైనా క్రీడాస్థలం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించాలని ఆయన తెలియజేశారు, ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ సభ్యులు విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు స్థానికులు గ్రామస్తులు ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# మొంథా తుఫాన్ బాధితులకు సహాయక సామాగ్రి పంపిణీ

## రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం

ప్రభాతవార్త నరసాపురం రూరల్ : పశ్చిమగోదావరి జిల్లా లో మొంథా తుఫాన్ కారణంగా నష్టం జరిగిన 93 మంది కుటుంబాలకు గురువారం నరసాపురం ఆర్డీవో కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయక సామగ్రి పంపిణీ కార్యక్రమమును నిర్వహించారు. ఈ కార్యక్రమనకు ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో మానవతా సేవలో ముందంజలో ఉండేది రెడ్ క్రాస్ సంస్థ అన్నారు. రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అనేకం ప్రజల నుండి అభినందనలు అందుకుంటుందని అన్నారు. రక్తదాన శిబిరాలు ప్రోత్సాహం కార్యక్రమాలు పురోభిగతిలో ఉండటం సంతోషకరమని అన్నారు. జూనియర్ మరియు డైరెక్టర్ ద్వారా సామాజిక బాధ్యత పై మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా.భద్రిరాజు మాట్లాడుతూ విపత్తు సమయాలలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు అందించే సేవలను గురించి వివరించారు. రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వై డి రామారావు, రాష్ట్ర ట్రెజరర్ డి శ్రీహరి రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ చేపడుతున్న మానవతా సేవలు అభినందనీయం అని రెడ్ క్రాస్ కు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా నరసాపురం మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన నరసాపురం, మొగల్తూరు మండలాలలోని 93 మంది బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్



కుమార్ రెడ్డి చేతుల మీదుగా సహాయక సామగ్రి కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ దాసిరాజు, తహసిల్దారులు అయితం సత్యనారాయణ, రాజ్ కిషోర్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ వి.కనకరాజు, కె.తిరుపతి రాజు, సి హెచ్ ఫణి కుమార్, గోపిశెట్టి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా,-చాట్రాతి భవాని శేఖర్

జీలుగుమిల్లి-ప్రభాతవార్త,:జీలుగుమిల్లి మొట్టమొదటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (మెయిన్) అభివృద్ధికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని పాఠశాల స్థలదాత చాట్రాతి భవాని శేఖర్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్-డే కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కోర్స పోచమ్మ, పాఠశాల స్థలదాత చాట్రాతి భవాని శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భవాని శేఖర్ మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యాదానం చాలా గొప్పదని జీలుగుమిల్లిలో మొట్టమొదటి పాఠశాల అంటే సుమారు 80 సంవత్సరాల క్రితం మా నాన్నగారు చాట్రాతి శ్రీశైలం మల్లికార్జున రావు పాఠశాలకి ఒక ఎకరా 15 సెంట్లు భూమిని దానంగా ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా గవర్నమెంట్ పాఠశాలలో క్రమశిక్షణగా విద్య బోధించాలని ఉపాధ్యాయులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఎస్ఎంసి చైర్మన్ కరి బండి నాగ సరోజిని, ఉపాధ్యాయులు జి వి ఎస్ ఎన్ శాస్త్రి, ఆర్ శ్రీ సాయి లక్ష్మి, సిహెచ్ మరియమ్మ, జి. అపురూప్ తదితరులు పాల్గొన్నారు.



# నిట్ లో ఆక్టోపస్ కమెండోస్ మాక్ డ్రిల్



తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్)లో శుక్రవారం ఆక్టోపస్ కమెండోస్ డీఎస్పీ బి.రాంబాబు ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు దాడి చేస్తే వాటిని సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలి, ఆత్మ రక్షణ ఎలా పొందాలి, ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా బాధితులను ఎలా రక్షించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు రక్షణ వ్యవస్థను అప్రమత్తం చేసే విధానంతోపాటు ఉగ్రవాదులు చొరబడిన భవనం పరిసరాలు, లోపలకు, బయటకు వెళ్లే మార్గాలు, భవనంలో ఎంతమంది చిక్కుకుపోయారు, బాంబులను ఏమైనా అమార్చరా, సీసి కెమెరాల ద్వారా అనుమానితులను గుర్తించి వారిని మట్టుబెట్టటం వంటి అంశాల గురించి తెలియజేశారు. ముష్కరులు అమర్చిన బాంబులను డాగ్ స్క్వాడ్ తో కనుగొనటం, వాటిని నిర్వీర్యం చేయటం, భవనంపైనుంచి తాడు సహాయంతో కిందకు దిగటం, ఉగ్రవాదులు దాక్కున్న ఒక్కొక్క గదిని వెతికి ఉగ్రవాదులను అంతం చేయటం, ఆక్టోపస్ బృందాలు భవనంలోకి వెళ్లే విధానాలను కమెండోస్ కళ్ళకు కట్టినట్టు చూపించారు. ముందుగా ఆక్టోపస్ డిఎస్పీ రాంబాబు మాట్లాడుతూ అనుకోని విపత్కర పరిస్థితి ఎదురైనప్పుడు అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తేనే ఆపరేషన్ విజయమవుతుందని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో పోలీసులు, అగ్నిమాపక దళం, రెవిన్యూ, హెల్త్ డిపార్ట్మెంట్, ఇంటిలిజెన్స్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన సహాయ చర్యలు తీసుకుంటూనే సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అధికారయంత్రాగాన్ని అప్రమత్తం చేయాల్సి ఉంటుందని వివరించారు. 40 మంది కమండోస్ అధునాతన తుపాకులతో బృందాలుగా విడిపోయి ముష్కరులను పట్టుకున్నారు. ఆక్టోపస్ కమాండోస్, పోలీసులు, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది రావటంతో విద్యా సంస్థల్లో ఏం జరుగుతుందో తెలియక కొంతసేపు అయోమయానికి గురయ్యారు. తీరా విషయం తెలుసుకుని ఊరట చెందారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు శివాజీ, నీలకంఠ, తాడేపల్లిగూడెం డిఎస్పీ విశ్వనాథ్, సీఐ ఆదిప్రసాద్, ఎస్సై నాగరాజు, రెవిన్యూ అగ్నిమాపక, హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బందితోపాటు పట్టణ పోలీసులు పాల్గొన్నారు.



## మావుళ్ళమ్మకు కనకాంబరాల గజమాల



భీమవరం డిసెంబర్ 5 (ప్రభాతవార్త) :భీమవరం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి భక్తుడు సమర్పించిన కనకాంబరం పూలతో గజమాల తో దర్శనమివ్వడం తో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు జాకెట్ ముక్కలు వేలం పాట ద్వారా దేవస్థానం విక్రయం జరపడంతో పలువురు మహిళా భక్తులు చీరలు కొనుగోలుకు పోటీ పడ్డారు. ఈ విక్రయం వలన 33,480. ఆదాయం వచ్చినదని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. బుధవారం, శుక్రవారం, ఆదివారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు చీరలు వేలం పాట జరుగుతుంది అనిఆయన తెలిపారు.

## యువతకు సోషల్ సెక్టార్ లో ఉద్యోగ అవకాశాలు - డాక్టర్ సులేమాన్



ప్రభాతవార్త నరసాపురం : వివిధ రంగాల్లో ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువతకు ఉద్యోగార్థులకు సోషల్ సెక్టార్ లో చక్కటి అవకాశాలు ఉన్నాయని ప్రముఖ ఎనలిస్ట్ డాక్టర్ సులేమాన్ అన్నారు. సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలోని పీజీ యూజీ లెవెల్ కళాశాల ఎంబీఏ ఎంసిఏ విద్యార్థులకు యువత ఏ విధంగా ఉద్యోగాలు సాధించాలి అందుకు అవసరమయ్యే చదువుతోపాటు అవసరమయే ఇతర క్వాలిటీస్ ను ఆయన వివరించారు. ముఖ్యంగా విద్యార్థులు ఎమ్మెస్ ఆఫీస్ పై చక్కటి పట్టు సాధించాలన్నారు. విమర్శనాత్మక ఆలోచన సమస్య పరిష్కారం కంప్యూటర్ కమ్యూనికేషన్ స్కిల్స్ భిన్న భాషలపై పట్టు పట్టుదలగా కృషి చేస్తూ తనను తాను నిరూపించుకునే స్థితిని కలిగి ఉన్నప్పుడు యువత ప్రగతి బాటన పడతారన్నారు. ముఖ్యంగా టైం సెన్స్ అనేది చాలా అవసరం అన్నారు. చెడు అలవాట్లు దూరంగా ఉంటూ నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే



అనుకున్న గోల్ కొడతారని సూచించారు. మనం చేరాలనుకున్న తీరానికి సరైన నావికా నాయకత్వం ఉన్నప్పుడే గమ్యం సాధించగలమన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేరువేరు రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని అయితే చాలామందికి వీటిని చేరుకునే దారి తెలియటం లేదు అన్నారు. అతి తక్కువ ఖర్చులో మంచి ప్లేస్మెంట్లో స్థిరపడవచ్చు అని సూచించారు. దేశీయంగాను దేశాంతరంలోనూ నేడు కొలువులకు లోటు లేదని అయితే అందుకు తగ్గ స్కిల్స్ విద్యార్థులు కలిగి ఉండాలని తెలిపారు. కృషి తపస్సులా ఉన్నప్పుడే ఎసెన్ ను సాధించగలమని తెలిపారు. కంపెనీకి ఏ విధంగా తాను ఉపయోగపడతాను చెప్పగలిగే స్థితి కలిగి ఉండాలన్నారు. డాక్టర్ ఎన్జీఎస్ ప్రసాద్, మాణిక్యాలరావు తదితరులు మాట్లాడారు.

వార్త
విలేకరులు కావలెను
వార్త తెలుగుదిన పత్రిక నందు పని చేయుటకు ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన వివిధ మండల కేంద్రాలలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఏలూరు జిల్లా: జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం రూరల్, ఏలూరు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, టి.నర్సాపురం, పెదవేగి, పోలవరం, కొయ్యలగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా: ఆకివీడు, గణపవరం, నిడమర్రు, ఆచంట, పాలకొల్లు, వీరవాసరం, యలమంచిలి, పెనుగొండ
ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు సంప్రదించవలెను.
ఫోన్: 9704502377

## పేరెంట్స్ డే సందర్భంగా వాష్ బేసిన్ ప్రారంభం



పెనుమంట్ర- ప్రభాతవార్త : మండల కేంద్రం పెనుమంట్ర మండల ప్రాథమిక పాఠశాల (ఆర్) నందు మెగా పిటిఎం-3.0 నందు యర్రా రాధేగోపాల్ దే సుమారు రూ. 50,000 వ్యయంతో నిర్మించబడిన వాష్ బేసిన్ ను వార్డ్ మెంబర్ గంటా దుర్గా దేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది నాగేశ్వరరావు తల్లి జ్ఞాపకార్థం పిల్లలందరికీ రూ.10, 000 వ్యయంతో గ్లాసులు, కంచాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వుంగరాల నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విలువులతో నిండిన విద్యే సమాజ భవిష్యత్తు : మంత్రి నిమ్మల



పోడూరు,డిసెంబర్ 05,ప్రభాత వార్త: సమాజంలో మంచి పౌరులు రూపుదిద్దుకోవాలంటే విలువలతో కూడిన నాణ్యమైన విద్య తప్పనిసరని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలో జిన్నూరు గ్రామం నందు శుక్రవారం జడ్పీహెచ్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శివజ్యోతి ఆధ్వర్యంలో మెగా పేరెంట్%-%టీచర్స్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యా రంగంలోని విద్య, ఉపాధ్యాయ నియామకాలు, ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న సంస్కరణలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు వివేకం, బాధ్యత, సామాజిక అవగాహన పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటి పర్యావరణానికి తన వంతు చెయ్యి అందించారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లు గడిచినా ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే డీఎస్సీ ద్వారా 16,350 పోస్టులను భర్తీ చేసిందని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రెండు లక్షల మందికి పైగా ఉపాధ్యాయులను డీఎస్సీ ద్వారా నియమించిన ఘనత చంద్రబాబుదని రామానాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీ ప్రక్రియలో పాలకొల్లు నియోజకవర్గ నిరుద్యోగుల ప్రయోజనం కోసం తన తండ్రి పేరిట గల ధర్మారావు ఫౌండేషన్ ద్వారా రూ.1.5 కోట్లకు పైగా వెచ్చించి ఉచిత కోచింగ్ అందించామని తెలిపారు. ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లికి "తల్లికి వందనం" ద్వారా రూ. 15,000, డొక్కా సీతమ్మ పథకం ద్వారా నాణ్యమైన సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామని తెలిపారు. గతంలో ఇంజనీరింగ్ చదవడానికి చెన్నై, పూణే, బెంగళూరు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో 300కి పైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పడి విద్య అందుబాటులోకి వచ్చిందని అన్నారు. సాఫ్ట్‌వేర్ రంగ అభివృద్ధి, హైదరాబాదు సైబరాబాద్‌గా మారడంలో చంద్రబాబు పాత్ర కీలకమని, లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన తెలిపారు . కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దాసరి రత్నం రాజు, ఉన్నమట్ల కబర్ది, యర్రంశెట్టి పద్మారావు, దేవళ్ల ప్రసాద్, గిరిగి గోపాలకృష్ణ, జడ్డు సూర్యారావు మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లయనిజం ఆరోగ్యానికి ప్రాధాన్యత :ఎమ్మెల్సీ వంక.



అత్తిలి- డిసెంబర్ 5( ప్రభాత వార్త ) లైన్స్ సేవా సంస్థ ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని లైన్స్ మాజీ గవర్నర్ ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సందర్భంగా వంక మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆరోగ్యం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల రోగాల పాలవుతున్నారని అన్నారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాథమిక దశలోనే వ్యాధిని నయం చేసుకోవచ్చు అన్నారు. క్యాన్సర్ పట్ల గ్రామీణ ప్రాంతాలలో అవగాహన తీసుకురావాలని లైన్స్ ప్రతినిధి వంకా రాజకుమారి కోరారు. వృషభల్యమైన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ తదిత ప్రమాదకరమైన వి వాడటం వల్ల క్యాన్సర్ వస్తోందన్నారు. వేలాది రూపాయలు ఖర్చు అయ్యే పరీక్షలు ఉచితంగా చేస్తున్నందున గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరం దాత ఆకుల రామచంద్రరావు , డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ అబ్దుల్ రహమాన్,డాక్టర్ మనస్విత, కోఆర్డినేటర్ బిందు ఉలుసు భాస్కర్ రావు మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి వర్ధినీడి వెంకట శివ, కొనిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వారు వచ్చినవారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.క్లబ్ తరపున రవీంద్రనాథ్ రాజకుమారి దంపతులను సత్కరించారు.

## ఘనంగా ప్రపంచం మృత్తిక దినోత్సవం




పెనుమంట్ర-ప్రభాతవార్త : మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మరియు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఎ.డి.ఆర్. డాక్టర్ బి. సహదేవ రెడ్డి మాట్లాడుతూ వహించి ప్రపంచ నేలల దినోత్సవం మరియు నేలలను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను తెలియజేసారు. విచక్షణా రహితంగా ఎరువులు, ఇతర రాసాయనాల వినియోగం వల్ల నెల, నీరు కలుషితం కావడం జరుగుతుందని, కావున వీటిని తగ్గించే దిశగా రైతులను సమాయత్తం చేయవలసిన ఆవశ్యకత శాస్త్రవేత్తలపై ఉన్నదని తెలిపారు. అంతేకాక ప్లాస్టిక్ వ్యర్థాలు నేలలో నిక్షిప్తమై ఉండిపోవడం వలన నీరు వర్షపు నీరు నేలలోకి ఇంకకపోవడం వంటి సమస్యలు కూడా ఎదురవుతున్నాయని తెలిపారు. అనంతరం మృత్తిక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త అయిన డా.సి.హెచ్.శ్రీనివాస్ మరియు వ్యవసాయ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నెగ్గిపూడి గ్రామంలో వ్యవసాయ పరిశోధనా స్థానం నుండి గ్రామ పంచాయతీ వరకు రాలీ నిర్వహించి నేల పరిరక్షణ అవశ్యకతను తెలియపరిచారు.

## హైస్కూల్ లో మెగా పేరెంట్స్ టీచర్స్ 3.0 ప్రతిజ్ఞ కార్యక్రమం



మొగల్తూరు డిసెంబర్ 5 (ప్రభాతవార్త): పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం కే.పీపాలెం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ 3.0 లో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ పరిధిలో ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు హాజరై ప్రతిజ్ఞ సామూహికంగా నిర్వహించారు.

## ఘనంగా మెగా పేరెంట్స్-డే



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త: జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల నందు మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం . పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్నాల సోమశేఖర్ మాట్లాడుతూ పేరెంట్స్ డే నందు తల్లిదండ్రులను ఉపాధ్యాయుల సంయుక్త సమావేశం ఏర్పాటు చేశామని, వీళ్లిద్దరి మేలు కలయిక వల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని ఈ సంవత్సరం నాణ్యమైన బ్యాగులు మంచి పుస్తకాలను రుచికరమైన భోజనం అందిస్తున్నారని అమ్మకు వందనం కార్యక్రమంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. రాష్ట్ర క్షత్రియ బోర్డు డైరెక్టర్ నంబూరి రామచంద్ర రాజు విద్యార్థులకు శుభాభివందనాలు తెలియజేశారు .రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ చిట్టి బోయిన రామ లింగేశ్వర రావు మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదివితే ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు మంచి ప్రభుత్వ కొలువులు సాధించవచ్చు అని అన్నారు. తెలుగుదేశం జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ్ కుమార్ మాట్లాడుతూ తాను కూడా ఈ పాఠశాల పూర్వ విద్యార్థినేనని అప్పటి స్మృతులు గుర్తుకు తీసుకొచ్చారు. చింతలపూడి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మారిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఒక్క నిమిషం కూడా వృధా చేయకుండా ఇప్పటినుండి చదివితే ట్రిపుల్ ఐటి సీట్లు సాధించవచ్చని అన్నారు . తెలుగు మహిళ రాష్ట్ర సెక్రెటరీ సౌభాగ్యవతి బాలికల విద్య యొక్క ప్రాముఖ్యత తెలియజేశారు .జిల్లా బిజెపి వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించవలెనని వారు విధించే చిన్న చిన్న శిక్షలు అని భావించాలనీ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి శ్రీదేవి, చేను ప్రసాద్, చెరుకూరి శ్రీధర్, కరటూరి రమాదేవి, చిట్రోజు తాతాజీ గారు చెరుకూరి శ్రీధర్ కు పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ శివప్రసాద్, స్టాఫ్ సెక్రటరీ ఎం ఏ నబి, పాఠశాల ఉపాధ్యాయ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు పశువుల దాణా పంపిణీ.......



పాలకొల్లు మండలం వెంకటాపురం, లంకలకోడేరు గ్రామాల్లో పాడి రైతులకు ప్రభుత్వ 50 శాతం సబ్సిడీ పై పశువుల దాణా పంపిణీ కార్యక్రమం జరిగింది. వెంకటాపురంలో 25 బస్తాలు, లంకలకోడేరు లో 55 బస్తాలు, అందజేశారు. ఈ కార్యక్రమంలో %ూవీజ% చైర్మన్ శ్రీ కోడి విజయ భాస్కర్, సర్పంచ్ శ్రీమతి చొప్పల రజిని, మండల పార్టీ అధ్యక్షుడు పాముల రజనీ కుమార్, ఎంపీటీసీ ఆకుల చిన్న, సొసైటీ చైర్మన్ పెనుమత్స సత్యనారాయణ రాజు, ఇంటి శ్రీరాముడు, కలిదిండి రామచంద్ర రాజు, నేక్కింటి ఆదినారాయణ, అద్దె కోటి వీరభద్రం, నెక్కింటి దుర్గారావు, పనుతుల సూరిబాబు, ఆకుల బ్రహ్మాజీ, తాళ్లూరు విజయలక్ష్మి, భీమనాధుని ప్రశాంతి, కుడక కోటేశ్వరరావు, తాళ్లూరి శ్రీనివాస్, తదితరు నాయకులు పాల్గొన్నారు

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

### ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్




తాడేపల్లిగూడెం, ప్రభాతవార్త: ఉన్నతమైన విద్యతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, జీవితంలో ఘనవిజయాలు సాధ్యమవు తాయని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ విద్యార్థులకు ఉద్బోధించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు తాడేపల్లిగూడెం నియోజకవర్గం లోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ చక్కని విద్యాభ్యాసంతో విద్యార్థులు తమ భవిష్యత్తును నిర్మించు కోవాలని, ఉత్తమ పౌరులుగా దేశానికి దేశ నిర్మాణానికి తోడ్పడాలని అన్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి మీద ప్రత్యేక దృష్టి వహించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు.తమ పిల్లల విద్యాభ్యాసం ఎలా ఉందనే విషయంలో తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండి వారికి దిశా నిర్దేశం చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల కు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విద్యార్థులు తమకు ఏ సమస్య వచ్చినా ఎలాంటి ముందస్తు అనుమతులు అవసరం లేకుండా నేరుగా తనను కలిసి మీ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

## కాశిపాడు లో మెగా పిటిఎం సమావేశం.



అత్తిలి- గణపవరం డిసెంబర్ 5( ప్రభాత వార్త )గణపవరం మండలం మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ నెంబర్ 2 కాశిపాడు నందు మెగా పేరెంట్ టీచర్స్ మీట్ ను ఘనంగా నిర్వహించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని గ్రామ సర్పంచ్ తెర్లి నాగరాజు ,గ్రామ పెద్దలు అజయ్ రాజు , బలగం శ్రీను, సుధాకర్రాజు , సిల్వెస్టర్ రాజు, కూటమినాయకులు సత్యనారాయణ,, చరణ్, కొయ్యల సుబ్బారావు, ఎస్ఎంసి చైర్మన్ వార విజయకుమార్, వైస్ చైర్మన్ గ రాజ్యలక్ష్మి ఉపాధ్యాయులు స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ , దాతలు సహకారంతో విద్యార్థులకు టీ. షర్ట్స్ ప్రధానం చేసారు. ప్రధానోపాధ్యాయులు చల్లా కృష్ణ, ఉపాధ్యాయులు ఓ. శ్రీనివాసరావు, డీవీఎల్ పార్వతి, కలిదిండి ప్రసాద్ లు పాల్గొన్నారు.

## అండగా నిలుస్తాం...మెండుగా మార్చండి



ప్రభాతవార్త నరసాపురం :నరసాపురం పట్టణం 19వ వార్డులోని లెనిన్ హై స్కూల్‌లో ఘనంగా నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పాల్గొన్నారు రామరాజు మాట్లాడుతూ – "మన పిల్లల భవిష్యత్తు బలంగా ఉండాలంటే పాఠశాల అధ్యాపకులు– తల్లిదండ్రులు మూడు కలిసొచ్చినప్పుడు మాత్రమే సాధ్యం. నరసాపురం పట్టణంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచేందుకు మేము ఎల్లప్పుడూ మీతోనే ఉంటాము. లెనిన్ హై స్కూల్ వంటి విద్యాసంస్థలు మరింత అభివృద్ధి చెందేందుకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. "బాలల భవిష్యత్తు కోసం అవసరమైన మార్పులు, సౌకర్యాలు ఏవి ఉన్నా వాటిని అందించేందుకు నరసాపురం తెలుగుదేశం పార్టీ తరఫున మేము ఎల్లప్పుడూ ముందుంటాం." ఈ కార్యక్రమంలో నరసాపురం పట్టణ అధ్యక్షులు – చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, పార్లమెంట్ అధ్యక్షులు తిరుమాని హేమంత్ పాల్గొన్నారు



## పాఠశాల అభివృద్ధికి దాతల సాయం.



అత్తిలి- డిసెంబర్ 5( ప్రభాత వార్త): అత్తిలి మండలం లక్ష్మీ నారాయణ పురం ఉన్నత పాఠశాలలో మెగా పిటిఏ సమావేశం ప్రధానోపాధ్యాయుడు ఎం వి సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి నాగేశ్వరరావు పాఠశాల వర్గోన్నతకి సహకరించిన వారిని అభినందించారు. గ్రామానికి చెందిన జిల్లా ఆడిట్ అధికారి సూరిశెట్టి మధు పాఠశాల అభివృద్ధికి లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు ఇవ్వాలని కోరారు. జిల్లా ఉప విద్యాధికారి ఎన్ రమేష్,ఎస్ఎంసి చైర్మన్ అప్పలరాజు, ప్రత్యేక అధికారి షా, రాబర్ట్ మాథ్యూ,గరికపూడి సోనీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామచంద్ర విద్యాసంస్థల్లో..,

### మెగా పేరెంట్స్- డే, మెగా మెడికల్ క్యాంపు



జంగారెడ్డిగూడెం-ప్రభాతవార్త :శ్రీరామచంద్ర విద్యాసంస్థల్లో మెగా పేరెంట్ మీట్ 3.0లో భాగంగా పట్టణానికి చెందిన మమత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మమత ఆసుపత్రి వైద్యులు పవన్‌కుమార్, శ్రావ్యలు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం పెద్దలు, వైద్యులు సూచించిన ఆరోగ్యసూత్రాలను విద్యార్థులు ఎల్లప్పుడు పాటించాలన్నారు. అలాగే తల్లితండ్రులు సైతం ఆరోగ్యకరమైన జీవన శైలిని చిన్నారులకు అలవాటు చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని, క్రీడలను ప్రోత్సహించాలన్నారు. క్రీడలు శారీరిక, మానసిక ధృఢత్వాన్ని పెంచుతాయన్నారు.

## పేరెంట్స్ డే మీటింగ్ లో నిహారికకు అభినందనలు



పెనుమంట్ర:ప్రభాత వార్త మార్టేరు శ్రీ వేణు గోపాల ఉన్నత పాఠశాల లో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్ మీటింగ్ లో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగ పట్నాల నిహారిక కూచిపూడి నాట్యం చేసి అందరిని ఆకట్టుకొన్నారు. నిహారిక ను పంచ గ్రామ కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

## రావిపాడులో మెగాపిటిఏ సమావేశం.

అత్తిలి /పెంటపాడు- డిసెంబర్ 5 (ప్రభాతవార్త):పెంటపాడు మండలం రావిపాడు మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో మెగా పీటీఎం 3.0 ఆత్మీయ సమావేశా న్ని ఘనంగా నిర్వహించారు. పరిశీలకులుగా ఎం ఈ ఓ -1 ఎం శ్రీనివాస్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ శ్యామల పాల్గొన్నారు.. ఎం ఈ ఓ మాట్లాడుతూ పిల్లల ప్రగతిని తెలియజేసే లీప్ అప్ ను తల్లిదండ్రులు అందరూ ఇన్స్టాల్ చేసుకుని పిల్లల ప్రగతిని తెలుసుకోవచ్చని వివరించారు. .కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కేఎన్ డి రాజేశ్వరి, సభ్యులు, ఉపాధ్యాయులు డి జ్యోతి, కే నాగ సౌజన్య, వివివి పరదేశి, మంగతాయారు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు అందించాలి




వేలేరుపాడు, డిసెంబర్ 5,ప్రభాత వార్త : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలు అందించాలని సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సరైన వసతులు మందులు లేకపోవడం వలన పేద కుటుంబాలకు వైద్యం అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అతి ముఖ్యమైనది కుక్క, పాముల వలన ప్రమాదం సంభవించే అవకాశం ఉందని అవి కాటేసిన నాడు సమయానికి మందులు అందక ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. రెండు రోజుల క్రితం రామవరం పంచాయతీలోని ఐదు సంవత్సరాల బాలుడు పాము కాటుకు గురైతే స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో పాము విషానికి విరుగుడు మందు లేక 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న జంగారెడ్డిగూడెం రిఫర్ చేయడంతో బాలుడుకు సమయానికి వైద్యం అందకపోవడంతో బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందేనని. ఇలాంటి ప్రమాదాలు మరిన్ని జరగకముందే స్థానిక వైద్యశాలలో పూర్తిస్థాయిలో మందులు మరియు సరైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు,, చిక్కాల వాసు



మొగల్తూరు డిసెంబర్ 5 ( ప్రభాతవార్త) కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ఏడు వరాలు ప్రకటించడం పట్ల మదర్ తెరిసా నరసాపురం నియోజకవర్గం సంఘం అధ్యక్షుడు చిక్కాల శ్రీనివాసు శుక్రవారం హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దివ్యాంగుల సంక్షేమం కొరకు 7 వరాలు ప్రకటించడం పట్ల ఆయన దివ్యాంగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వాలు దివ్యాంగుల పట్ల శ్రద్ధ చూపలేదని సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్య తెచ్చి దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేసి ఏడు హామీలు ప్రకటించడం చరిత్రలో దివ్యాంగుల పట్ల ఉన్న వీరాభిమానాన్ని చాటుకుందని . ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణ సౌకర్యం, ఎన్నికల్లో పోటీ చేస్తే అవకాశం గెలవకపోతే ఎక్స్ అఫీషియ మెంబర్గా అవకాశం, టిడ్కో ఇళ్లల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపు, ఆర్టీసీ సబ్సిడీ పథకాన్ని తిరిగి ప్రారంభం, రాజధాని అమరావతిలో దివ్యాంగుల భవనం ఏర్పాటు, వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీలు, అన్ని క్రీడా కార్యక్రమాల్లో వారికి భాగస్వామ్యం కల్పించడం వంటి వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని హామీలు ఇవ్వటం పట్ల శ్రీనివాసు సంతోషం వ్యక్తం చేశారు.

# ఆరోగ్య భద్రత పథకంపై సోషల్ మీడియాలో పుకార్లు

## అవి అవాస్తవాలు.. పోలీసు సంక్షేమ విభాగం

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** పోలీసులకు లభిస్తున్న ఆరోగ్య భద్రతకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లన్నీ అవాస్తవాలని పోలీసు సంక్షేమ విభాగం తెలిపింది. ఈ మేరకు డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య భద్రతలో భా గంగా ఇకముందు పోలీసులకు లభించే ఉచిత వైద్యం కేవలం నిమ్స్‌కే పరిమితమని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నిరాధారమని ఆయన తెలి పారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇప్పుడున్నట్లుగా వైద్య సేవలు యధా ప్రకారం కొనసాగుతాయని ఆయన తెలిపారు. అంతకు మించిన వైద్యం అయి తే ఇప్పుడున్నట్లుగానే నిమ్స్‌లో వుంటాయని ఆయన వెల్లడించారు. దీంతో పాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో వున్న ఏయిల్మెంట్స్ కవరేజ్‌లో లేని వాటికి కూడా నిమ్స్‌లో వైద్య సేవలు అందుతాయని డిఎస్‌పి తెలిపారు. పోలీసు అధికారులు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఐదు లక్షల నుంచి ఏడున్నర లక్షల రూపాయల వరకు చికిత్స పొందవచ్చని, వారి కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు చికిత్స పొందవచ్చని ఆయన తెలిపారు. అంతకు మించిన సేవలు అయితే నిమ్స్‌లో ఉచితంగా పొందవచ్చని ఆయన తెలిపారు.

# అక్రమంగా నిర్బంధించిన ఓయు, కెయు విద్యార్థులను విడుదల చేయాలి

## సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణకు వెళ్లిన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులను అక్రమ నిర్బంధించారని.. వారిని వెంటనే విడుదల చేయాలని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. అక్రమంగా యూనివర్సిటీ విద్యార్థులను నిర్బంధించడాన్ని ఎమ్మెల్సీ తీవ్రంగా ఖండించారు. హైదరాబాదులో మీడియాతో మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు స్పందిస్తూనే ఉంటారని.. అదే విధంగా మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌పై వాస్తవాలను ప్రజలకు తెలియ జేయడం కోసం వారు ముందుగానే మావోయిస్టులకు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి, ఆంధ్రప్రదేశ్ డీజీపీకి బహిరంగంగానే లేఖలు రాశారని సత్యం గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వారు వెళుతున్న వాహనాలను ఆపి విద్యార్థులను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా విడుదల చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర మండలం డిసిపి రష్మీపెరుమాల్, అడిషనల్ డిసిపి అశోక్ తదితరులు

# రూ. 4 కోట్ల హవాలా సొమ్ము స్వాధీనం

## ఇద్దరి నిందితుల అరెస్ట్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), డిసెంబరు 5, ప్రభాతవార్త:** హవాలా సొమ్మును గుట్టు చప్పుడు కాకుండా రూ. 4 కోట్ల 5 లక్షలను కారులో తరలిస్తున్న ఓ హవాలా ముఠాను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఉత్తర మండలం డిసిపి సాధనరష్మీ పెరుమాల్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుజరాత్‌కు చెందిన ప్రకాశ్ మోతీబాయ్ ప్రజాపతి (30), ప్రగ్నేస్ కీర్తిబాయ్ ప్రజాపతి(28) క్రేటా కారు నెం ఎం. హెచ్.49సీఎల్ 2496 డిక్కీలో, బ్యానెట్, సీట్లలో బయటకు కనిపించకుండా రూ.4 కోట్ల 5 లక్షలను అక్రమంగా తరలిస్తున్నారు. రూ. 50 లక్షలు ఇస్తే మరో రూ.10 లక్షల రూపాయలు ఆన్‌లైన్ ద్వారా అందిస్తానంటూ మోసం చేసి తప్పిం చుకుంటున్న గ్యాంగ్‌పై గత యేడాది డిసెంబర్‌లో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఓ వ్యాపారి తనకు అధిక డబ్బులు ఇస్తానని రూ.50 లక్షలతో ఉడాయించగా కిందటేడాది డిసెంబరులో బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేసుకొని వాహనాలను తనిఖీ చేస్తు న్నారు. ఆ ముఠా మహబూబ్‌నగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. శుక్రవారం బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద కార్లను తనిఖీ చేస్తుండగా ఆ కారులో రూ. 4 కోట్ల 5 లక్షలను గుర్తించారు. ఆ డబ్బును ఎక్కడి నుంచి తెస్తున్నారు. ఎక్కడికి చేరవేస్తున్నారని వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా డబ్బులు తరలిస్తున్న కారును, నగ దును పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేశారు. అధిక డబ్బు లు, అధికవడ్డీ ఇస్తామని మాయమాటలు చెప్పేవారి మాటలకు మోసపోకుండా ప్రజల అప్రమత్తంగా ఉండాలని డిసిపి రష్మీపెరుమాల్ విజ్ఞప్తి చేశారు.

# గృహరుణదారులకు ఆర్బీఐ నిర్ణయం ఎంతో మేలు

## ఆర్బీఐ రెపోరేట్ల తగ్గింపుపై క్రెడాయ్ అధ్యక్ష కార్యదర్శులు జగన్నాథరావు, క్రాంతికిరణ్‌రెడ్డి





**హైదరాబాద్, డిసెంబరు 5: భారతీయ** రిజర్వుబ్యాంకు 25 బేసిస్ పాయింట్లరెపోరేటు తగ్గింపునిర్ణయాన్ని క్రెడాయ్‌ప్రతినిధులు స్వాగతించారు. ఆర్‌బిఐ నిర్ణయం వల్ల అందుబాటుధరల్లో పక్కా గృహాలు లభిస్తాయని, అలాగే గృహరుణాలపై వడ్డీరేట్లు తగ్గుతాయని వెల్లడించారు. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్‌ద్వారా లక్షకోట్లను సమీకరించాలన్న నిర్ణయంతో హోం బయర్లకు ఎంతోమేలుచేస్తుందని క్రెడాయ్ అధ్యక్షుడు బి.జగన్నాథరావు పేర్కొన్నారు.నగరంలో సగటు ఇంటిఖరీదు 75 లక్షలుగా ఉందని, ఈమొత్తం రుణం 30 ఏళ్లపాటు కొనసాగితే కొనుగోలుదారులు వడ్డీరూపేణా రూ.4.76 లక్షలు ఆదా చేసుకోగలుగుతారని ఆయన అన్నారు. ఈ ఏడాదిలోనే 125 బేసిస్‌పాయింట్లను ఆర్‌బిఐ కుదించిందని దీనివల్ల 50 లక్షల రూపాయల రుణాలపై నెలకు రూ.800 నుంచి రూ.1000వరకూ ఆదా కలుగుతుందని ఆయన అన్నారు. అలాగే క్రెడాయ్ కార్యదర్శి క్రాంతికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ తక్కువ వడ్డీరేట్లు నిర్ణయం వల్ల ఇళ్ల కొనుగోలు దారుల్లో కొనుగోలుశక్తిని పెంచుతుందని అంతేకాకుండా బయ్యర్లు భారీ మొత్తం రుణాలు తీసుకునేందుకు ముందుకువస్తారనితద్వారా గృహకొనుగోళ్ల రంగం మరింత పటిష్టం కావడంతోపాటు ప్రజల్లో కొనుగోలుశక్తిని కూడా పెంచుతుందని క్రాంతికిరణ్‌రెడ్డి అన్నారు ఈఎంఐల భారం తగ్గుతుందని, ప్రీమియం లొకేషన్లలో మంచి నాణ్యతాప్రమాణాలతో నిర్మించే ఇళ్లను కొనుగోలుచేసుకోగలుగుతారని నరకాంతికిరణ్ అంచనావేసారు.

# ఎఐ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం

## ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 5:** ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేథకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి తెలంగాణా ప్రభుత్వం శుక్రవారం నాడు కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణ కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్స లెన్స్) మొట్టమొదటిది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యామంత్రి జూలియన్ హిల్ తో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల బాబు ఎంఓయు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. డికిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్ స్టిట్యూట్ ఈ ఎక్సెలెన్స్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని ఆయన వివరించారు. కాలేజిల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఒప్పందం జరిగిందని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలన, ఆరోగ్యం, విద్య, ఐటీ, లైఫ్ సైన్సెస్, వ్యవసాయం, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మెటల్స్ రంగాల్లో పరిశోధన, నైపుణ్య శిక్షణ అందజేయడానికి ఈ సెంటర్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుంది. డిజిటల్ ఇండియా భవిష్యత్తుకు తెలంగాణా ముఖ ద్వారం కానుందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో కూడా నైపుణ్య శిక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాను సందర్శించిన సందర్భంగా డీకిన్ యూనివర్సిటీని రాష్ట్రంలో క్యాంపస్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించాం. తెలంగాణాలో నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన ఎకోసిస్టం ఉంది. దీనికి ఈ ఎక్సలెన్స్ సెంటర్ సేవలు మరింత ఉపయోగపడతాయి. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులకు తమ దేశంలో ఉన్నత స్థాయి నైపుణ్యాల్లో శిక్షణ అందించడానికి కూడా ఆస్ట్రేలియా అంగీకరించిందని తెలిపారు. ఎంఓయు కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు ఐ. సాయిక్రిష్ణ, ఆస్ట్రేలియా ప్రతినిధులు క్యామ్ గ్రీన్, కరేన్ సాండర్ కాక్, నథానియెల్ వెబ్, స్టీవెన్ బిడిల్, హిల్లరీ మెక్ గిచి, స్టీవెన్ కానోలీ, విక్రం సింగ్, ఐటీ శాఖ చీఫ్ స్ట్రాటెజిస్ట్ శ్రీకాంత్ లంకా తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా వర్సిటీ పనుల్లో విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యం

- చారిత్రక భవనాలను రక్షిస్తూనే కొత్త భవనాల నిర్మాణం
- నెలాఖరుకు అభివృద్ధి పనులపై తుదినిర్ణయం
- పనులపై సమీక్షలో సిఎం రేవంత్‌రెడ్డి
- 10న వర్సిటీని సందర్శించనున్న ముఖ్యమంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 5:** ఉస్మానియా యూనివర్సిటీలో (ఓయూ) చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో విద్యార్థులు, బోధన సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఓయూ అభివృద్ధి పనులపై జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తొలుత అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం పనులకు సంబంధించిన వివిధ మోడళ్ల పవర్ పాయింట్ ప్రజంటేషన్స్‌ను సీఎం వీక్షించారు. హాస్టల్ భవనాలు, రహదారులు, అకడమిక్ బ్లాక్స్, ఆడిటోరియం నిర్మాణాలకు సంబంధించి పలు మార్పులు చేర్పులను సీఎం సూచించారు. యూనివర్సిటీ పరిధిలోని అటవీ ప్రాంతంలో పనులకు అర్బన్ ఫారెస్ట్రీ నిధులు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సీఎం సూచించారు. యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికే ఉన్న జల వనరులను సంరక్షిస్తూనే నూతన జల వనరుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. హాస్టల్, అకడమిక్ భవనాల నిర్మాణం విషయంలో వంద మంది విద్యార్థులుంటే అదనంగా మరో పది శాతం విద్యార్థులకు వసతులు ఉండేలా చూడాలని సీఎం తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్తులోనూ ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు వెనుకాడమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని చారిత్రక, వారసత్వ భవనాలను సంరక్షించాలని సీఎం సూచించారు. చారిత్రక ప్రాధాన్యం లేని పురాతన భవనాలకు భారీ మొత్తాలు వెచ్చించి మరమ్మతులకు చేసే బదులు నూతన భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. సైకిల్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌లతో పాటు ప్రతి పనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం తెలిపారు. ఉస్మానియా విద్యార్థుల పోరాట ప్రతిమను ప్రతిబింబించే చిహ్నాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఉస్మానియా యూనివర్సిటీని ఈ నెల 10వ తేదీన సందర్శించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అకడమిక్ బ్లాక్‌లు, హాస్టళ్లను పరిశీలిస్తానని సీఎం తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి విద్యార్థులు, బోధనా సిబ్బంది అభిప్రాయాలు స్వీకరించాలని సీఎం అధికారులకు సూచించారు. తొలుత అభివృద్ధి నమూనాలు వారి ముందు ఉంచాలని.. తర్వాత వారి అభిప్రాయాలు తెలిపేందుకు డ్రాప్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ ఈ నెలాఖరు నాటికి అభివృద్ధి ప్రణాళికలపై తుది నిర్ణయం ఖరారు కావాలని సీఎం తెలిపారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్

# ఈగల్ పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఈగల్ పోలీసులు రైళ్లలో జరిసిన ఆకస్మిక తనిఖీలలో రెండు వేర్వేరు ఘటనల్లో ముగ్గురు గంజాయి స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 11 కిలోల గంజాయిని జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషాలోని గంజాం జిల్లాకు చెందిన మున్నా ప్రుస్టి, తికాష్ బారిక్ అనే ఇద్దరు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లు కోనార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఏడు కిలోల గంజాయిని తీసుకుని ఒడిషాలోని బహరంపూర్ నుంచి ముంబాయి వస్తుండగా సికింద్రాబాద్‌లో ఈగల్ పోలీసులు, రైల్వే పోలీసులతో కలిసి తనిఖీ నిర్వహించగా ఇద్దరు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి ఏడు కిలోల గంజాయిని జప్తు చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. ముంబయిలో గంజాయిని అమ్మేందుకు వీరిద్దరు ఒడిశా నుంచి తీసుకువెళుతు న్నట్లు తేలింది. వీరిద్దరు అంతరాష్ట్ర డ్రగ్స్ స్మగ్లర్లుగా తేలింది. వీరిపై ఇంతకుముందు కూడా అనేక కేసులున్నాయి. మరో ఘటనలో సికిందరాబాద్‌లోనే లోక్‌మాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్‌లో ఈగల్, రైల్వే పోలీసుల తనిఖీలో మోహన్ కుమార్ విజయ్ అనే వ్యక్తి 1.1 కిలోల గంజాయిని తరలిస్తుండ గా పట్టుబడ్డాడు. ఇతను ఒడిశాలోని రాయగడ జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన వాడుగా తేలింది. పటాన్ చెరులో ఇతను ఉద్యోగం చేస్తున్నట్లు, తన సొంత అవసరాలకు గంజాయిని తరలిస్తున్నట్లు తేలింది. ఇతన్ని కూడా రిమాండుకు తరలించారు. కాగా డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారమున్నా 8712671111 నంబర్‌కు తెలపాలని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్య కోరారు.

# ఎసిబికి పట్టుబడిన అడిషనల్ కలెక్టర్

**హన్మకొండ బ్యూరో, డిసెంబరు 5, ప్రభాతవార్త:** హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన ఏసీబీ దాడుల్లో ముగ్గురిని అధికారులు రెడ్‌హ్యాండెడ్గా అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల అనుమతులకు సంబంధించి రూపాయలు ఒక లక్ష లంచం డిమాండ్ చేసి, అందులో అరవై వేలు తీసుకుంటున్న సమయంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి (డిఈఓ ఇన్చార్జిగా కూడా పనిచేస్తున్నారు)ను వారి అదనపు కలెక్టర్ కార్యాలయంలోనే ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ కేసులో విద్యాశాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది గౌస్, మనోజ్ ను కూడా ఏసీబీ అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ముగ్గురినీ ఏసీబీ అధికారులు కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో విచారిస్తున్నారు.

# హైకోర్టుకు క్షమాపణలు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

## బతుకమ్మకుంట కేసు

## విచారణ 18కి వాయిదా

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** అంబర్‌పేటలో బతుకమ్మ కుంట కేసు విచారణకు శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైకోర్టుకు హాజరయ్యారు..గత నెల 27న ఇదే కేసు విచారణకు ఎందుకు హాజరు కాలేకపోయానో హైకోర్టుకు వివరించారు. బాచుపల్లి ప్రాంతంలో నివాస ప్రాంతాలు ముంపునకు గురైతే అక్కడకు వెళ్లాల్సి వచ్చిందని .. అందుకే హాజరు కాలేకపోయానని కోర్టుకు క్షమాపణలు చెప్పారు. హైడ్రా కమిషనర్ వివరణను స్వీకరించినట్టు పేర్కొన్న హైకోర్టు తదుపరి విచారణకు కమిషనర్ హాజరు కావాల్సినవసరం లేదంటూ మినహాయింపును ఇచ్చింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం చెరువును హైడ్రా తవ్విందని చుట్టుపక్కల ప్రాంతాలు నీట మునిగే ప్రమాదముండడంతోనే బండ్ నిర్మించినట్టు స్పెషల్ జీపీ స్వరూప్ ఊరెళ్ల కోర్టుకు వివరణ ఇచ్చారు. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు ఈ నెల 18కి విచారణను వాయిదా వేసింది.

**అసలేం జరిగిందంటే..**

ఈకేసుకు సంబంధించి. అంబర్‌పేటలోని బతుకమ్మకుంట పరిధిలోని ప్రైవేటు స్థలానికి సంబంధించి యథాతథస్థితిని కొనసాగించాలని జూన్ 12న ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకోవాలంటూ అంబర్‌పేట్ బిఆర్ఎస్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అక్టోబరు 31న విచారించిన హైకోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోరాదో నవంబరు 27న వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలంటూ హైడ్రా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. బాచుపల్లి ప్రాంతంలో నివాస ప్రాంతాలు ముంపునకు గురైనందున లక్కడ వెళ్లాల్సి వస్తున్నందున వ్యక్తిగతంగా హాజరు కాలేకపోతున్నానని మినహాయింపు నివ్వాలని హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు.

# 9లోపుగా ఆర్‌టిసిలో యూనియన్లను పునరుద్ధరించాలి

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూయు లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి) కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 9లోపుగా యూనియన్లను పునరుద్దరించాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఎస్‌డబ్ల్యూయూ) ఐఎన్‌టియుసి డిమాండ్ చేసింది. 9లోపుగా సమస్యను పరిష్కరించకపోతే ప్రజా పాలన సంబరాలను బహిష్కరిస్తామని దాంతోపాటు నిరవధిక నిరహార దీక్ష చేస్తామని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి రాజిరెడ్డి స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరణ చేస్తామని, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని, రాబోవు పి.ఆర్.సి.పరిధిలోకి టి.ఎస్.ఆర్.టి.సీ కార్మికులను చేరుస్తామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని, కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం మేనిఫెస్టోలో పెట్టి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెసు అధికారంలో రావడానికి ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబ సభ్యులు విశేష కృషి చేశారు. స్వయంగా తాను కేసీఆర్‌ను ఓడించాలనే కసితో ఉద్యోగం పోతుందని తెలిసి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీ గెలుపునకు జీప్ జాత ద్వారా వివిధ డిపోలు తిరిగి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేశానని, ఆ తర్వాత ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి ఐఎన్టీయుసీ అనుబంధ సంఘమైన స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ లో తనతో పాటు వేలాది మంది కార్మికులను కూడా జాయిన్ చేయించానని రాజిరెడ్డి తెలిపారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు ఇసి ఖర్చుపై ఆడిటింగ్ చేయాలి

## చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గత నెలలో జరిగిన జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నిక కోసం ఎన్నికల సంఘం ఐదు కోట్ల 91 లక్షల రూపాయలు ఖర్చు పెట్టడంపై ఆడిటింగ్ జరపాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ డిమాండ్ చేసింది. సమస్యాత్మక ప్రాంతాలు లేని, అదనపు బలగాల తరలింపు అవకాశంలేని చోట ఇంత పెద్ద మొత్తంలో ఎందుకు ఖర్చు చేయాల్సి వచ్చిందనే దానిపై ఎన్నికల సంఘం ప్రజలకు సమాధానం చెప్పాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కోరింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు శుక్రవారం లేఖ రాశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం ఎన్నికల సంఘం చేసిన ఖర్చుపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు తీసుకోగా రూ. 5.91 కోట్ల వ్యయం అయినట్లు తేలిందని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల కోసం కొత్తగా సిబ్బందిని నియ మించలేదని, ఇతర ప్రాంతాల నుంచి పోలీసులతోపాటు ఇతర విభాగాల సిబ్బందిని తరలించలేదని, ఈ సెగ్మెంట్‌లో సమస్యాత్మక ప్రాంతాలు కూడా లేవని, పారా మిలటరీ బలగాల మోహరింపు కూడా లేదని అటువంటి పరిస్థితుల్లో ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు ఖర్చుచేయాల్సి వచ్చిందని పద్మనాభరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ రాజ్యాంగబద్ధంగావున్న సంస్థ అయినప్పటికీ, ఎన్నికల కోసం ఆ సంస్థ చేసిన ఖర్చు చేసిన డబ్బులు తెలంగాణ ప్రజలు పన్నుల రూపంలో చెల్లించి నవని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై పూర్తిస్థాయిలో ఆడిటింగ్ చేసి, అన్ని వివరాలు ప్రజలముందు పెట్టాలని, దీనిపై ప్రజలకున్న అనుమానాలను నివృత్తి చేయాలని పద్మనాభరెడ్డి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను కోరారు.

# కెటిఆర్‌ది విషపూరితమైన ఆలోచన

## హిల్ట్ పాలసీపై కెటిఆర్ వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి కౌంటర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 5:** హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ విమర్శలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిప్పికొట్టారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ ఆరోపణలపై విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. హిల్ట్ పాలసీలో రెండు అంశాలు బిఆర్ఎస్ పాలనలో వచ్చినవే, ఆ ఫైల్‌పై మంత్రిగా కేటీఆర్ సంతకం చేసిన సంగతి మరిచారా? గత ప్రభుత్వంలో కోకాపేట, నియోపోలిస్ ప్లాట్లు వేలం వేశారు, హిల్ట్‌ను దోపిడీ పాలసీ అంటున్న కేటీఆర్‌కు ఇవి గుర్తులేవా? ఓఆర్ఆర్ నిర్వహణను కూడా వేలం వేశారు. అయ్య ముఖ్యమంత్రిగా కొడుకు పరిశ్రమల శాఖ మంత్రిగా కావలసిన వారి దగ్గర ముడుపులు తీసుకొని భూములను కన్వర్షన్ చేశారు. ప్రభుత్వ భూములు వేలం వేశారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా వేలాది ఎకరాలు వేలం వేశారు.ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌బి నగర్‌లోని దాదాపు 40 ఎకరాల స్థలాన్ని పివి రాజు ఫార్మా కంపెనీకి లీజుకు ఇవ్వడం జరిగింది. అక్కడ కెమికల్ ఫ్యాక్టరీ తోటి భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయని అక్కడి ప్రజలు ఆందోళన కూడా చేశారు. ఈ కెమికల్ ఇండస్ట్రీని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చింది బిఆర్ఎస్ కాదా? ఈ ఫైలుపై అయ్య కొడుకులు సంతకాలు చేయలేదా? ఏ పాలసీతో ఈ కన్వర్షన్ చేశారు. ఐడిపిఎల్ లో కూడా ఇదే విధంగా చేశారు. కేటీఆర్ కడుపునిండా విషమేఉంది. విషం కక్కడానికి కూడా ఒక హద్దు, అదుపు, పద్ధతి ఉంటుంది. కేటీఆర్ ది కడుపుమంట. విషపూరితమైన ఆలోచన. హిల్ట్ పాలసీపై బిజేపీ , బిఆర్ఎస్‌ది ఒకే డ్రామా. స్క్రిప్ట్ రాసేది ఒకరు. డెలివరీ చేసేది మరొకరు అని వ్యాఖ్యానించారు.

**నా కొడుకు తప్పు చేస్తే శిక్ష తప్పదు: మంత్రి పొంగులేటి**

తప్పు చేస్తే తన కుమారుడైనా శిక్షకు అర్హుడేనని, చట్టం ముందు అందరూ సమానమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. తన కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై నమోదైన భూ వివాదం కేసుకు సంబం ధించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొంతకాలం క్రితం,ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమిలోకి జీసీబీలతో ప్రవేశించిన కూల్చివేతలకు పాల్పడ్డారనే ఆరోపణలతో రాఘవ కన్‌స్ట్రక్షన్సక్షపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాక్ష్యాధారాలతో కూడిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి,దౌర్జన్యం కింద కేసు నమోదు చేశారు.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి దివ్య

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 367

**హైదరాబాద్(బేగంపేట), డిసెంబరు 5, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణికార్యక్రమంలో మొత్తం 367 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 144 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 23 దరఖా స్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 83 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 18 దరఖాస్తులు, పౌర సరఫరా శాఖకు సంబంధించి 30 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు.

**త్వరలో గ్రూప్-3 అభ్యర్థులకు పోస్టింగ్స్..**

పోటీ పరీక్షల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 1,388 మంది పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-3 అభ్యర్థులకు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి తెలిపారు.శుక్రవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో జరిగిన సీఎం ప్రజాభవన్‌కు పెద్ద ఎత్తున గ్రూప్-3 అభ్యర్థులు తరలి వచ్చారు. తమకు పోస్టింగ్స్ త్వరగా ఇప్పించాలని కోరారు.

# ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

## 10న ఢిల్లీలో ఉపాధ్యాయ సంఘాలతో ఎస్‌టిఎఫ్‌ఐ రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌టిఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఇదే అంశంపై ఈ నెల 10న ఢిల్లీలో ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు సంఘం జాతీయ అధ్యక్షుడు సిఎన్ భార్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్షను తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో సీనియర్ ఉపాధ్యాయుల ఉద్యోగాల రక్షణతోపాటు విద్యా రంగంలో సంక్షోభం నివారణకు కేంద్ర ప్రభుత్వం తీసు కోవాల్సిన చర్యలపై చర్చించి తగిన ఐక్య కార్యాచరణను రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ నెల 10న ఉదయం 11 గంటలకు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ సమీపంలోని హెచ్‌కెఎస్ సూర్జిత్ భవన్ నందు జాతీయ స్థాయి ఉపాధ్యాయ సంఘా లతో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఉద్యోగ విరమణకు 5 సంవత్స రాల పైబడిన సర్వీసు ఉన్న ఉపాధ్యాయులందరూ రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగాలనుండి తొలగించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా దేశవ్యాప్తంగా 25 లక్షల మంది ఉపాధ్యాయుల ఉద్యోగాలకు ముప్పు ఏర్పడిందన్నారు.

ఇంత పెద్ద సంఖ్యలో ఉపాధ్యా యులను తొలగిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యా యుల కొరతతో విద్యారంగంలో తీవ్రమైన సంక్షోభం ఏర్పడుతుందన్నారు. జాతీయ స్థాయిలో పని చేస్తున్న అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో టెట్‌సమస్యపై చర్చించి ఏకాభిప్రాయం ద్వారా తదుపరి కార్యాచరణను రూపొందించే దిశగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

# చీరెకి తోడు.. వెచ్చని బ్లౌజ్ !

ఉన్నపళంగా చలి చుట్టు ముట్టేసింది. చలికోటులోనో, వెచ్చగా దుప్పటిలోనో దాక్కోవాలి అనిపిస్తోంది కదూ! ఒవైపు వేడుకలు, మరోవైపు ఉంటాయి పెళ్లి పిలుపులు...

కొన్నింటిని దాటవేసినా తప్పనిసరివి అంటూ కొన్ని అక్కడికి ఏ స్వెటర్లోనో శాలువా కప్పుకొనో ఏం వెళతాం? పైగా ముఖ్యమైన వేడుకలంటే చీర కట్టేయాల్సిందే! అబ్బబ్బా ఎన్ని తిప్పలో. అందుకె శీతకాలంలో వేడుకలు మనకి పెద్ద సవాలులా తోస్తాయి. స్టైలిష్ లుక్ ఇస్తూనే మేనికి వెచ్చదనాన్ని ఇస్తే ఎంత బాగుంటుందో కదా! అయితే 'ఉలెన్ బ్లౌజ్'లకు ఓటేయండి లంగాఓణీ, లెహెంగా, చీర... వేటికైనా ఇవి చక్కగా నప్పుతాయి.

ఫ్యాషన్ ఫ్యాషన్





# గ్రామీణ విద్యార్థులకు టెక్నాలజీపై ఆసక్తి..



ప్రపంచమంతా టెక్నాలజీ దిశగా పరుగెడుతోంది. కానీ ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు దాని ఓనమాలూ తెలియకపోవడం గమనించింది **నయనాలఅశ్రిత.** అందుకే 'ఆత్మీయ క్లబ్' ప్రారంభించి వారికి సాయపడుతోంది.

అశ్రిత వాళ్లది డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు. అమ్మా నాన్నలు బిందుప్రియ, వెంకట్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. వీళ్ల కుటుంబం అమెరికాలో స్థిరపడింది. ప్రస్తుతం టెన్త్ గ్రేడ్ చేదువుతోంది అశ్రిత. తమ గర్ల్ స్కౌట్ హార్ట్ ఆఫ్ న్యూజెర్సీలో సభ్యురాలు. ఒకరకంగా ఇది మన ఎన్‌సిసి లాంటిదే. దీనిలో బ్రౌన్, సిల్వర్, గోల్డ్ అనే 3 దశలుంటాయి. వీటిలో భాగంగా విద్యార్థులు కొన్ని ప్రాజెక్టులు చేయాలి. అయితే వీళ్ల ప్రమేయం లేకుండా అవి కొనసాగేలానూ చూడాలి. అలా అశ్రిత తన అయిదో తరగతిలో పార్క్‌లో 'లిటిల్ లైబ్రరీ' ప్రారంభించింది. పార్క్‌కి వెళ్లినవారు అందు లోని పుస్తకాలను చదువుకోవచ్చు. వెళ్లేట ప్పుడు తిరిగి పెట్టేయాలి. ఎవరైనా ఇంట్లో పనికిరాని పుస్తకాలనూ అక్కడ పెట్టొచ్చు. రెండో ప్రాజెక్టుగా అరుదైన పక్షి రకాలకు గూళ్లు కట్టించి ఇచ్చింది. వాటి నిర్వహణ బాధ్యత స్థానిక మున్సిపల్ సంస్థ తీసుకునేలా చేసింది. ఇవి రెండూ బృందంతో కలిసి చేసింది. మూడో దాన్ని ఒంటరిగా, అంతర్జాతీయ స్థాయిలో చేయాలి. అశ్రితకి రోబోటిక్స్ అంటే ఇష్టం నాలుగో తరగతి నుంచే సంబంధత కోర్సులు చదువుతోంది. అలాంటిది భారత్‌లోని గ్రామీణ విద్యార్థులకు హైస్కూలు స్థాయికి చేరినా పరిచయం కాకపోవడం అశ్రితను ఆశ్చర్యపరిచింది. అందుకే వాళ్లకు దాన్ని పరిచయం చేయాలన్న ఉద్దేశంతో 'ఆత్మీయ కోడ్ క్లబ్' ప్రారంభించింది. దీన్నే తన గోల్డ్ అవార్డు ప్రాజెక్టుగానూ మార్చుకుంది. తన ఆలోచనను గర్ల్ స్కౌట్‌తో పంచుకుని అంగీకారాన్నీ అందుకుంది. దీనికోసం కొందరు వలంటీర్లను నియ మించుకుంది. సంకురాత్రి, ఆత్మీయ ఒక యూకె ఆధారిత ఎన్‌జిఒలతో ఒప్పందం చేసుకుంది. వాళ్ల తరగతులకు అవసరమైన సామగ్రితోపాటు కొన్ని నిధుల్నీ అందించారు. వాటతో రోబోటిక్ కిట్స్‌ని సమకూర్చింది. కాకినాడలోని పెనుమర్తిలో ఒక పాఠశాలను ఎంచుకుని.. ఇటీవల అక్కడి విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన, వాటి గురించి నేర్చుకోవడం ద్వారా వచ్చే ఉద్యోగావ కాశాలు వంటివాటిపై తరగతులు తీసుకుంది. ఆసక్తి ఉన్న 8,9,10 తరగతుల విద్యార్థులను ఎంపిక చేసి, వారానికి రెండు చొప్పున ఆన్‌లైన్ తరగతులు తీసుకుంటోంది. భారత్‌కి వచ్చే ముందే నేను సొంతంగా కొన్ని ప్రొటోటైప్‌లను చేసుకుని తీసు కొచ్చా. అవి ఇక్కడి విద్యార్థులని ఆకర్షించాయి. తరగుతుల్లో భాగంగా ఒకరోజు కాన్సెప్ట్ చెబుతాం. వారం చివర్లో దాని ఆధారంగా నచ్చిన ప్రాజెక్టు చేసి చూపించేలా ప్రోత్స హిస్తున్నాం. ఇందు కు కావాల్సిన రోబోటిక్ కిట్‌లనీ అందించాం. గ్రామీణ విద్యార్థులకూ టెక్నాలజీపై ఆసక్తి కలగాలన్నదే నా తాపత్రయం' అంటోంది అశ్రిత. □



# గోవిందుని భజించు!



ఆదిశంకరాచార్యుల వారిని సాక్షాత్తు పరమేశ్వరుడే అంటారు. భజగోవిందం లో అద్భుత తాత్విక సూత్రాలను అందరికీ అర్థమయ్యేలా చెప్పారాయన. ఆ శ్లోకాల్లో కొన్ని ముఖ్యాంశాలను గుర్తుచేసుకుందాం.. అవసాన కాలంలో నీ వ్యాకరణ సూత్రాలు నిన్ను రక్షించలేవని గ్రహించి, గోవిందుణ్ణి భజించు మూర్ఖుడా! అంటూ ఒక వ్యాకరణ పండితుడికి శంకరులు చేసిన హితోపదేశం అమూల్యమైంది. దేహంలో ఊపిరి ఉన్నంత వరకు నీ యోగక్షేమాలు తెలుసుకుంటారు. తర్వాత చెంతకు చేరారు. సంపాదించే శక్తి ఉన్నంతవరకూ అంతా బాగానే చూస్తారు. తర్వాత ఆ గౌరవం ఉండదు. కనుక ధనంపై ఆశ వదిలేసి సదాలోచనలకు చోటివ్వు ఇంకా డబ్బు కావాలంటూ అత్యాశపడకు. ధనం గొప్పదని ఎన్నడూ తలవకు. దానివల్ల ఏ మాత్రమూ సుఖం ఉండదు. ధనికులకు కన్న కొడుకును చూసినా భయంగానే ఉంటుంది. మనసులోని మాలిన్యాలను తొలగించే గోవిందుణ్ణి భజించు శరీరాన్ని చూసుకుని మోహానికి లోనవకు. అది కేవలం నెత్తుటితో నిండిన మాంసపుముద్ద. జనమంతా రోగపీడితులై, దేహాభిమానం విడిచిపెట్టకుండా దుఃఖంలో పడి కొట్టుకుపోతున్నారే కానీ సుఖపడేవారు ఎవరూ లేరు. వయసు పెరిగే కొద్దీ బంధాలు పెరుగుతాయి. రాత్రి, పగలు, శిశిరం, వసంతం.. ఒకదాని వెంట ఒకటిగా కాలచక్రం పరిభ్రమిస్తూనే ఉంటుంది. ఆశ అనే పెనుగాలి నిన్ను సంసారబంధంలోకి ఈడ్చుకెళ్తుంది. కర్మలు, బంధాల నుంచి విముక్తం అయ్యేందుకు గోవిందుని భజించు అంటూ ఆశామోహాలను వివరించారు. బాల్యంలో ఆటలు, యవ్వనంలో స్త్రీవ్యామోహం, వృద్ధాప్యంలో వ్యాకులం ఇలా ప్రతి దశలోనూ లౌకిక విషయాలే తప్ప పరమాత్మునిపై ఆసక్తి ఉండదు. బ్రహ్మ జ్ఞానం కలిగించే గోవిందుని స్మరించు అంటూ మాయాప్రపంచం గురించి తెలియజేసారు. □

# కొబ్బరి పీచు పారేస్తున్నారా ?

కొబ్బరికాయలతోపాటే వచ్చే పీచుని పారేస్తున్నారా? పాత్రలు తోమడానికి స్టీల్ స్క్రబ్బర్ కన్నా కొబ్బరి మీచు సౌకర్యంగా ఉంటుంది. ప్లాస్టిక్ స్క్రబ్బర్‌తో పోలిస్తే పర్యావరణహితం కూడా.

✦ ఇత్తడి పాత్రలో కొబ్బరి పీచును ప్రొట్టులా చేసి వేసి అందులో కొద్దిగా కర్పూరం వేసి మండిస్తే ఇంట్లో దుదర్వా సనలు దూరమవుతాయి. దోమల బెడద కూడా ఉండదు. ✦. నరిసిన జుట్టుకు ఇది డైలా కూడా ఉపయోగపడుతుంది. ఒక పాత్రలో కొబ్బరి పీచు వేసి నల్లగా మరేంతవరకూ వేయించుకోవాలి. తర్వాత దాన్ని మెత్తగా పొడిగా చేసుకుని అందులో కొబ్బరి నూనె ఆవనూనె వేసి ప్లేస్ట్‌గా చేసుకుని రంగు మారుతుంది. ✦. కొంతమంది ఆర్థరైటిస్ కారణంగా బాధపడుతుంటారు. అలాంటి వారికి కొబ్బరి ఔషధంలా పనిచేస్తుంది. ఈ పీచుతో టీ తయారు చేసుకొని తాగడం వల్ల దీనిలో ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పులను నయం చేస్తాయి. □



ఆరోగ్య భాగ్యం


# చెంచలాకు ప్రయోజనం

ఇది తేమగల ప్రాంతాల్లో, బీడు భూముల్లో పొలం గట్ల వెంట వాటంతట అదే పెరగడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరగడం వల్ల వీటిని గ్రామీణ ఆహారంగా ఉపయోగిస్తారు. ఇది అనేక ఔషధ గుణాలు కల్గిన కలుపు మొక్క దీన్ని కలుపు మొక్కగా భావించి చాలా మంది పీకి పారేస్తుంటారు. దీనిలో ఔషధ గుణాలెక్కువగా ఉండడం వల్ల సర్వ ఔషధిగా సంప్రదాయ వైద్యంలో ఉపయోగిస్తారు. వీటిని ప్రత్యేకంగా ఎవరూ పెంచరు. వర్షాకాలంలో దానంతట అదే ఎక్కువగా పెరుగుతుంది. ఈ సన్నని ఏకవార్షిక మొక్క చూడడానికి తోటకూరలాగా ఉండి పింక్ కలర్ పూలు, గింజలతో ఉండడం వల్ల దీన్ని ఫాల్స్ అనురాంథస్ అంటారు. దీని పూల మకరంధాన్ని పిల్లలు ఆడుకోవడానికి నోట్లో పెట్టుకోని పీలుస్తారు. ఇది ఇండియా, ఇండోనేషియా, ఆఫ్రికా మలేసియా, ఆసియా దేశాల్లో 8,000 సంవత్సరాలకు పూర్వమే ఉండే పురాతన సూపర్ పంట అని చెప్పాలి. మనల్ని రక్షించే మొక్కగా గుర్తించి దీని గుండ్రని బూడిద రంగు విత్తనాలతో ఉష్ణమండల దేశాల్లో సాగుచేయడమైంది. దీన్ని కరువు ప్రాంతాల్లో వాడే పౌష్టికాహార మొక్కగా గుర్తించడ మైంది. దీన్ని కరువు మొక్క అని పిలుస్తారు. ఇది ఆషాడమాసంలో సెప్టెంబర్ నుండి డిసెంబరు వరకు దొరికే బహు ముఖ ఔషధ మొక్క. ఇది అడవుల్లో అరణ్యాల్లో, కొండప్రాంతాల్లో గింజనులు, జానపదులు, గ్రామీణులు ఎక్కువగా వాడే ఆకుకూర. ఇది ఎండాకాలంలో కాయకష్టం చేసేవారి శరీరంలో ఉన్న వేడిని తగ్గించి చలువ చేసే శీతలీకరణి అని చెప్పవచ్చు శరీర ఉష్ణోగ్రతని న్యూట్రలైజ్ చేసి అవయవాల్ని ఉత్తేజం చేసే పెద్దలకూర అని చెప్పాలి. దీన్ని చెంచలాకు, చెంచలి. చెంపలాకు, చెంచలిసొప్పు, కట్టుచీర, కుంజర్, అరణ్య, అరణ్యవస్తుక, చుక్రికాంచం, కురంజర, కరిగాంధారి, లాట్‌మహార్రై, గెట్నా, కెకనీ, తుయిల్‌కీర్తై, కుణాన్, లతావకారి, కంజారో, తాండులా, కురరదా, కబరి, లోలరు లేస్వా, ఘంద్రో, తొయ్యకిరాయి అని వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. దీని శాస్త్రనఈ తయనామం డిగేరా మూరియకాటా. ఇది అనురాంధేసి ఫ్యామిలీకి చెందినది. 75 జాతుల రకాల్లో ఇది ఒకటి అమరాంధస్ అంటే వాడిపోని పువ్వు అని అర్థం, దీన్ని ఆహారంలో ఒక భాగంగా తీసుకుంటే ఏలాంటి రోగాలు లేకుండా 100 ఏళ్ళు జీవించవచ్చని గ్రామీణుల నమ్మకం. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# సందడి చేస్తోన్న 'అమరకావ్యం'



ధనుష్, కృతి సనన్ సూపర్బ్ కెమిస్ట్రీతో ఆకట్టుకుంటోన్న 'అమరకావ్యం' (తేరే ఇష్క్ మై) ట్రైలర్.. హిందీతో పాటు తమిళ, తెలుగు లోనూ థియేటర్స్‌లో సందడి చేస్తోన్నసినిమా ధనుష్, కృతి సనన్ హీరో హీరోయిన్లుగా ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో భూషణ్ కుమార్ నిర్మించిన చిత్రం తేరే ఇష్క్ మైకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ దక్కుతోంది. ఇప్పటికే సినిమా బాక్సాఫీస్ దగ్గర దూసుకెళ్తోంది. ధనుష్, కృతి నటనకు ప్రేక్షకులు ఫిదా అయ్యి వారిని ప్రశంసిస్తున్నారు. సినిమాలోని పాత్రలు, వాటి మధ్య ఉన్న ఎమోషన్స్, ఎ.ఆర్.రెహ్మాన్ సంగీతం ఇలా అన్నీ కలిసి ప్రేక్షకులను మెప్పిస్తున్నాయి. హీరో హీరోయిన్ మధ్య ప్రేమ, కొన్ని పరిస్థితుల్లో హీరో ప్రేమను కోల్పోవటం, ఆ బాధ నుంచి బయటకు రావటం వంటి ఫీలింగ్స్‌ను ట్రైలర్‌లో చాలా చక్కగా చూపించారు. కథలోని డెప్త్, ప్రేమలోని తెలియని బాధలను కూడా ప్రేక్షకులు మెచ్చే రీతిలో తెరకెక్కించారు. గుల్షన్ కుమార్, టి సిరీస్, కలర్ ఎల్లో సమర్పణలో రూపొందిన తేరే ఇష్క్ మై సినిమాను ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ, భూషణ్ కుమార్, కృష్ణ కుమార్ నిర్మించారు.

# తెర

# చిరు, నయన శశిరేఖ పాటతో..



మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ మాస్ అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మన శంకర వర ప్రసాద్ గారులో నయనతార కథానాయికగా నటించింది. హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తు న్నారు. షైన్ స్క్రీన్స్ , గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై శ్రీమతి అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా సంగీత ప్రయాణం ఫస్ట్ సింగిల్ మీసాల పిల్లతో అద్భుతంగా ప్రారంభమైంది. ఇది 75 మిలియన్ల+ వ్యూస్‌ను సాధించింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ తర్వాత, మేకర్స్ ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్‌డేట్‌తో వచ్చారు. సెకండ్ పోస్టర్ సూచించినట్లుగా, ఫుట్‌ట్యాపింగ్ బీట్‌లతో నిండిన మరో మెలోడియస్ ట్రాక్ అవుతుందని హామీ ఇస్తుంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూర్చిన ఈ పాట ప్రోమో డిసెంబర్ 6న విడుదల అవుతుంది. లిరికల్ వీడియో డిసెంబర్ 8న విడుదల అవుతుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న విక్టరీ వెంకటేష్ తన షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్నారు. ప్రొడక్షన్ పూర్తయ్యే దశకు చేరుకుంది. చిరంజీవి, వెంకటేష్ ఇద్దరూ కలిసి నటించిన మాస్ డ్యాన్స్ నంబర్ మరో మెయిన్ హైలైట్‌గా ఉండబోతోంది. 2026 సంక్రాంతికి మన శంకర వరప్రసాద్‌గారు బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌గా ప్రేక్షకులు ముందుకు రానుంది.

# 'సైక్ సిద్ధార్థ'లో విమెన్ క్యారెక్టర్

## యామిని భాస్కర్



యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్ స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థలో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది.

**ఈ ప్రాజెక్టు ఎలా వచ్చింది? కథ విన్నప్పుడు ఎలా అనిపించింది?**

నర్తనశాల తర్వాత రెండేళ్ల గ్యాప్ వచ్చింది. కోవిడ్ తర్వాత ఏం సినిమా, క్యారెక్టర్ చేయాలని ఆలోచిస్తున్నప్పుడు, డైరెక్టర్ వరుణ్ ఫ్రెండ్ మా కమ్యూనిటీ లోనే ఉంటాడు. మేము కలిసి వాకింగ్ చేస్తుంటాము. అప్పుడు ఈ కథ చెప్పాడు. తర్వాత డైరెక్టర్ వరుణ్ ని కలిశాను. ఆయన కథ చెప్పిన విధానం నాకు చాలా నచ్చింది. వెరీ స్ట్రాంగ్ ఇండిపెండెంట్ విమెన్ క్యారెక్టర్ చేశాను.

**ఈ సినిమా టీజర్ ట్రైలర్ బయటకు వచ్చిన తర్వాత అర్జున్ రెడ్డి తో పోలికలు వచ్చాయి కదా?**

పోస్టర్ లుక్కు అలా ఉంటుందేమో కానీ ఈ కథకు అర్జున్ రెడ్డికి సంబంధం లేదు. అర్జున్ రెడ్డి, సిద్ధార్థ ఈ రెండు క్యారెక్టర్ లో టోటల్ డిఫరెంట్.

**ఈ సినిమాలో హీరోతో మీ జర్నీ ఎలా ఉండబోతుంది?**

ఇందులో నా క్యారెక్టర్ పేరు శ్రావ్య. ఒక హానికరమైన రిలేషన్ నుంచి బయటకు వచ్చి స్వతహాగా బ్రతకాలనుకుంటుంది.

**నందు గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

నందు మహిళల పట్ల చాలా గౌరవంగా ఉంటాడు. చాలా జెన్యూన్ పర్సన్. చాలా మంచి మనిషి. నందుతో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. సురేష్ బాబు గారు ఈ సినిమాని తీసుకోవడం మా అందరికీ పెద్ద సర్ప్రైజ్. రామానాయుడు స్టూడియోలో మా సినిమా పోస్టర్ చూసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

సినిమాను భవ్య క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొద్యూసర్ వి. ఆనంద్ ప్రసాద్ నిర్మించారు. జెనూస్ మొహమద్ దర్శకత్వం

# థ్రిల్లర్ మూవీ 'డ్రైవ్' టీజర్ రిలీజ్



ఆది పినిశెట్టి హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ మూవీ "డ్రైవ్". ఈ చిత్రంలో మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్ గా కనిపించనుంది. "డ్రైవ్" సినిమాను భవ్య క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొద్యూసర్ వి. ఆనంద్ ప్రసాద్ నిర్మించారు. జెనూస్ మొహమద్ దర్శకత్వం వహించారు. ఈ నెల 12న "డ్రైవ్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ ను రిలీజ్ చేశారు. "డ్రైవ్" సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే తన తండ్రి స్థాపించిన ప్రజా మీడియా కార్పొరేషన్ వారసుడిగా సంస్థను విజయవంతంగా నిర్వహిస్తుంటాడు హీరో ఆది పినిశెట్టి. సౌత్ ఇండియాలో పేరున్న ఈ సంస్థ అక్కౌంట్స్ ను ఒక హ్యాకర్ హ్యాక్ చేస్తాడు. ఈ హ్యాక్ తో ప్రజా మీడియా కార్పొరేషన్ గౌరవం, క్రెడిబిలిటీ ప్రశ్నార్థకంలో పడతాయి. ఈ హ్యాకర్ ఎవరు ?, ప్రజా మీడియా కార్పొరేషన్ తో పాటు హీరో పర్సనల్ లైఫ్ ను ఎందుకు టార్గెట్ చేశాడు ?. ఆ హ్యాకర్ ను హీరో పట్టుకోగలిగాడా ? లేదా ? అనేది టీజర్ లో ఆసక్తి కలిగిస్తోంది.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' సాంగ్ రిలీజ్



నాగ శౌర్య, శ్రీదేవి విజయ్ కుమార్, రామ్ దేశినా, శ్రీనివాస రావు చింతలపూడి, శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్' నుంచి ఎమోషనల్ సాంగ్ పొమ్మంటే రిలీజ్ హీరో నాగ శౌర్య యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్' తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహించారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్ పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి, టీజర్ కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. ఈరోజు, సినిమాలోని పొమ్మంటే అనే ఎమోషనల్ పాటను విడుదల చేశారు.హారిస్ జయరాజ్ స్వరపరిచిన పొమ్మంటే, మెలోడీ, ఎమోషన్ ఆకట్టుకుంది. విడిపోవడం వల్ల కలిగే బాధను, తోబుట్టువుల అనుబంధాన్ని అందంగా ప్రజెంట్ చేసింది. రచయిత చంద్రబోస్ మనసుకి హత్తుకునే సాహిత్యం రాశారు, గాయకులు విజయ్ యేసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ తమ వోకల్స్ తో మరింత హార్ట్ టచ్చింగ్‌గా మలిచారు. ఈ పాట చాలా కాలం పాటు నిలిచిపోతుంది.

# 'దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే'కు 30 వసంతాలు పూర్తి



లండన్ లీసెస్టర్ స్క్వేర్‌లో రాజ్, సిమ్రాన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్క రించిన షారూఖ్ ఖాన్, కాజోల్ లండన్ లీసెస్టర్ స్క్వేర్‌లో షారూఖ్ ఖాన్, కాజోల్ విగ్రహావిష్కరణతో తొలి భారతీయ సినిమాగా గుర్తింపు పొందిన దిల్ వాలే దుల్హనియా లే జాయేంగే ఆదిత్య చోప్రా దర్శకత్వం వహించిన దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే సినిమా ఎక్కువ కాలం థియేటర్స్‌లో ప్రదర్శింపబడ్డ చిత్రం లోని ఓ సన్నివేశాన్ని ప్రతిబింబిస్తోన్న విగ్రహంబాలీవుడ్ స్టార్స్ షారూఖ్ ఖాన్, కాజోల్ ఈరోజు లీసెస్టర్ స్క్వేర్‌లో కొత్త కంచు విగ్రహాన్ని ఆవిష్కరిం చారు. యష్ రాజ్ ఫిల్మ్స్‌లో 30 సంత్సరా లను పూర్తి చేసుకున్న ఈ బ్లాక్ బస్టర్ మూవీలోని రాజ్, సిమ్రాన్ పాత్రలకు సంబంధించిన ఐకానిక్ స్టిల్‌ను కాంస్య విగ్రహంగా రూపొందించారు. ఈ విగ్రహం వరల్డ్ వైడ్‌గా దక్షిణాసియాలో ఈ చిత్రానికి ఉన్న శాశ్వతమైన పాప్ కల్చర్‌ను ప్రభావితం చేసేలా సెలబ్రేట్ చేస్తోంది. లండన్ లీసెస్టర్‌లో విగ్రహ రూపంలో ఆవిష్కరింప బడ్డ తొలి ఇండియన్ సినిమా ఇదే.

# టి 20 వరల్డ్ కప్ రేసు నుంచి నలుగురు ఔట్



శ్రేయస్ అయ్యర్ · మొహమ్మద్ సిరాజ్ · నితీష్ కుమార్ · యశస్వి జైస్వాల్

ఆట

## పునర్నిర్మించడంపై బిసిసిఐ దృష్టి

**న్యూఢిల్లీ:** గత యేడాది ఛాంపియన్‌గా నిలిచిన భారత జట్టు, డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో 2026 టి20 ప్రపంచ కప్‌లో అడుగుపెట్టనుంది. ఈ టోర్నీకి శ్రీలంకతో కలిసి భారత్ ఆతిథ్యం ఇస్తోంది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. గ్రూప్ ఎ లో ఉన్న భారత్, అమెరికా, నమీబియా, పాకిస్థాన్, నెదర్లాండ్స్ జట్లతో తలపడనుంది. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత, రోహిత్ శర్మ నాయకత్వంలో భారత్ 2024లో టి20 ప్రపంచ కప్ సాధించింది. ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి కప్పు గెలిచిన వెంటనే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా రిటైర్మెంట్ ప్రకటించారు. దీంతో యువ ఆటగాళ్లతో జట్టును పునర్నిర్మించడంపై బిసిసిఐ దృష్టి సారించింది. హార్దిక్ పాండ్యా, అభిషేక్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా వంటి నిలకడైన ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్‌కు అండగా ఉన్నారు. 2026 టి20 ప్రపంచ కప్ స్వదేశంలో టైటిల్‌ను కాపాడుకోవాలనే పట్టుదలతో ఉన్న భారత జట్టుకు సూర్యకుమార్ నాయకత్వం వహించనున్నాడు. ప్రపంచ కప్ సమయానికి జట్టు ఎంపికలో కొందరు కీలక ఆటగాళ్లు రేసు నుంచి తప్పుకునే అవకాశం ఉంది. ఈ ఆటగాళ్లలో ఎడమచేతి వాటం బ్యాటర్ యశస్వి జైస్వాల్ ప్రస్తుతం టెస్ట్ ఫార్మాట్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టినట్లు కనిపిస్తోంది. ఇటీవల వన్డేల్లో ఆశించిన స్థాయి ప్రదర్శన చేయలేకపోవడం జైస్వాల్‌కు ఇబ్బందిగా మారింది. మరోవైపు అభిషేక్ శర్మ దూకుడుగా ఆడటం, ఓపెనర్‌గా శుభ్‌మన్ గిల్ వైపు మొగ్గు చూపడంతో జైస్వాల్ ప్రాధాన్యత తగ్గింది. దక్షిణాఫ్రికా సిరీస్‌లో అతనికి చోటు దక్కకపోవడం కూడా ఇందుకు నిదర్శనం. అలాగే వైజాగ్‌కు చెందిన నితీష్ కుమార్ ఐపిఎల్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, టెస్ట్ ఫార్మాట్‌లో బిజీగా ఉండటం వల్ల టి20 ఎంపిక రాడార్‌లో వెనుకబడ్డాడు. జట్టులో శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా వంటి బలమైన పేస్ ఆల్ రౌండర్లు ఉండటంతో, నితీష్‌కు టి20 ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది. మహ్మద్ సిరాజ్ 2024 టీ20 ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యుడైనప్పటికీ, గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో పొట్టి ఫార్మాట్‌కు దూరమయ్యాడు. హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ వంటి బౌలర్లకు సెలెక్టర్లు ప్రాధాన్యత ఇస్తుండటంతో, సిరాజ్ ప్రపంచ కప్ జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇక అక్టోబర్ 25, 2025న ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడ్డాడు. అసలే టీ20 ఫార్మాట్‌లో రెగ్యులర్ సభ్యుడు కాని అయ్యర్, ఈ గాయం కారణంగా ప్రపంచ కప్ రేసుకు పూర్తిగా దూరమైనట్లే కనిపిస్తోంది. అతను గాయం నుంచి ఎప్పుడు కోలుకుంటాడనే దానిపైనే అతని అంతర్జాతీయ రీఎంట్రీ ఆధారపడి ఉంటుంది.



## సూపర్ కప్ ఫైనల్‌కు తూర్పు బెంగాల్

**న్యూఢిల్లీ:** సూపర్ కప్-2025లో పంజాబ్ ఫుట్‌బాల్ జట్టును 3-1 తేడాతో ఓడించి తూర్పు బెంగాల్ ఫైనల్‌కు చేరుకుంది. గోవాలో జరిగిన ఎఐఎఫ్‌ఎఫ్ సూపర్ కప్ మొదటి సెమీఫైనల్లో ఈస్ట్ బెంగాల్ పంజాబ్ ఎఫ్‌సిని ఓడించడంతో మొహమ్మద్ బాసిమ్ రషీద్, కెవిన్ సిబిల్లె మరియు సాల్ క్రెస్పో ఒక్కొక్క గోల్ చేశారు. పంజాబ్‌కు చెందిన షేర్స్ కోసం డేనియల్ రామిరేజ్ ఏకైక గోల్ కోసం పెనాల్టీని మలిచారు. మోహన్ బగన్ సూపర్ జెయింట్ చేతిలో స్వల్ప తేడాతో ఓటమి తర్వాత, తూర్పు బెంగాల్ జట్టు 3 వ సూపర్ కప్ ఫైనల్‌కు చేరుకుంది. 12వ నిమిషంలో మొహమ్మద్ బాషిమ్ రషీద్ ద్వారా ఈస్ట్ బెంగాల్ ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత డేనియల్ రామిరేజ్ పెనాల్టీ స్పాట్ ద్వారా గోల్ చేసి ఈక్వలైజర్‌ను గోల్‌గా మార్చాడు. కానీ 71వ నిమిషంలో కెప్టెన్ సాల్ క్రెస్పో ఆస్కార్ బ్రూజోన్ జట్టుకు గోల్ చేశాడు. ప్రమ్వీర్ 10 నిమిషంలోనే క్రాస్ కొట్టడంతో పంజాబ్ తొలి పెద్ద అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. 12వ నిమిషంలో మొహమ్మద్ బాసిం రషీద్ కొట్టిన శక్తివంతమైన షాట్ గోల్ కీపర్‌ను దాటి గోల్ చేసింది. పంజాబ్ తొలి కార్నర్ కిక్‌ను క్లియర్ చేసిన తర్వాత మిడ్‌ఫీల్డర్ బంతిని బాక్స్ అంచున అందుకున్నాడు. కానీ పాలస్తీనియన్‌ను అడ్డుకోవడంలో డిఫెన్స్ నెమ్మదిగా ఉంది.డేనియల్ రామిరేజ్ ఫలితంగా వచ్చిన పెనాల్టీని సులభంగా గోల్‌గా మార్చాడు. ప్రభుసుఖన్ గిల్‌ను తప్పు మార్గంలో పంపి స్కోరును సమం చేశాడు. చివరికి, తూర్పు బెంగాల్ రెండు గోల్స్ ఆధిక్యాన్ని కొనసాగించి ఫైనల్‌కు చేరుకుంది.

### మహిళల జూనియర్ హాకీ ప్రపంచ కప్

## జర్మనీ చేతిలో భారత్ ఓటమి

**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల ప్రపంచ కప్ ప్రచారంలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు జర్మనీపై 1-3 తేడాతో ఓడిపోయింది. భారత్ తరపున హినా బానో (58వ నిముషం) ఏకైక గోల్ చేసింది. జర్మనీ తరపున లీనా ఫ్రెరిచ్స్ (5), అన్నికా స్కోన్‌హాఫ్ (52) మరియు మార్టినా రీసెనెగర్ (59) గోల్స్ చేశారు. ఈ పోటీలో జర్మనీ తొలి గోల్స్‌లో భారత్‌ను వెనక్కి నెట్టి ఐదవ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌ను సాధించింది. లీనా ఫ్రెరిచ్స్ (5) తన జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించింది. ప్రారంభంలో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ, భారత్ క్రమంగా అవకాశాలను సృష్టించుకోవడం ప్రారంభించింది. మొదటి క్వార్టర్‌లో సమం చేయడానికి అవసరమైన ముగింపు ఇవ్వలేకపోయారు. రెండవ క్వార్టర్‌లో మనీషా అత్యంత ముఖ్యమైన అవకాశాన్ని సృష్టించినా అది వృధాగా పోయింది. రెండవ అర్ధభాగం ముగిసే సమయానికి జర్మనీకి మరో పెనాల్టీ స్ట్రోక్‌తో ఆధిక్యం రెట్టింపు చేసుకునే అవకాశం లభించింది. ఆ సమయంలో లీనా ఫ్రెరిచ్స్ గోల్‌గా గోల్ చేయడంలో విఫలమవడంతో, మొదటి అర్ధభాగం 1-0తో ముగిసింది. రెండవ అర్ధభాగం చివరి క్వార్టర్‌లోకి వెళ్లేసరికి భారత్ ఇంకా ఒక గోల్ వెనుకబడి ఉంది. స్కోర్‌లను సమం చేసే గోల్ కోసం భారత ఆటగాళ్లు నిరంతరం ప్రయత్నించినా మరో పెనాల్టీ కార్నర్ నుండి దగ్గరగా వచ్చి గోల్ చేయలేకపోయారు. చివరికి అన్నికా స్కోన్‌హాఫ్ (52) ట్యాప్‌ఇన్ చేయడంతో జర్మనీ ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. చివరిలో భారతదేశం హీనా బానో (58) సహాయంతో పెనాల్టీ కార్నర్ నుండి సకాలంలో టచ్ ద్వారా గోల్‌ను గోల్‌గా మార్చింది. అయితే, జర్మనీ తరపున మార్టినా రీసెనెగర్ (59) మూడో గోల్‌తో జర్మనీ గెలిచింది.

## గౌహతి మాస్టర్స్.. సెమీఫైనల్‌కు తన్వి, అష్మిత





**న్యూఢిల్లీ:** గౌహతి మాస్టర్స్ 2025లో తన్వి శర్మ వరుసగా రెండో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ విభాగంలో అష్మితా చలిహా కూడా సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. 16 ఏళ్ల తన్వి శర్మ వరల్డ్ టూర్ ఇండియా లెగ్‌లో తన మంచి ఫామ్‌ను కొనసాగించింది. శుక్రవారం గౌహతిలో వరుసగా రెండో సెమీఫైనల్‌కు చేరుకుంది. గౌహతి మాస్టర్స్ సూపర్ 100 టోర్నమెంట్‌లో ఆమె తన తోటి దేశస్థురాలు తాన్య హేమంత్‌ను 21-17, 27-25 రెండు గేమ్‌లతో ఓడించింది. తన్వి మ్యాచ్‌ను ఘనంగా ప్రారంభించి తొలి గేమ్‌ను సునాయాసంగా గెలుచుకుంది. ఆట అంతటా ఆధిక్యంలో ఉంది. అయితే, రెండవ గేమ్‌లో ఆమె ఒత్తిడిలో మ్యాచ్ గెలవడానికి ముందు 4 గేమ్ పాయింట్లను కాపాడుకోవలసి వచ్చింది. మరోవైపు, గాయం నుంచి చాలా కాలం విరామం తర్వాత రెండు నెలల క్రితం తిరిగి ఆటలోకి వచ్చిన అస్మిత చలిహా, ఈ సంవత్సరంలో తన రెండవ సెమీఫైనల్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో, ఆమె తన తోటి దేశస్థురాలైన అనౌపమ ఉపాధ్యాయను 19 -21, 21-6, 21-12 తేడాతో మూడు గేమ్‌లలో ఓడించి వెనుకబడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రోహన్ కపూర్ మరియు రుత్విక గడ్డే కూడా 21-8, 21-10 తేడాతో భవ్య మరియు విశాఖపై వరుస గేమ్‌లలో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

### ఉమన్ ప్లేయర్ ఆఫ్ ది మంత్..


## అగ్రస్థానంలో షఫాలి



**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి జట్టును తొలి టైటిల్‌కు ప్రేరేపించిన భారత బ్యాట్స్‌మన్ షఫాలి వర్మ నవంబర్ నెలలో ఐసిసి మహిళల ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యారు. నెలవారీ గౌరవానికి నామినీలలో షఫాలీతో పాటు, ఇటీవల ముగిసిన ప్రారంభ ఐసిసి ఉమెన్స్ ఎమర్జింగ్ నేషన్స్ ట్రోఫీ నుండి ఇద్దరు పోటీదారులు, యుఎఇకి చెందిన ఇషా ఓజా, థాయిలాండ్‌కు చెందిన తిపట్చా పుట్టావోంగ్ ఉన్నారు.చివరి నిమిషంలో భారత జట్టులోకి ఎంపికైన షఫాలి, భారత్ తొలి ఐసిసి టైటిల్‌ను గెలుచుకున్న ఫైనల్‌లో అత్యధిక స్కోరు సాధించింది. నవంబర్‌లో ఆమె ఒకే ఒక ఓడిఐ మ్యాచ్‌లో ఆమె 78 బంతుల్లో 87 పరుగులు చేసి, 111.53 సగటుతో స్ట్రైకింగ్ చేసింది. షఫాలి బంతితో అందించిన సహకారం కూడా అంతే విలువైనది. ఆమె ఏడు ఓవర్లలో 36 పరుగులకు సునే లూస్, మారిజాన్ కాప్ రెండు కీలక వికెట్లు పడగొట్టింది. కీలక సమయాల్లో కీలకమైన భాగస్వామ్యాలను బద్దలు కొట్టింది. ఫైనల్‌లో ఆమె ఆల్ రౌండ్ ప్రతిభ ఆ ఒత్తిడి క్షణాల్లో ఆమె పరాక్రమాన్ని ప్రదర్శించింది.

### దలాల్‌స్ట్రీట్‌కు ఆర్‌బిఐ బొనాంజా


## లాభాల దౌడు తీసిన సూచీలు




**ముంబయి, డిసెంబరు 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలకమైన రెపో రేటును తగ్గించడంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. ఆర్బీఐ అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయం సూచీలకు జోష్ ఇచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 447.05 పాయింట్లు లాభపడి 85,712.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 152.7 పాయింట్లు పెరిగి 26,186.45 వద్ద ముగిసింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి చేర్చింది. పాలసీ వైఖరిని మాత్రం తటస్థంగానే కొనసాగించింది. దీంతో పాటు 2026 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాను 2.6 శాతం నుంచి 2 శాతానికి భారీగా తగ్గించింది. అదే సమయంలో వృద్ధి అంచనాను 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచింది. నిఫ్టీ కీలకమైన 26,000 పాయింట్ల మార్కుపైన స్థిరంగా ముగియడం సానుకూల సంకేతం. 26,000-26,100 స్థాయి వద్ద మార్కెట్‌కు బలమైన మద్దతు ఉందని, మార్కెట్ మరింత పైకి వెళ్లాలంటే 26,300 స్థాయిని దాటాల్సి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం పెరుగుదలతో టాప్ గెయినర్‌గా నిలిచింది. బ్యాంకింగ్, ఆటో, ఐటీ, మెటల్, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు లాభపడ్డాయి.

మరోవైపు మీడియా, ఫార్మా, ఎఫ్‌ఎంసీజీ సూచీలు నష్టపోయాయి. సెన్సెక్స్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు ప్రధానంగా లాభపడగా హిందుస్థాన్ యూనిలీవర్, సన్ ఫార్మా, టాటా మోటార్స్ వంటి షేర్లు నష్టపోయాయి.

## అనిల్ అంబానికి ఇడి మరోషాక్, రూ.1120 కోట్ల ఆస్తులు జప్తు



**ముంబయి, డిసెంబరు 5:** ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. యస్ బ్యాంక్ మనీలాండరింగ్ కేసులో దర్యాప్తును వేగవంతం చేసిన ఈడీ, శుక్రవారం రిలయన్స్ గ్రూప్‌లోని రూ.1,120 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్సీఎఫ్‌ఎల్)లలో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద ఈడీ జప్తు చేసిన ఆస్తులలో స్థిరాస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు, అన్‌కోటెడ్ ఇన్వెస్ట్‌మెంట్లు ఉన్నాయి. ఈ తాజా అటాచ్‌మెంట్‌తో ఈ కేసులో ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ.9,000 కోట్లకు చేరింది. అక్టోబర్ నుంచి ఇప్పటివరకు రూ.7,800 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ సహా పలు గ్రూప్ కంపెనీలకు చెందిన ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ముంబై, ఢిల్లీ, పుణె, చెన్నై వంటి నగరాల్లోని నివాస, వాణిజ్య భవనాలు, భూములు ఇందులో ఉన్నాయి. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్, ఆర్‌సీఎఫ్‌ఎల్ కంపెనీలు సేకరించిన ప్రజాధనాన్ని పక్కదారి పట్టించారన్న సీబీఐ ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. 2017-19 మధ్య యస్ బ్యాంక్ ఈ రెండు సంస్థలలో వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. అయితే, సెబీ నిబంధనలకు విరుద్ధంగా, తిరిగి ఈ నిధులను అంబానీ గ్రూప్ కంపెనీలకే మళ్లించి పాత అప్పులు తీర్చేందుకు (ఎవర్‌గ్రీనింగ్) వాడారని ఈడీ దర్యాప్తులో తేలింది. ఈ తాజా పరిణామాలపై అనిల్ అంబానీ గ్రూప్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## వార్నర్ బ్రదర్స్ కొనుగోలుకు నెట్‌ఫ్లిక్స్ భారీ డీల్..

### రూ.6.47లక్షల కోట్లకు బిడ్స్

**న్యూఢిల్లీ, డిసెంబరు 5:** వినోదరంగంలో గ్లోబల్‌స్థాయిలో భారీ డీల్ జరిగింది. వార్నర్ బ్రదర్స్ డిస్కవరీకి చెందిన స్టూడియోలు, స్ట్రీమింగ్ యూనిట్ కొనుగోలు చేసేందుకు నెట్‌ఫ్లిక్స్ భారీ డీల్ కుదుర్చుకుంది. సుమారు 72 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.6.47 లక్ష లకోట్ల డీల్ జరుగుతోంది. ఒక్కో వార్నర్ బ్రదర్స్ షేరుకు రూ.27.75 డాలర్లు చెల్లించేందుకు నెట్‌ఫ్లిక్స్ బిడ్‌వేసింది. సిఎన్‌ఎన్, టిబిఎస్, టిఎన్‌టీ వంటి కేబుల్ ఛానళ్లలో ప్రారంభించిన మార్పుల ప్రకియను వార్నర్‌బ్రదర్స్ పూర్తిచేయాలి. ఆ తర్వాతనే కొనుగోలుప్రక్రియను నెట్‌ఫ్లిక్స్ షురూ చేస్తుంది.

హాలివుడ్‌లో ఎంతో విలువైన కంపెనీగా ఉన్న నెట్‌ఫ్లిక్స్ ఈస్థాయి కొను గోలు చేపట్టడం ఇదే తొలిసారి. లైబ్రరీ, స్టూడియో వంటివేవీ లేకుండానే ఈసంస్థ ఈస్థాయికి చేరుకుంది. ఇతరులనుంచి లైసెన్స్ ఉన్న ప్రోగ్రామ్స్ తీసుకుని వాటిని ఒరిజినల్ కంటెంట్‌కింద మార్చుకుంటూ వచ్చింది. ఈకొనుగోలుతో హెచ్‌బిఒకు నెట్‌ఫ్లిక్స్ యజమాని అవుతుంది. ది సొప్రానోస్, దివైట్ లోటస్ వంటి హిట్‌షోల లైబ్రరీ కూడా నెట్‌ఫ్లిక్స్ సొంతం అవు తుంది. హ్యారీ పోటర్, ఫ్రెండ్స్ వంటి సినిమా, టివి ఆర్కైవ్స్ కూడా నెట్‌ఫ్లిక్స్ చేతుల్లోకి వెళ్లిపోతాయి.

## హోమ్‌లోన్ కస్టమర్లకు ఆర్బీఐ ఊరట..



**ముంబయి, డిసెంబరు 5:** భారత రిజర్వుబ్యాంకు రెపోరేటును 25 బేసిస్‌పాయింట్లు తగ్గించడంతో రెపోరేటు 5.25శాతానికి దిగివచ్చింది. దీనితో ఆర్బీఐ నాలుగుసార్లు వడ్డీరేట్లు సడలించడంతో ఈ ఏడాది 125 బేసిస్‌పాయింట్లు రెపోరేటు తగ్గింది. వీటివల్ల గృహరుణాలు తీసుకున్నవారికి పెద్ద మొత్తంలో ఆదా అవుతోంది. ఆర్బీఐ 100 బేసిస్‌పాయింట్లు రెపోరేటును తగ్గించడంతో వడ్డీ ప్రయోజనాన్ని ఇప్పటికే బ్యాంకులు రుణగ్రహీతలకు బదిలీచేసాయి. తాజాగా మరో 25 బేసిస్ పాయింట్లుకూడా తగ్గించడంతో బాహ్య బెంచ్ మార్క్ లెండింగ్‌రేట్(ఇబిఎల్ఆర్)తో ముడిపడిన గృహరుణాల ఈఎంఐ భారతం తగ్గుతుంది. గత ఏడాది వరకూ 9 శాం ఉన్న వడ్డీరేట్లు ఇపుడు 7.5శాతం కంటే తక్కువకే వసానతయి. దీనివల్ల దీర్ఘకాలంలో వినియోగందారులకు ఆదా అవుతుంది. రూ.50లక్షల రుణంపై 125 బేసిస్‌పాయింట్లు తగ్గింపువల్ల దీర్ఘకాలంలో సుమారు రూ.9 లక్షలమేర ఆదా అవుతుందని ఆర్థిక నిపుణులు చెపుతున్నారు. గృహరుణ వినియోగదారులకు లాభాలే అయినా డిపాజిటర్లకు మాత్రం నష్టమేనని చెపుతున్నారు. తాజా నిర్ణయంతో బ్యాంకులు, స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకులు ఎఫ్‌డీ వడ్డీరేట్లను తగ్గిస్తాయి. ఇప్పటికే ఎఫ్‌డిచేసినవారిపై ప్రభావంలేకపోయినా కొత్తగా డిపాజిట్‌చేసేవారికి తక్కువ వడ్డీ వస్తుంది. దీర్ఘకాలిక ఎఫ్‌డిలపై కొన్ని బ్యాంకులు గరిష్టంగా 7 నుంచి 7.25 శాతం వడ్డీని ఇస్తున్నాయి. ఈమొత్తం మరింత తగ్గే సూచనలున్నాయి.

## భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఆర్బీఐ కీలక నిర్ణయం

### రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గింపు



**ముంబయి, డిసెంబరు 5:** భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఊతమిచ్చే దిశగా భారత రిజర్వ్ బ్యాంకు రెపోరేట్లపై కీలకనిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు (0.25 ) తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన ద్రవ్య పరపతి కమిటీ (ఎంపిసి) సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ తగ్గింపుతో రెపో రేటు 5.5 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గింది. గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో నగదు లభ్యతను పెంచేందుకు మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఓపెన్ మార్కెట్ ఆపరేషన్ల ద్వారా లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. దీనికి అదనంగా 5 బిలియన్ డాలర్ల విలువైన డాలర్‌రూపాయి స్వాప్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి 8.2 శాతానికి చేరడం, ద్రవ్యోల్బణం 1.7 శాతానికి పడిపోవడం భారత ఆర్థిక వ్యవస్థకు గోల్డెన్ పీరియడ్ అని ఆయన అభివర్ణించారు. ద్రవ్యోల్బణం అదుపులో ఉండటం వల్లే వృద్ధికి మద్దతుగా వడ్డీ రేట్ల కోతకు అవకాశం లభించిందని వివరించారు. ఈ సానుకూల పరిణామాల నేపథ్యంలో దేశ జీడీపీ వృద్ధి అంచనాను కూడా 6.8 శాతం నుంచి 7.3 శాతానికి పెంచుతున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ద్రవ్య విధానంలో తటస్థ వైఖరిని కొనసాగించాలని నిర్ణయించినట్లు మల్హోత్రా స్పష్టం చేశారు. ఆగస్టు, అక్టోబర్ నెలల్లో జరిగిన సమీక్షల్లో ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదని గుర్తుచేశారు. దేశ విదేశీ మారక నిల్వలు 686 బిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరాయని, ఇది 11 నెలల దిగుమతులకు సరిపోతుందని తెలిపారు. అయితే, ప్రపంచ వాణిజ్య అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక వ్యవస్థకు ప్రతికూల అంశాలుగా కొనసాగుతున్నాయని హెచ్చరించారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం వల్ల బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రయోజనాలను వాణిజ్య బ్యాంకులు ఎంత వేగంగా వినియోగదారులకు అందిస్తాయన్న దానిపైనే అసలైన ఫలితం ఆధారపడి ఉంటుంది.

## పసిడి ధరల్లో స్వల్పమార్పులు..డాలర్ బలహీనం-రూపాయి పటిష్టం



**ముంబయి, డిసెంబరు 5:** భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ద్రవ్య విధాన ప్రకటన వెల్లడించిన నేపథ్యంలో శుక్రవారం ట్రేడింగ్‌లో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అయితే, బలహీనపడిన అమెరికా డాలర్, స్పాట్ మార్కెట్‌లో నిలకడగా ఉన్న డిమాండ్ కారణంగా పసిడి ధరల పతనం పరిమితంగానే ఉంది. మరోవైపు భారత రూపాయి విలువ కోలుకుంది. శుక్రవారం ఉదయం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి గోల్డ్ ఫ్యూచర్స్ 0.14 శాతం తగ్గి 10 గ్రాములకు రూ. 1,29,892 వద్ద ట్రేడవుతోంది. అదే సమయంలో మార్చి సిల్వర్ కాంట్రాక్టులు 0.74 శాతం పెరిగి కేజీకి రూ. 1,79,461 పలికాయి. ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. ఇటీవల వెలువడిన స్థూల ఆర్థిక గణాంకాలు మిశ్రమంగా ఉండటంతో కేంద్ర బ్యాంకు వడ్డీరేట్లను తగ్గిస్తుందా? లేక యథాతథంగా ఉంచుతుందా?అనే దానిపై నిపుణుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అంతర్జాతీయంగా ఈరోజు వెలువడనున్న అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురు చూసారు. ఈ డేటా ఆధారంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కరెన్సీ మార్కెట్‌లో తీవ్ర ఒడుదొడుకుల తర్వాత రూపాయి విలువ పుంజుకుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 9 పైసలు బలపడి 89.80 వద్ద ప్రారంభమైంది. ముందరోజు కూడా రూపాయి 26 పైసలు బల పడి 89.89 వద్ద ముగిసింది. అంతకుముందు విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, ముడిచమురు ధరల పెరుగుదల వంటి కారణాలతో రూపాయి తొలిసారిగా 90 మార్కును దాటి 90.15 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోయిన విషయం తెలిసిందే.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.